# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి - 4

## నాటకాలు - భాగం -2



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాదు

# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటం - 4

### సాంఘిక నాటకాలు

పాలేరు
మానవుని మరొక మజిలీ
కూలిరాజు
పైరుపాట
అసూయ
ప్రగతి
పడిపోతున్న అడ్డుగోడలు
స్నేహసుందరి

ప్రధాన సంపాదకులు

**డా॥ ఆవుల మంజులత**

సంపాదకులు

**ఆచార్య కె. ఆనందన్**

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

**Complete Works of Boyi Bhimanna Vol-IV, Part-2**
Padmabhushan Dr. Boyi Bhimanna Sahitya Peetham
Potti Sreeramulu Telugu University
Hyderabad -500 004

**పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం**
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్- 500 004

**©పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

ప్రథమ ముద్రణ: జులై, 2008
ప్రతులు : 1000
వెల : 145/-

**ISBN No: 81-86073-205-9**

ముఖచిత్ర రచన : ఆర్. మురళి

ప్రతులకు:
రిజిస్ట్రార్
**పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాద్ - 500 004

**డి.టి.పి:** సి. రామకృష్ణ, మాధవి గ్రాఫిక్స్

**ముద్రణ:** కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
విద్యానగర్, హైదరాబాద్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
**పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**
హైదరాబాద్ - 500 004

**ఆచార్య కె. ఆనందన్**
కన్వీనర్

# మనవి

బోయి భీమన్న సాహితీ క్షేత్రంలో పండించిన కుసుమాలలో నాటక సాహిత్యం పేర్కొనదగింది. భీమన్న తాను నమ్మిన సిద్ధాంతాల ప్రచారానికి రకరకాల సాహితీ ప్రక్రియల్ని చేపట్టి రచన చేస్తుంటాడు. భీమన్న అన్న వెంటనే స్ఫురణకు వచ్చేది పాలేరు, కూలిరాజు నాటకాలు. అవి అంతగా సమాజాన్ని ప్రభావితం చేశాయి.

భీమన్న రాగవాసిష్ఠం, బాలయోగి, వాల్మీకి, ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు లాంటి పౌరాణిక నాటకాలను పాలేరు, కూలిరాజు, అసూయ, పడిపోతున్న అడ్డుగోడలు, ప్రగతి లాంటి సాంఘిక నాటకాలను రచించాడు. చిత్రకళా ప్రదర్శన, మానవుని మరొకమజిలి, పైరుపాట, స్నేహసుందరి లాంటి సంగీత నృత్య రూపకాలు రచించాడు.

భీమన్నగారు పాలేరు తనం సంకెళ్ళను తెంచుకొని బయటికి రమ్మని ప్రబోధించాడు. ఒక మహా ఉద్యమానికి, చైతన్యానికి ప్రతీకగా విప్లవాత్మక కెరటంలా విరుచుకు పడ్డాడు. వ్యవసాయ కూలీల సాంఘిక, ఆర్థిక, రాజకీయ చైతన్యానికి, వారి న్యాయమైన కోర్కెల సాధనకు సమరశంఖారావాన్ని పూరించాడు.

కూలీలు రాజ్యమేలాలని, అప్పుడు గాని సంఘం బాగు పడదని మథన పడ్డాడు. వ్యవసాయ కూలీలు, భూస్వాముల మధ్య జరిగిన ధర్మపోరాటాన్ని నాటకాల్లో చక్కగా ప్రదర్శించాడు.

ప్రగతి అంటే ప్రకృతిసిద్ధమైన గమ్యంకాదని అదొక విలక్షణమైన మానవ మేధస్సును సాధించగల కళాత్మక పురోగమనమని అంటాడు భీమన్న. ప్రేమకు, కామానికి, ఉన్నతికి, పతనానికి సిద్ధాంతానికి, ఆచరణకు ఎంత వ్యత్యాసముందో వివరించిన సద్విమర్శకుడు.

భీమన్న ఇతివృత్తంలో సమకాలీనత, కావ్య నాయకుడిలో విశ్వమానవత, రచనా శిల్పంలో రసభావరమణీయత గల 'క్లాసిక్' నాటకాలెన్నో రచించాడు.

సర్వోదయ సోషలిస్ట్‌పార్టీ, సోషలిస్ట్ వ్యవస్థ, స్థాపనకోసం, గ్రామ పునర్నిర్మాణంలో విద్యార్థుల పాత్రను ప్రబోధించే ప్రబోధాత్మక నాటకాలెన్నో రాశాడు.

సంప్రదాయసాహిత్యంలోని మహిమాన్వితమైన, మహాశక్తి సంపన్నమైన పాత్రల ద్వారా కులనిర్మూలన చేయడానికి ఉద్యమించిన గొప్ప సంఘ సంస్కర్త.

భీమన్న దళిత జాతుల మూలాలను సాక్ష్యాధారాలతో నిరూపించి వారిని అభ్యుదయ గాముల్ని చేయడానికి ప్రయత్నించాడు.

యోగశక్తికి, దైవత్వానికి, ఋషిత్వానికి కులంతో పనిలేదని వర్ణాంతర వివాహాల ద్వారా దళితాభ్యుదయాన్ని సాధించవచ్చని భీమన్న అంటాడు. భారత జాతి కులవ్యవస్థ కారణంగా బలహీన పడిందని, పంచములు సవర్ణ కులాలతో సమాన స్థాయికి చేరడానికి కావలసిన చికిత్స జరగాలని ఆకాంక్షించాడు.

భీమన్న చాలా రచనల్లో హరిజనులు ఆర్యులేనని ప్రతిపాదించడానికి బలమైన ఆధారాల్ని చూపించాడు. ఆయన నాటకాలలో సంఘర్షణాత్మక సంభాషణల్ని ప్రవేశపెట్టి వ్యక్తుల్ని, జాతుల్ని, గుణాల్ని ఆశ్రయించి సాగే పోరాటాన్ని జాజ్వల్య మానం చేశాడు.

బోయి భీమన్న కావ్యాల్ని సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతీ భీమన్న ఆయన రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మా మిత్రులు శ్రీగనుమల జ్ఞానేశ్వర్, బోయి భీమన్నగారి పుత్రులు డా॥ బోయి నాగవర్మగారు అందించారు. ఈ నాటకాలను సమగ్రంగా తీసుకు రావడానికి సహకరించిన వీరందరికి కృతజ్ఞతలు. ఈ నాటకాలను చక్కగా డి.టి.పి. చేసిన సి. రామకృష్ణ (మాధవి గ్రాఫిక్స్) కు, ప్రూఫులు దిద్ది సహకరించిన డా॥ మాదిరాజు కనకదుర్గ, శ్రీమతి కంచర్ల మాధవి, ముఖచిత్రరచన చేసిన ఆర్. మురళి, అందంగా ముద్రించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు.

కె. ఆనందన్

కె. ఆనందన్

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004

డా॥ ఆవుల మంజులత
ఉపాధ్యక్షులు

---

# డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠాన్ని తేది 19-09-06న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసింది.

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
3. భీమన్న రచనలపై విస్తృత పరిశోధనలు చేయడం
4. భీమన్న జీవితం రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడం.
5. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
6. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.
7. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
8. భీమన్న రచనలపైన వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.

9. భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.

10. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, కొన్నింటిని భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి శరవేగంతో పూర్తిచేస్తోంది. రాష్ట్రం నాలుగు చెరగులా, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న రచనలపై విస్తృత పరిశోధనలు చేయించటానికి లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి, ఒక్కొక్క గ్రంథాన్ని అప్పగించడం జరిగింది. డా॥ భీమన్న రచనలను ఇంగ్లీషులోకి అనువదించడానికి ప్రసిద్ధులైన అనువాదకులకు అప్పగించి పూర్తిచేయటం జరిగింది.

బోయి భీమన్నగారి నాటకాలను సేకరించి, రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాం. తెలుగువారు భాషా, సాహిత్యం, సంస్కృతి, రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలుకల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సద్విమర్శ దృక్పథంతో మీరందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం ఉంటుందని ఆశిస్తున్నాను.

(ఆవుల మంజులత)

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | పాలేరు | 1-128 |
| 2. | కూలిరాజు | 129-235 |
| 3. | అసూయ | 236-292 |
| 4. | పడిపోతున్న అడ్డుగోడలు | 293-321 |
| 5. | మానవుని మరొక మజిలీ | 322-508 |
| 6. | పైరుపాట | 509-592 |
| 7. | ప్రగతి | 593-666 |
| 8. | స్నేహ సుందరి | 667-701 |

| నాటకం | ప్రథమ ముద్రణ | విశ్వవిద్యాలయ ముద్రణ |
|---|---|---|
| పాలేరు | 1940 దేశికవితామండలి, విజయవాడ | 20వ ముద్రణ |
| కూలిరాజు | 1948 సర్వోదయ ప్రచురణ, మదరాసు | ఐదో ముద్రణ |
| అసూయ | 1948 సర్వోదయ ప్రచురణ, మదరాసు | ద్వితీయ ముద్రణ |
| పడిపోతున్న అడ్డుగోడలు | 1958 భమన్న సాహితీనిధి, హైదరాబాదు | ఐదో ముద్రణ |
| మానవుని మరొక మజిలీ | 1959 సుఖేలా నికేతనం, హైదరాబాదు | ద్వితీయ ముద్రణ |
| పైరుపాట | 1959 సుఖేలా నికేతనం, హైదరాబాదు | ద్వితీయ ముద్రణ |
| ప్రగతి | 1979 భమన్న సాహితీనిధి, హైదరాబాదు | ద్వితీయ ముద్రణ |
| స్నేహసుందరి | వ్యవసాయకూలీ కార్యాలయం, మదరాసు | ద్వితీయ ముద్రణ |

# పాలేరు

బోయి భీమన్న

# [illegible]

[illegible]

## బాణాకర్ర

ప్రపంచ శాంతికి మార్గం - ఒక
పౌరుష జీవితమే నోయ్!
కర్ర చేతిలో లేకుంటే
గొర్రె కూడ కరిచే నోయ్! (రాభీలు)

భారతీయ గ్రామాలలో రైతులకు, కూలీలకు కూడ ఆయుధాలు చేతి కర్రలే. నిలువెత్తు పొడవున వుండే వెదురు కర్రలవి. వాటినే బాణాకర్రలంటారు.

ఈ పీఠికకు బాణాకర్ర అని పేరు పెడుతున్నాను. ఎందుకంటె గ్రామీణ ప్రజలకు, ముఖ్యంగా పాలేళ్ళకు ఆత్మరక్షణ సాధనం అదే కనుక.

పాలేరు నాటకం నేను వ్రాసి ఏభైయేళ్లకు పైనే అయింది. స్వర్ణోత్సవం జరుపు కోవలసింది! "పాలేరు" కనుక, అంతటి అదృష్టం పట్టలేదు. పాలేళ్ల వర్గం ఇంకా అంత సంస్కార సంపన్నం కాలేదు.

ఈ నాటకం వ్రాత ప్రతిగా వున్నప్పుడే అనేక చోట్ల ప్రదర్శించబడింది. ప్రతి ప్రదర్శనకూ ఒక్కొక్క చరిత్ర వుంది. సామాజిక, విద్యా రంగాలలో, వ్యవసాయ కూలీ వర్గాలలో ఈ నాటకం సాధించిన మార్పు ఒక మహత్తర విప్లవ చరిత్రే! ఇందుకు సంబంధించిన కొన్ని ముఖ్య వివరాలు "పాలేరు నుంచి పద్మశ్రీ వరకు" అనే గ్రంథంలో చూడవచ్చు.

దీని ప్రథమ ముద్రణ బెజవాడలోని బొందలపాటి శకుంతలాదేవి, శివరామకృ ష్ణగార్ల దేశి కవితా మండలి నుంచి వెలువడింది. వారిది సొంత ప్రెస్సు. అక్కడి నుంచే అది ఎన్నో పునర్ముద్రణలు పొందింది. ఎన్నో వేల ప్రతులు అమ్ముడు పోయాయి.

పుస్తకవ్యాపారంలో తాము ఎంతో నష్టపోయామనీ, పాలేరు నాటకమే చాల వరకు తమను నిలబెట్టిందనీ శివరామకృష్ణగారు తరచు చెపుతూ వుండే వారు. ఈ నాటకం ఒక క్లాసిక్‌గా నిలిచిపోయిందని ఆయన అన్నప్పుడల్లా నేను ఆనందంతో పొంగిపోయేవాణ్ని!

నా రచన ఒకటి, ముఖ్యంగా పాలేరు వంటిది, ముద్రించబడి ప్రజల చేతుల్లోకి పోవడమే ఒక గొప్ప అదృష్టం. డబ్బు దేముందిలే అనుకొనేవాణ్ని నేను. నేను బెజవాడ వెళ్ళినప్పుడల్లా కూర్మయ్యగారింట్లో కాకపోతే, బొందలపాటి వారింట్లో దిగేవాణ్ని. ఆయన

మంచి భోజనం పెట్టి, రైలెక్కించి పంపిస్తుండే వాడు. అంతకంటె నాకింకేం కావాలి? ఆ రోజులు కూడ అలాంటివి! నేనొక అరటాకును. మరో దిక్కులేదు.

వ్యాపార దృష్ట్యా పాలేరు నాటకం ఒక కామధేనువు లాంటిదనీ, అప్పటికే లక్ష కాపీలకు పైగా అమ్ముడుపోయాయనీ పుస్తకాల దుకాణాలలో పుట్టిన పుకార్లను కొందరు పబ్లిషర్లు నా వరకు తేవడం, పాలేరును తమ కివ్వవలసిందిగా వారు నన్ను కోరడం జరుగుతూ వచ్చింది. నా "రాగోదయం", "మధుబాల" కావ్యాల ముద్రణ వ్యవహారంలో మాకు భిన్నాభిప్రాయాలు కలిగివున్న సమయంలో, ఒక దుర్ముహూర్తంలో దేశి కవితా మండలి నుంచి పాలేరు బైటపడడమూ జరిగింది.

దుర్ముహూర్తం అని ఎందుకంటున్నా నంటే – దేశి కవితా మండలితో ఒక పాతికేళ్ళ పాటు కొనసాగిన స్నేహానుబంధం తెగిపోయిన క్షణం అది. అంతే కాదు. అంతకుముందు పాలేరు పుస్తకాలు షాపుల్లో కనిపించేవి. ఆ తర్వాత – ఈ పాతికేళ్లుగా నేను మళ్లీ పాలేరు పుస్తకం చూడలేదంటే అతిశయోక్తి కాదు.

## రాశి, వాసి

ఈ మధ్య భాషా నిలయంలో జరిగిన ఒక యువకవుల కావ్యావిష్కరణ సభకు వెళ్లి ఆడియన్సులో కూర్చున్నాను. ఆ యువ కవులు రామానుజాచార్యులు, సుందర దేశికులు నాకు మిత్రులు.

కవులు యువకులైనా, వేదిక మీది వారంతా పెద్దలే. అందులో నాకు బాగా తెలిసిన సభాధ్యక్షులు నండూరి రామకృష్ణమాచార్యులుగారు, వక్తలు ఇరివెంటి కృష్ణమూర్తిగారు, కులశేఖరరావుగారు, సుధామ గారు – అందరూ లబ్ధ ప్రతిష్ఠులే. ఉన్నత విద్యా సంపన్నులే.

అయితే, సభ పలచగా వుంది. ఆడియన్సు ఎక్కువ మంది లేరు!

సభాధ్యక్షులు ఈ లోపాన్ని నిరుత్సాహక పదజాలంతో ఎత్తి చూపి, "అయినా, ఈ కాలంలో సాహిత్య సభలకు ఎక్కువ మంది రావడం లేదు. ఈ మధ్య జరిగిన అనేక సభల కంటె ఈ సభ చాల మెరుగు. రాశి కంటె వాసి మేలనే సత్యాన్ని మనం గుర్తిస్తే, సభలో ఎక్కువ మంది లేరనే విచారం మనకుండదు" అన్నారు.

ఆయన ఒక కథ చెప్పారు:

"ధర్మరాజు రాజసూయం చేసిన సందర్భంలో అన్న సంతర్పణ చేశాడు. ఎంత

మంది భోజనం చేశారో లెక్క తెలుసుకోవాలనుకొన్నాడు. అందుకు నారద మహర్షిని ఉపాయం అడిగాడు. నారదుడు ఒక గంటను ధర్మరాజు కిచ్చి, లక్ష మంది భోజనం చేసిన తర్వాత ఒకసారి చొప్పున ఆ గంట మోగుతుందనీ, అది ఎన్నిసార్లు మోగితే అన్ని లక్షల మంది భోజనాలు చేసినట్టు లెక్కగట్టుకోమనీ అన్నాడు.

భోజనాలు ప్రారంభమయ్యాయి. గంట క్రమంగా మోగుతూ వుంది. ఒక దశలో అది అదే పనిగా విడవకుండా మోగసాగింది. ధర్మరాజు కంగారు పడ్డాడు. గంట పాడయిందను కొన్నాడు.

గంట మంచిగానే వున్నదనీ, ఎన్నో లక్షల మందితో సమానుడైన ఎవరో మహాను భావుడు పంక్తిలో కూర్చున్నాడనీ, ఆయన భోజనం ముగించి లేచేవరకు గంట అలా మోగుతూనే వుంటుందనీ నారదుడు వివరించాడు. ఆ మహానుభావుడెవరో తెలిసింది. ఆయన వ్యాసుడు!

అలాంటి వ్యాసుడంతటి బోయి భీమన్నగారు ఆడియన్సులో వుండగా, రాశిని గురించిన బెంగ దేనికి? అన్నారాయన!

అంతవరకు ఆసక్తితో వింటున్న కథ నా మీదికి మళ్ళడంతో, ఆనందాశ్చర్య సంభ్రమాలు ముప్పిరిగొనగా, నండూరి వారి ఔదార్య ప్రతిభాప్రాభవాలకు చేతులు మోడ్చాను నేను. తక్కిన సదస్యులు ఎలా ఫీలయ్యారో మరి!

పాలేరు నాటకం వ్రాసిన తర్వాత, ఈ యాభై యేళ్ళలోను ఒక్కసారి కూడ ముద్రిత ప్రతి తెరిచి చూడని నేను, ఇప్పుడు దానిని చేతిలోకి తీసుకొన్నానంటే - అందుకు కారణం ఆ సభలో సాగిన ప్రసంగాలే. అందుకే ఆ సభను గూర్చిన ఈ ప్రస్తావన.

ఆ ప్రసంగాలలో మొత్తం మీద వక్తలు వెల్లడించిన అభిప్రాయం తెలుగు సాహిత్యంలో రాశి తప్ప వాసిలేదన్నది. అనుకరణ తప్ప మౌలికత లేదన్నది.

తెలుగు సాహిత్యంలో మౌలికత లేదా?

నిజంగానే లేదేమో! వుంటే, ఏదీ? ఎక్కడా కనిపించదేం? ఎక్కడ దాక్కుంది?

నన్నయగారి ఐతిహాసిక యుగం నుంచి పెద్దనగారి ప్రబంధయుగం వరకు అన్నీ తత్సమాలు. కృష్ణశాస్త్రిగారి భావకవితాయుగం నుంచి శ్రీశ్రీ గారి అభ్యుదయ కవితాయుగం వరకు ఆంగ్ల తద్భవాలు, అన్యదేశ్యాలు. మరి మనదని మురిసిపోగల మౌలిక సాహిత్యం ఏదీ? ఎక్కడుంది?

"కన్యాశుల్కం" లేదా అంటే, అది ఒక కులానికీ, ఒక మాండలికానికీ పరిమితమైన

స్థానికం. సాహిత్యానికి ప్రధాన గుణమైన సర్వ జనీనత కన్యాశుల్కంలో లేదు, మరి?

బ్రహ్మంగారు, వేమన, కవిరాజు, జాషువా వంటి పేర్లు సాహితీరంగ రింగు మాస్టర్లకు పనికిరావు. ఆ పేర్ల వాళ్లు పంక్తి బాహ్యులైన శూద్రులూ, వర్ణ బాహ్యులైన హరిజనులూను! మరి? చెప్పండి!

ఎంకి పాటలున్నై. అవును. అయితే, అవి నాయుడు బావతో ముడిపడి వున్నై! నాయుడు పంక్తి బాహ్యుడు కదా?

(1) కందం వ్రాసినవాడే కవి (2) తినుచున్న అన్నమే తినుచుంటి మిన్నాళ్ళు (3) వయస్సు మళ్ళిన సోమరులారా చావండి (4) తాజమహలును కట్టించిన షాజహాను కంటె, ఆయనకు తన భార్యపట్ల గల ప్రేమానురాగాల కంటె, ప్లాను చేసిన ఇంజనీరు కంటె, కట్టిన మేస్త్రీ కంటె రాళ్ళు మోసిన కూలీలే గొప్పవాళ్ళు!

ఇటువంటి పాక్షిక, ప్రగతి నిరోధక, మత్తు మందు మాత్రలను ప్రజలకు తినిపించడం వల్లనే మౌలిక సాహిత్యం ముందుకు రాలేకపోతున్నదన్న వాస్తవాన్ని ఎవరైనా గుర్తించారా?

కూలీలు గొప్పవాళ్ళే. వాళ్ళ శ్రమ శక్తి విలువ లేనిదే. అయితే కూలీలు శాశ్వతంగా కూలీలుగానే వుండిపోవాలనే దురుద్దేశం భూఖామందుల హృదయాలలో వున్నట్టే అభ్యుదయ కవుల రచనలలోనూ వుంది. పరిశీలించండి!

ఏ పనీ చెయ్యని నిరర్థకుడి పేదరికంపట్ల సానుభూతి దేనికి? కష్టపడి సంపాదించుకొన్న వాడి కలిమిపట్ల ద్వేషం దేనికి?

కోటీశ్వరుడైనా వ్యాపారం దెబ్బతింటే పేదవాడైపోతాడు. పేదవాడైనా ఏదో ఒక నిధి దొరికితే కోటీశ్వరుడైపోతాడు. కవిత్వానికి మానవుడే కవితా వస్తువు కావాలి. అతడి కలిమిలేములు కాదు.

కుల, రాజకీయ, వ్యాపార వైఖరిని వదులుకొని, విశ్వజనీన దృష్టితో పరిశీలిస్తే, తెలుగులో అపూర్వ ప్రతిభా ప్రాభవాలు గల మౌలిక రచనలెన్నో కనిపించక మానవు. అయితే, అలాంటి నిరామయ నిష్పాక్షిక దృష్టిగల పండితులేరి? స్వపర విభేద విష దృక్కులు తప్ప, విద్యా వినయ సంపన్ను లెక్కడ? వుంటే, బైటికి రండి! ప్రపంచ సాహిత్యంలోని ఉత్తమ రచనలను మించే ఉత్తమోత్తమ రచనలెన్నో తెలుగులో కనిపిస్తై!

కలత చెందిన మనస్సుతో ఆ సభ నుంచి ఇంటికి వచ్చాను. నా ఒక్కొక్క రచనను తెరచి చదువుకోసాగాను!

## పునరుద్ధరణ

మా ఇంట్లో ఒకేఒక పాలేరు పుస్తకం వుంది. అది 1970లోని ముద్రణకు చెందినట్టిది. కాగితం న్యూస్ ప్రింటు కాబోలు, ముట్టుకుంటే విరిగి ముక్కలైపోతున్నది!

"నిన్ను నేను ఆప్యాయంగా చేతిలోకి తీసుకొని ఏభై యేళ్ళయిందా తల్లీ!" నిజంగా కళ్ళు చెమ్మగిల్లాయి. దాన్ని తెరిచి చూచినప్పుడు ఏడుపే వచ్చింది.

ఇన్ని తప్పులతో నా పుస్తకాలు వేస్తున్నారు పబ్లిషర్లు? తెలుగు ప్రెస్సుల్లో తెలుగు తెలిసిన ప్రూఫురీడర్లు వుండరా?

వెంటనే కలం తీసుకొని, ఆ రాత్రంతా కూర్చుని పరిష్కరించాను.

నా గ్రంథాలన్నీ నా చేతి మీదుగా, నేనుం ప్రూఫులు దిద్దకొని, ప్రకటించుకొంటున్నట్టివి. ఒక్క పాలేరుకే అట్టి ప్రత్యేకత లభించలేదు. అది నుంచీ ఇది పరాశ్రితంగానే వుంటూ వచ్చింది. ఎప్పటికప్పుడు కొత్త కావ్యాలను ప్రకటించుకోవడంతోనే సతమతమయ్యే నేను, పాతదైపోయిన పాలేరు పైకి దృష్టి మరల్చలేకపోయాను.

నాది సాహిత్య సృష్టి, వ్యాపారం కాదు. నా గ్రంథాలు మార్కెట్లో దొరకవు. నా దగ్గర దొరుకుతాయి ఉచితంగా. ఎంతో కష్టపడి ఒకసారి ముద్రించి, వాటిని ఉచితంగా పంచిపెట్టేస్తే, పునర్ముద్రణకు పైస లెలావస్తై? వాటిని ఉచితంగా పుచ్చుకొన్నవాళ్లైనా, ధనవంతులై వుండి కూడ, సహాయం చెయ్యరు!

ఇక్కడొక విశేషం చెప్పాలి–

పాలేరు నాటకం పుస్తకాలు మార్కెట్లో ధారాళంగా దొరుకుతున్నంత కాలం, వాటి ఉత్పత్తి గురించి ఎవరూ పట్టించుకోలేదు. అది సహజమే. అదీగాక, ఈ నాటకాన్ని ప్రదర్శించిన వాళ్లంతా పల్లెల వాళ్లు, పేటలవాళ్లు, వ్యవసాయ కార్మికులు, వెనకబడిన వర్గాలు. పట్టించుకొని మాత్రం వాళ్ళు చెయ్యగలిగిందేముంది? నేను ఆశించింది వాళ్ళలో మార్పు. అది వచ్చింది, ఇంకా వస్తున్నది. నాకు కావలసిందంతవరకే.

అయితే, ఇటీవల ఈ పుస్తకాలు మార్కెట్లో దొరకడం లేదు. ఎవరినడగాలి? ఎవరికి వ్రాయాలి? నా అడ్రసు లోక ప్రసిద్ధం కనుక, నన్నడగడం సాగించారందరూ.

ఇక్కడే మరొక విశేషం–

నాకు ప్రతిరోజూ ఎక్కడో అక్కడ తారసపడే పెద్దలలో చాల మంది "మీ పాలేరు

నాటకంలో పాత్రధారులం'' అంటూ పరిచయం చేసుకొంటూ వుంటారు. పాలేరు నాటకం చూచి, పాలేరు తనాలు మానేసి, స్కూళ్ళలో చేరి, పెద్ద చదువులు చదివి, పాలేరు కావ్య నాయకుడివలెనే ఆఫీసర్లయిన వాళ్లు, ప్రొఫెసర్లయిన వాళ్ళు, రాజకీయ పదవులందుకొన్న వాళ్ళు వందల మంది నాకు తెలిసిన వాళ్ళలోనే వున్నారు. వాళ్లంతా ఆర్థికం... స్థితిమంతులే. పరపతి కల వాళ్ళే. అయితే, వారిలో ఒక్కరు కూడ ఈ నాటకం ప్రతులు ఎందుకు దొరకడం లేదో వాకబు చెయ్యరు!

తమను అంతగా ప్రభావితం చేసిన ఒక గ్రంథం నిత్య ప్రచారంలో వుండేటట్టు చూడవలసిన బాధ్యత వారికి లేదా? పైకి వచ్చిన వాళ్ళు క్రిందపడి వున్న వాళ్ళకు చేయూత నివ్వవలసి లేదా? ఇతర ఉన్నత వర్గాల వారిని చూచి అయినా నేర్చుకోవద్దా? ఇక బడుగు వర్గాలు బాగుపడేదెట్లా?

ఇదంతా నా ఏకపాత్ర ఘోష! సోలో! సొలిలోక్వీ!

ఏది ఏమైనా, ఇప్పుడు పాలేరును కొంచెం పరిష్కరించి సొంతంగా ముద్రిస్తున్నాను. ఇది నా చేతిమీదుగా ప్రథమ ముద్రణ. క్రమ సాంఖ్యంగా ఎన్నో ముద్రణో! సుమారుగా వూహించి అంటున్నాను 19వ ముద్రణ అని.

## సమకాలీనత

మౌలిక సాహిత్యానికి ఉండవలసిన ప్రధాన గుణం సమకాలీనత. సమకాలీనత లేని రచన ఎంత గొప్పదైనా, అది సాహిత్యమనిపించుకోదు.

కవి ఏ కాలంలో జీవించాడో, ఆ కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విషయాలన్నీ అతడి రచనల్లో ప్రతిఫలించాలి. అట్టి గుణం వుండడంవల్లనే వేద, పురాణ, రామాయణ, భారతాదులు క్లాసిక్సు అయాయి. సజీవ సాహిత్యమయాయి.

వాస్తవ వస్తు చిత్రణ ఫోటోగ్రాఫ్ అవుతుంది. డాక్యుమెంటరీ అవుతుంది. ఆ చిత్రణ రసభావ సమేతమై, కళాత్మకమై అభివ్యక్తమైనప్పుడే అది సాహిత్యమవుతుంది. సమకాలీన సాహిత్యానికి సర్వజనీనత తోడైనప్పుడు దానికి సజీవ సుస్థిరత్వం సిద్ధిస్తుంది.

వేద పురాణాలు, రామాయణ మహాభారతాలు ఆనాటి జీవిత సరళికి కళాత్మక చిత్రణలు. అందుకే వాటికి కాలదోషం లేదు. మొదట ఏ కాలంలో, ఏ భాషలో వెలువడినప్పటికీ – అవి అన్ని కాలాలకూ, అన్ని దేశాలకూ, అన్ని భాషలకూ చెందినవే అవుతాయి.

అట్టి విశ్వ సాహిత్యాన్ని ఎవరైనా, ఎప్పుడైనా తమ భాషలోకి అనువదించుకోవచ్చు. అనువదించుకోవాలి కూడ. అయితే, అట్టి అనువాదాలు మౌలిక సాహిత్యం కావు.

తెలుగులో ఎన్నో భారత రామాయణాలు, కావ్య ప్రబంధాలు వున్నై. అవన్నీ అనువాదాలో, అనుకరణలో అవుతై. తెలుగులో ఇంతవరకు మౌలిక సాహిత్యం జానపద సాహిత్యమే. కాదంటే కొన్ని శతకాలు, వేమన పద్యాలు, ఎంకి పాటలు వంటి కొన్నిటిని కూడ చెప్పుకోవచ్చు.

"పాలేరుతనం పూర్వమున్నంత ఇప్పుడు లేదు. మరికొంత కాలానికి పూర్తిగా పోవచ్చు. అప్పుడు పాలేరు నాటకానికి ప్రయోజనమేమిటి?" అంటారు కొందరు.

గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం, హరిశ్చంద్ర వంటి నాటకాలకున్న ప్రయోజనమే పాలేరు నాటకానికీ వుంటుంది. అవి పౌరాణికాలు కదా అంటే, అప్పటికిదీ పౌరాణికమే అవుతుంది.

పాలేరు అంటే ఎవరు? యజమాని క్రింద బానిసలా పనిచేసే ప్రతి అస్వతంత్రుడూ పాలేరే. అట్టి ప్రతివాడూ తన బానిసతనాన్ని తొలగించుకోడానికి నిరంతరం కృషి చెయ్యవలసే వుంది. ఇదొక ఎడతెగని సమస్య. దీనికి ముగింపు లేదు. అయినా, పోరాటం కొనసాగక తప్పదు. ఈ నాటకం ప్రారంభగేయంలోని ఉద్బోధ ఇదే, "బానిస తనమును బాపుమురా" అనేది.

వాల్మీకికి రాముడు సమకాలీనుడు. వ్యాసుడికి ధర్మరాజు సమకాలీనుడు. నాకు పాలేరు వెంకన్న సమకాలీనుడు.

ఇతి వృత్తంలో సమకాలీనత, కావ్య నాయకుడిలో విశ్వమానవత, రచనా శిల్పంలో రసభావ రమణీయత వుంటే అది క్లాసిక్. పట్టాభి రాముడి కంటె పాలేరు వెంకన్న ఏ విధంగానూ తక్కువ వాడు కాదు.

రాముడు విభీషణుడికి అభయ మివ్వడంలో స్వప్రయోజన ముంది. వెంకన్న తనకు అపకారం చేసిన ఖామందును శిక్ష నుంచి తప్పించి ఎంతో ఉపకారం చేశాడు. ఇందులో అనాసక్తమైన విశ్వకారుణ్య ముంది. సీత రాముడికి వలె వెంకన్నకు వనబాల ప్రగతికారక శక్తి. వర్ణాంతర వివాహం ద్వారా కుల రహిత సమాజ నిర్మాణం సాధించబడింది.

## సాహిత్య దర్శనం

సమకాలీన పాత్రను ప్రేమ రసంతో నింపినప్పుడే అది విశ్వసాహిత్యమవుతుంది. ప్రేమ ఉగాది పచ్చడి లాంటిది. దానికి నవరసాలూ తోడైనప్పుడే అమృత రసానుభూతి.

"శృంగారం భగ్నమైతే కరుణ రసం. నిరోధించబడితే వీర రసం" అన్నానొకచోట.

రామాయణం లాంటి మహాకావ్యాలలో మాత్రమే సాధ్యంకాగల అట్టి రసపోషణ పాలేరు వంటి చిన్న దృశ్య కావ్యంలో ఆశించగలమా?

నిరభ్యంతరంగా ఆశించవచ్చు. నిండుగా ఆస్వాదించవచ్చు కూడ. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్న నిర్వచనంలోని దర్శనం ఇదే. అనుభవించడానికి సుముఖత్వం వుండాలి. అంతే.

పాలేరును నిష్పాక్షిక దృష్టితో చూచే వారికి అది ఎంతో రసవంతంగా, రమణీయంగా కనిపిస్తుంది. అలా కనిపించబట్టే లక్షలాది జనం దాన్ని అభిమానించారు. వేలకొలది ప్రదర్శన లిచ్చారు. ప్రతి గ్రామంలోను పోటీ బృందాలేర్పడి ఆడారు. 1953లో గుంటూరులో ఒక బృందం వంద ప్రదర్శనలిచ్చిన సందర్భంగా చెరుకుపల్లిలో నాకు అప్పటి మంత్రి సంజీవయ్య గారి అధ్యక్షత క్రింద సన్మానం చేసి, పగటి దివిటీలతో బ్రహ్మ రథం పట్టి, పది వేల మంది సభలో గండపెండేరం తొడిగారు. అదీ పాలేరులోని ప్రజారంజకత్వం.

అయితే, ఈ నాటకానికి పండిత లోక సన్మానాలెందుకు జరగలేదంటే, పండితులు దళిత వర్గాలలోని ప్రతిభను గుర్తించరు కనుక.

పండితులు శాబ్దికులు. కొందరు స్వార్థపరులు. వారిలో అసూయాద్వేషాలు, స్పర్థలు, పచ్చోర్చనితనాలు ఎక్కువ. ఆ పచ్చదనం క్రింది వర్గాలలో దైతే మరీ ఉడికిపోతారు. అటువంటి మలిన మనస్కులు పత్రికలు. ఆకాశవాణి, దూరదర్శని వంటి ప్రచారక సంస్థలలో కీలక పదవులలో చేరితే, బడుగు కులాల రచయితలు, కళాకారులు చాల క్రూరంగా సప్రెస్ చేయబడతారు. వారి రచనలు ఎంతటి ప్రతిభావంతాలైనా సమీక్షలకు కూడ నోచుకోవు! ప్రైజులు, అవార్డులు పైవారే పంచుకుంటారు.

పాలేరు విజయవంత మయిందంటే అందుకు కారణం సామాన్య ప్రజలలోని కళాభిజ్ఞతే.

సంగీత, సాహిత్య, నృత్య, చిత్ర శిల్పకళల సమగ్ర సమన్వయ రూపమే నాటకం. విద్యావంతుల మనుకొనేవాళ్ళు వచన నాటకాలతో సతమతమవుతుంటే, గ్రామీణ ప్రజలు పద్యాలూ, పాటలూ కల సమగ్ర నాటకాలను అభిమానిస్తున్నారు. నేను పాటలు, పద్యాలు లేకుండా నాటకాలు వ్రాయను.

నాటకం జీవితానికి దగ్గరగా వుండాలి. నకలుగా వుండగూడదు. పగలంతా కష్టపడి వచ్చిన కార్మికుడికి మళ్ళీ అదే కష్టజీవితాన్ని రంగం మీద చూపడం వ్యర్థం. కష్టాన్ని మరిచి, ఉపశమనం పొంది, మరునాడు శ్రమపడడానికి తగిన శక్తిని ఇచ్చేదిగా వుండాలి కార్మికుడికి చూపబడే నాటకం. వాస్తవాన్ని అందంగా తీర్చిదిద్దేది కళ. నాటకం సమస్త కళా సమామ్నాయం.

పాలేరును ఆ విధంగా తీర్చిదిద్దాను నేను.

"పద్యాలలో ఏడుస్తారా?" అనేది లోకజ్ఞత లేని విమర్శ. గాఢమైన ఆవేశాలను, రసాలను, ఫీలింగ్సును వ్యక్తం చెయ్యడానికి పద్యాలు, పాటలు, నృత్యాలు వంటి కళాప్రక్రియలే సాధనాలు. నా నాటకాలన్నీ పద్య గేయ సంయుతాలే.

నా దృష్టిలో కేవలం వచన నాటకాలు నాటకాలు కావు. అవి డాక్యుమెంటరీలు మాత్రమే.

## క్రమాభివృద్ధి

"కావ్యేషు నాటకం రమ్యం" అన్నారు. "నాటకాంతం కవిత్వం" అన్నారు. అలా ఎందుకన్నారు?

కవిత్వం ఏ ప్రక్రియలో చెప్పబడినా, అది ఆలోచనకు అందేది మాత్రమే. నాటకం అలా కాదు. అది తక్కిన అన్ని కళలనూ సాధనాలుగా ఉపయోగించుకొని, జీవిత క్రమ వికాసాన్ని, క్రమోన్నతిని రమణీయంగా, సర్వేంద్రియాలకూ తృప్తినిచ్చే విధంగా ప్రదర్శించి చూపుతుంది.

ప్రతి మనిషీ తానున్న స్థానం నుంచి ముందుకు పోవాలనుకొంటాడు. అట్టి ప్రస్థానాన్ని ప్రత్యక్షంగా చూపేది నాటకం. ఇతి వృత్తంగా ఏ వ్యక్తి జీవితాన్నైనా తీసుకోవచ్చు. ఆ జీవితం, సుఖదుఃఖాల వెలుగు చీకట్లగుండా ప్రయాణిస్తూ ఎలా క్రమ వికాసం చెందిందో సహృదయుల మనస్సులకు హత్తుకొనేలా చూపాలి. అట్టి జీవిత లక్ష్యం అందరూ సాధించగలిగి నట్టిదిగా వుండాలి.

సత్యహరిశ్చంద్ర నాటకం చూచి ఎందరు సత్యవ్రతులయ్యారో తెలియదు కాని, పాలేరు నాటకం చూచి వేల మంది పాలేళ్ళు పాలేరుతనాలు వదిలేసి పాఠశాలల్లో చేరడం మాత్రం వాస్తవంగా జరిగింది.

నాటకం ప్రయోజనం, అది ఏ లక్ష్యాన్ని సాధించదలచిందో ఆ లక్ష్యం సాధించబడి నప్పుడే సిద్ధించినట్టు. లక్ష్యం ఏదైనా కావచ్చు. వినోదమో, ఆనందమో కావచ్చు. పాలేరు నాటక లక్ష్యం సాంఘిక విప్లవం. అది సాధించబడింది.

లక్ష్యాన్ని సాధించిన ఏ రచన అయినా సరే, ఆ తర్వాత అజరామరంగా నిలిచి పోతుంది, ఆనందాన్ని ఇచ్చుకొంటూ. ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు ఎంత ఆడంబరంగా కనిపించినా, ఎండమావులే.

"కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము"లనడం వట్టి జడవాదం. కేవల కల్పన అనేది ఎక్కడా వుండదు. ప్రతి ఊహా, ప్రతి శిల్పమూ, ప్రతి కల్పనా ఏదో ఒక వాస్తవాన్ని ఆశ్రయించుకొని జరిగేదే.

ప్రకృతి ధర్మాన్ని అనుసరించి జరిగే ప్రతి కల్పనా వాస్తవం కాగలిగినట్టిదే. పాలేరు నాటక కథ కేవల కల్పితమే. అయితే, అది ఎన్నో వాస్తవ జీవితాలకు మార్గదర్శకమయింది. ఒక సాహితీ కల్పన ఒక మహత్తరమైన సాంఘిక విప్లవానికి కారణమయింది. విప్లవం రావలసింది మొదట సాంఘిక రంగంలో. ఆర్థిక రాజకీయ రంగాలు దానిని అనుసరించి తీరతాయి. వాస్తవమైన, ప్రయోజనకరమైన విప్లవాన్ని సాధించడంలో ఎంతటి హింసాయుత టెర్రరిస్టు కార్యకలాపాలూ చెయ్యలేని పనిని ఒక్క పాలేరు నాటకం చెయ్యగలిగింది.

టెర్రరిజం, ఉగ్రవాదం వంటి హింసోద్యమాలు, విప్లవ నిరోధకాలు. బాగా బలిసిన వాళ్ళు చేసే పనులవి. ప్రజల్ని భయపెట్టడం, వ్యక్తుల్ని చంపడం, ఆస్తుల్ని నాశనం చెయ్యడం వంటి దౌర్జన్య చర్యలవల్ల మానవ పురోగమనం దెబ్బతింటుంది. పాలేరు సాధించిందే సరైన విప్లవం.

## ఇతివృత్తం

పాలేరు నాటకంలోని కథ చాల చిన్నది.

గోదావరి తీరంలో, కాకినాడ బస్ రూట్‌లో రైతువాడ ఒక గ్రామం. కుబేరయ్య ఒక చిన్న సవర్ణ భూస్వామి. పాలేళ్ల సహాయంతో సొంతంగా వ్యవసాయం చేసుకుంటాడు.

అతడి పాలేళ్లలో పుల్లయ్య ముఖ్యుడు. అతడి కొడుకు వెంకన్న. వీరేశు మరొక పాలేరు. ఈ ముగ్గురూ అవర్ణులే. వెంకన్నను కూడ పాలేరుతనం పెడతాడు పుల్లయ్య. వెంకన్నకు చదువు కోవాలని వుంది. ఆ వూరి బడిలోని ఉపాధ్యాయుడు ఉపకారి, విద్యార్థిని వనబాల అతణ్ని ప్రోత్సహిస్తారు. కామందు కుబేరయ్య, పుల్లయ్య వ్యతిరేకిస్తారు. ఈ ఇద్దరూ వెంకన్నను చాల బాధలు పెడతారు.

రైతువాడ గ్రామం చుట్టూ విశాలమైన పంట పొలాలు. పొలాల మధ్యలో అక్కడక్కడ చెట్లు, తోటలు. అలాంటి ఒక తోటలో వుంది పాఠశాల. అంటే – గ్రామానికీ, పాఠశాలకు మధ్య పొలాలున్నాయన్నమాట. ఆ పొలాలలోని పచ్చిక బయళ్లలోనే వెంకన్న కుబేరయ్యగారి పశువుల్ని మేపేది. ఆ పొలాలలోని చెట్ల క్రిందనే ఉపకారి మాష్టార్నీ, బాలనూ తరచు కలుసు కునేది. అతడు ఖామందు చేత దెబ్బలు తినేది కూడ ఆ పొలాలలోనే.

అవర్ణులైన వ్యవసాయ కూలీల, పాలేళ్ల పేటలు పొలాలకు ఆనుకొనే వుంటాయి. అవన్నీ ఖామందుల భూములే. కూలీలకు సొంత ఇళ్లు లేవు. అప్పటికింకా దేశానికి స్వాతంత్ర్యం రాలేదు.

రైతు వాడ గ్రామంలో కుబేరయ్యగారి లోగిలికి దగ్గరలోనే మరొక సంపన్న కుటుంబం వుంది. వాళ్లూ సవర్ణులే అయినా, కుబేరయ్య వలె సంకుచిత మూర్ఖ కులతత్వవాదులు కారు. ఆ సంపన్న కుటుంబానికి చెందినదే వనబాల. ఆమె అన్నగారు సుందరం. కాకినాడ కాలేజీలో చదువుతున్నాడు. అక్కడి అనాథ శరణాలయం సూపర్నెంటుగారి అబ్బాయి రామం సుందరం మిత్రుడు.

ఖామందూ, తన తండ్రీ పెట్టే హింసలను భరించలేక, కాకినాడకు పారిపోయిన వెంకన్న శరణాలయంలో చేరి, వెంకటేశ్వర్రావై, ప్రైవేటుగా పరీక్షలు ప్యాసై, ప్రభుత్వాధికారి, డిప్యూటి కలక్టరు అవుతాడు.

ఈలోగా సీత – వీరేశు, దొంగ రామన్న – రౌడీ రంగడు, కుబేరయ్య – పుల్లయ్య, సుందరం – రామం సంఘటనలు కొన్ని జరుగుతై. బాలను రామానికిచ్చి వివాహం చెయ్యడానికి సుందరం ప్రయత్నించడం, బాల దుఃఖం, వెంకటేశ్వర్రావు నిర్వేదం, తుదకు కష్టాలన్నీ తొలగి, అందరూ కలుసుకోవడం, కుబేరయ్యకు వెంకటేశ్వర్రావు మేలు చెయ్యడం జరిగి, బాల వెంకటేశ్వర్రావుల వివాహంతో కథ సుఖాంతమవుతుంది.

## అధికారి - నాయకుడు

నిజానికి అంటరాని వాళ్ళు కూడ మానవులే అని గుర్తించిన వాళ్ళు ఆంగ్లేయులు. ఈ దేశానికి పాలకులుగా ఆంగ్లేయులు, వారితోపాటు క్రైస్తవ మిషనరీలు రావడం వల్లనే హరిజన గిరిజన ప్రజల గుడ్డి బతుకుల్లోకి వెలుగూ, విజ్ఞానమూ ప్రవేశించాయనవచ్చు.

అంతకు పూర్వం ఈ దేశాన్ని పాలించిన హిందూ, బౌద్ధ, ముస్లిం రాజులందరూ స్వప్రయోజనాల కోసం కొట్టుకొన్న వాళ్ళే. ఆ కాలంలో దేశం లేదు. రాజ్యాలు వున్నై. ప్రజలంటే రాజులూ, వాళ్ళ కుటుంబాలూ మాత్రమే.

అట్టి దుస్థితిని తొలగించి, దేశానికి ఏకరూపం కల్పించి, ఏక భాష (ఇంగ్లీషు) ద్వారా జాతీయతను ప్రసాదించిన వాళ్ళు ఆంగ్లేయులే. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా దేశ సమగ్రాభివృద్ధికి కృషిచేసిన వాళ్ళూ వాళ్ళే.

ఆర్తత్రాణ పరాయణుడైన భగవంతుడు అందుకోసం అప్పుడప్పుడు అవతారా లెత్తుతూ వుంటాడనే భావనలో ఏ కొంచెమైనా నిజముంటే, ఈ దేశంలో అట్టి ఆర్తులైన హరిజన గిరిజన దీనుల్ని ఉద్ధరించడానికి ఆంగ్లేయుల్ని తెచ్చాడేమో అనిపిస్తుంది నాకు చరిత్రను పరిశీలిస్తే.

అందుకే, మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు కూడ తెల్లదొరతనం వద్దన్నారే కాని, తెల్లవాళ్ళని ద్వేషించలేదు.

ఒక్కసారి చైతన్యవంతులైన హరిజనుల్ని ఇకమీదట ఎవరూ అణచిపెట్టలేరు. విదేశీ పాలన కింద ఎంతోకాలం వుండలేం. ఎప్పటికైనా ఆధునిక భారతంలో కులతత్వం నశించక తప్పదు. హరిజనులు ప్రధాన సమాజంలో కలిసిపోయి, హైందవ జాతీయత ఏక ప్రవాహం కాక తప్పదు.

వేముల కూర్మయ్య, బి.ఎస్.మూర్తి, మునిసామి పిళ్ళె, జగజ్జీవనరాం వంటి విద్యాధికులు కాంగ్రెస్‌లో వుండిపోవడం వెనక, డాక్టర్ అంబేడ్కర్‌గారు పూనా ఒడంబడికకు అంగీకరించటం వెనక ఇంత ఆలోచన వుంది!

ఆంగ్లేయులు దేశాన్ని విడిచిపోతే, పరిపాలన వచ్చేది కాంగ్రెస్ చేతికే కదా? కాంగ్రెస్‌లో కాని, మరే పార్టీలో కాని వుండే మెజారిటీ జనం హిందువులే కదా?

హిందువులు రెండు భాగాలు. అవర్ణులు, సవర్ణులు. హిందూ ధర్మానికి పునాది

రాళ్ళు అవర్ణులైన హరిజనులే. అవర్ణ, సవర్ణ జనం అంతా కలిసి ఏక హిందూ జాతి కావలసి వుంది. అలా అయినప్పుడు పరిపాలనా నిర్వహణలో హరిజనులు తమ వంతు బాధ్యతను తాము స్వీకరించవలసి వుంది. అందుకు తగు విధమైన శిక్షణను హరిజన విద్యావంతులు ఇప్పటి నుంచే పొందవలసి వుంది.

ఆనాడు ప్రజాశక్తి పత్రిక సంపాదకులు కంభంపాటి సత్యనారాయణ గారితో నేను చేసిన వాదం ఇది. విద్యావంతుడైన వెంకన్నను ప్రజా నాయకుడుగా గాక, ఆఫీసరుగా ఎందుకు చేశానంటే, కారణం ఇది.

## కనకాభిషేకం

ఈ మధ్య నాకు బెజవాడలో కనకాభిషేకం జరిగింది.

"భీమన్న గారికి ఇప్పుడు మేం చేస్తున్న ఈ కనకాభిషేకం చాలా చిన్నది. ఆయనకు గండపెండేరం వేసి ఘనంగా సన్మానించవలసి వుంది." అని డా. పోలవరపు వెంకట సుబ్బా రావు గారన్నప్పుడు నేను–

నాకు జరిగిన సన్మానాలన్నిటికీ ఈ కనకాభిషేకం కిరీటం వంటిదనీ, తక్కువదేం కాదనీ, పాలేరు నాటకం నాకు 1953లోనే గండపెండేరం వేయించిందనీ ప్రకటిస్తూ, ఈ పద్యం చెప్పాను. ఇందులో ఏడు సన్మానాలు మాత్రం పేర్కొనబడ్డాయి–

బ్రహ్మ రథము పట్టి, పగటి దివిటీలతో
వేయించితివి గండపెండెరమును,
అందించితివి భారతాధ్యక్ష గిరి చేత
మహనీయమైన పద్మా అవార్డు,
కలిగించితివి గుడిసెల కావ్యమునకు జా
తీయ పురస్కార ధీయశస్సు,
ఆంధ్ర కాశీ విద్యా పీఠముల నుండి
గారవించితివి డాక్టర్ బిరుదుల,
శాసన పరిషత్తు సభ్యత్వ మొసగి తీ
ర్చితివి నాలోని రాజరిక తృష్ణ,
ఇంతగా నన్ను భూషించి, ఇపుడు దీని
కంతకు కిరీట మన, కనకాభిషేక

ధన్యతను గూర్చినావు నా తల్లి! బ్రాహ్మీ!
బాపురే, పోలవరపు సుబ్రావుగారి
హృదయ పద్మాసనము నుండి! ఎంత కరుణ!

ఆ మహోత్సవానికి అధ్యక్షత వహించిన డా. జె.బాపురెడ్డిగారికి, అందుపాల్గొన్న నగర మేయర్ జంధ్యాల శంకర్, తుర్లపాటి కుటుంబరావు, ఎన్.సి.కృష్ణమాచార్యులు, డా. కుందుర్తి సత్యనారాయణమూర్తి, శ్రీ ఎమ్.పి.జాన్ కవిగార్లకు, ఈడ్పుగంటి లక్ష్మణరావు గారికి కూడ ప్రత్యేక అభినందనలు చెప్పవలసి వుంది.

**Heredity was not highly valued. Kavasa, the son of a slave girl, could become a sage. It is therefore clear that classes existed in Rigvedic society, but they had not yet developed into castes.**

**(The cultural heritage of India, Page 226)**

ఋగ్వేద కాలంలో భారతీయ సమాజంలో వర్గాలున్నాయని, వాళ్ళ వాళ్ళ ప్రతిభను బట్టి ఒక వర్గం వ్యక్తి మరొక వర్గానికి మారడం జరుగుతూనే వుండిందని, వర్గాలు వర్ణాలు (కులాలు)గా మారడం అప్పటికింకా జరగలేదని పరిశోధకులంటున్నారు.

పుట్టుకను బట్టి కులం ఏర్పడటం అనే ఈనాటి దుష్ట వ్యవస్థ స్మృతుల కాలం నుంచి వచ్చింది. శ్రుతుల కాలంలో లేదు.

పుట్టుకను బట్టి వర్గాన్ని నిర్ణయిస్తూ, అట్టి వివిధ వర్గాల మధ్య వివాహ సంబంధాన్ని నిషేధించడంతోనే వర్ణ సాంకర్యమూ, అంటరాని తనమూ ఏర్పడడం మొదలైంది.

"భారతీయ సమాజమా! వేదాలకేసి మళ్ళు! వా ఛ్ఛిజ్ఞూ గ్రీఛ్చిట' అంటూ ఏభై ఏండ్ల క్రితమే పిలుపిచ్చాను నేను. అందుకు కారణం ఇదే – వేద కాలంలో పుట్టు కులమూ, అస్పృశ్యతా లేకపోవడం.

ఈనాటి పుట్టు కులం వర్గం ఎలా అవుద్ది? హరిజనులందరూ లేబరే అనే భారత కమ్యూనిస్టులతో కోనాడకు పడకపోవడానికి అదే కారణం.

కోనాడ – కార్మికోద్యమం

భారత్‌లోని సాంఘిక వ్యవస్థ వేరు, ఇతర దేశాలలోని సాంఘిక వ్యవస్థ వేరు. భారత్ లోని కార్మిక వర్గం వేరు, ఇతర దేశాలలోని కార్మిక వర్గం వేరు. సాంఘిక, రాజకీయ రంగాలలో పనిచేసే వాళ్ళెవరైనా సరే ఈ తేడాలను గుర్తించవలసి వుంది.

విదేశాలలోని ఎలాంటి కార్మికుడైనా అదృష్టం కలిసివస్తే యజమాని కాగలడు. కోటీశ్వరుడు కాగలడు, ప్రధాన మంత్రే కాగలడు. భారత్‌లోని కార్మిక వర్గం అలాంటిది కాదు. ఇక్కడ కుల వ్యవస్థ వుంది. ఏ కులంలో పుట్టిన వాడు ఆ కుల వృత్తినే తప్ప మరొక వృత్తిని చేబట్టరాదనే నిషేధం ఇక్కడ వుంది. ఇక్కడ కార్మిక వర్గం అంటే ఒకటి రెండు కులాలకు సంబంధించిన జనం. ఆ కులాల వాళ్ళు అస్పృశ్యులు. అంటే మాల మాదిగలు, మామాలు.

ఇక్కడ కార్మికుడికి పుట్టినవాడు శాశ్వతంగా కార్మికుడే. యజమాని కాలేడు. మరొక వృత్తిని చేబట్టే అవకాశమే లేదు. చదువు, సంస్కారం, ఇతర కులాల వాళ్ళతో స్నేహ సంబంధాలు, వస్తు వాహనాలు, కొంచెం బాగా బ్రతకడానికి అవసరమైన అన్నీ నిషేధించబడి, ఊరికి దూరంగా మురికి పేటల్లో, పూరి గుడిసెల్లో, నిత్య దరిద్రంలో, తక్కిన కులాల వాళ్ళకు నిత్య గులాములుగా బ్రతకవలసిన దుర్గతికి బలిచేయబడ్డ వాళ్ళు. ఈ దేశంలో బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పడేవరకు ఇదే దుస్థితి. లేబర్ అంటే మామాలే!

"ప్రపంచ కార్మికులారా! ఏకం కండి" అనే నినాదాన్ని దొరకబుచ్చుకొని, అంతర్జాతీయ స్థాయిలో కార్మికోద్యమాన్ని నడపదలచుకొన్న వాళ్ళు గుర్తించవలసిన పరమ సత్యం ఇది. ఇతర దేశాలలోని కార్మికులకు కాయకష్టాన్ని వదిలేసి, తమ ఇష్టం వచ్చిన వృత్తిని చేబట్టే స్వేచ్ఛ వుంది. భారత్‌లోని కార్మికులకు అట్టి స్వేచ్ఛ లేదు. కాయకష్టం తప్ప మరో గత్యంతరం లేదు. తరతరాలుగా, వంశ పారంపర్యంగా పేద కార్మికులుగా బ్రతకవలసిందే.

విదేశీయమైన కార్మిక నిర్వచనాలనూ, సిద్ధాంతాలనూ పట్టుకొని భారత్‌లో కార్మికోద్య మాన్ని నడపడానికి పూనుకొన్న యువ నాయకులకు ఈ అవగాహన లేకపోయింది. అందుకే అట్టివాళ్ళు ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీని తొలిసారిగా నెలకొల్పినప్పుడు, ఆ పార్టీలో కార్మికులు బహుకొద్ది మంది మాత్రమే చేరడం జరిగింది. నాయకులందరూ ధనిక కులాల వాళ్ళే. అట్టి వాళ్ళ అధీనంలో పని చేసుకు బ్రతుకుతున్న కూలీలే ఆ పార్టీ అనుయాయులుగా తయారయ్యారు. మాల మాదిగ పేటలు లేబర్ పేటలుగా వ్యవహరించబడసాగాయి. ఆ ప్రాంతపు భూస్వాముల బిడ్డలు ఆ లేబరు జనానికి నాయకులై నిలిచారు. మిత్రులు కోనాడ సూర్య ప్రకాశరావుగారు సాంఘిక సేవా రంగంలో అడుగుపెట్టిన నాటికి దేశంలో వున్న పరిస్థితి అది. నాయకులు ధనికులైన

సవర్ణ విద్యావంతులు, అనుచరులు వాళ్ళ పొలాలలో పనిచేసుకు బ్రతుకుతున్న అవర్ణులు, అస్పృశ్యులు.

1941లో కృష్ణా జిల్లా వ్యవసాయ కూలీ సంఘానికి శ్రీ కోనాడ అధ్యక్షుడుగా వేదిక మీద నిలబడినపుడు, ఆయనకు ఎదురు నిల్చిన వాస్తవాలు రెండు. వ్యవసాయ కూలీలంతా అంటరాని కులం వాళ్ళు. నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టిమాత్రమే కలిగిన ధనిక సవర్ణులు.

భారత్‌లో వర్గ పద్ధతి (class) లేదు. వర్ణ వ్యవస్థ అంటే కుల వ్యవస్థ (caste system) వుంది. ఇక్కడ కూలీలు అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తొలగించాలి. వాళ్ళు తదితర ప్రజలతో కలిసి పోయేటట్టు చూడాలి. కుల భేదాలను తొల గించాలి. తమ ఇష్టమైన వృత్తిని చేబట్టే అవకాశాలు కలిగించాలి. వృత్తికి కులం ప్రాతిపదిక కాకూడదు. ఏ కులం వాళ్ళైనా సరే, వృత్తిని బట్టి వర్గం ఏర్పడే స్థాయికి భారతీయ సమాజం ఎదగాలి.

అందుకు తగిన చర్యలు తీసుకోవాలనీ, ప్రత్యేక విధానాలు అవలంబించాలనీ కోనాడ ఉద్దేశం. అక్కడ పెత్తనం చేసే నాయకులు అందుకు వ్యతిరేకం. అప్పుడు స్పష్టపడింది కోనాడకు – కమ్యూనిస్టు పార్టీ ద్వారా హరిజనులకు, ప్రధానంగా వ్యవసాయ కూలీలకు జరిగే మేలేదీ లేదని. ఆ తరువాత జరిగిన అనేక సంఘటనల ద్వారా ఆయన ఒక నిశ్చయానికి వచ్చి, ఒక నిర్ణయాన్ని తీసుకొని, కమ్యూనిస్టు పార్టీని వదిలేసి, అంబేడ్కరుగారి షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్‌లో చేరాడు – 1944 ప్రాంతంలో. అంతకు ముందు వ్యక్తిగతంగానూ, ఆ తర్వాత కమ్యూనిస్టు అభిమానిగానూ హరిజనులకు సాంఘిక న్యాయం కోసం పోరాటాలు జరుపుతూ వచ్చిన కోనాడ 1944 నుంచి ఫెడరేషన్ పతాక క్రింద సేవా నాయకుడైనాడు.

## మా పరిచయం

ఇంతకూ, ఈ కోనాడ సూర్యప్రకాశరావు ఎవరు?

కృష్ణా జిల్లా, గుడివాడ తాలూకా, పెదపాలపర్రు గ్రామంలో 1910 ఫిబ్రవరి 15వ తేదీన హరిజన కార్మిక వంశంలో జన్మించాడు కోనాడ. తండ్రి ఎరకయ్యగారు, తల్లి శాంతమ్మగారు. గుడివాడ బోర్డు హైస్కూలులో చదివి 1930లో 10వ తరగతి

పాసయినాడు. 1930 నుంచి 32 వరకూ ఖాళీ. సంగీత సాహిత్యాలతో కాలక్షేపం. 1932లో కాకినాడ పిఠాపురం రాజావారి కాలేజీలో ఇంటర్‌లో ప్రవేశించినాడు. అప్పటి నుంచి శ్రీ కోనాడతో నా పరిచయం.

కాలేజీలో వున్నప్పుడు మేము రామమోహన లాడ్జిలో వుండేవాళ్లం. అది పి.ఆర్. కాలేజీలోను, కాకినాడ పట్టణంలోని ఇతర హైస్కూళ్లలోను చదివే హరిజన విద్యార్థుల కోసం విద్యార్థులమే ఏర్పాటు చేసుకొన్న హాస్టలు. దానికి నేను ప్రెసిడెంటుగా వుండేవాణ్ని. ఆ కాలంలో ప్రెసిడెంటు అంటే నేనే. అంతగా రూఢి పదమయింది నా విషయంలో అది. రెండు సంవత్సరాలపాటు మేమే స్వంతంగా నడుపుకొన్న తర్వాత, కాలేజీ అధికారులు ఇంటి అద్దెను తాము భరిస్తామని చెప్పి మాతో సంబంధం పెట్టుకొన్నారు. తక్కిన ఖర్చులన్నీ మేమే పెట్టుకొనే వాళ్ళం. ఇష్టం వచ్చినట్టుగా లాడ్జిని నడుపుకొనే వాళ్ళం. చాలమందికి స్కాలర్‌షిప్పులు వచ్చేవి. అవి మేము తింటూ ఇతరులకు కూడా పెట్టగలిగేటంత సమృద్ధిగా వుండేవి. అందువల్ల స్కాలర్‌షిప్పులు రాని వాళ్ళకు ఉచిత వసతి, ఇతర పేద విద్యార్థులకు వారాల ఏర్పాట్లు కూడ చెయ్యగలిగాం. నేను లాడ్జిని వదిలిపెట్టే వరకు అంటే 1935 వరకు రామమోహన లాడ్జి వైభవోపేతంగా కొనసాగింది. స్కాలర్‌షిప్పులు రాని విద్యార్థులలో ఆనాడు కోనాడ ఒకడు.

కోనాడతో నా స్నేహం అతి సన్నిహితంగా ఆర్ద్రంగా హార్దికమైనట్టిదిగా వుండేది. కోనాడ చనువుగా చొరవగా వుండేవాడు. చదువు ఎలా వుండేదో నాకిప్పుడు జ్ఞాపకం లేదుగాని, సాంఘిక సేవా విషయాలలో మాత్రం చాలా చురుగ్గా వుండేవాడు.

హాస్టలును వదిలిన తర్వాత ఒక పదేళ్ళ వరకు మా ఇద్దరి మధ్య సంబంధాలు వున్నట్టు లేదు. ఆ తరువాత మేం కలుసుకొన్నది 1945లో అనుకొంటాను – జనరల్ ఎన్నికల సందర్భంలో. నేను కాంగ్రెసు, కోనాడ ఫెడరేషను. రాష్ట్ర కాంగ్రెసు ఆర్గనైజరుగా నేను కూర్మయ్యగారిని బలపరుస్తూ కృష్ణా జిల్లాలో పర్యటించినపుడు ఎక్కువ కాలం బెజవాడ లోనే వుండేవాణ్ని. పగలంతా ఎక్కడ తిరిగి వచ్చినా, సాయం సమయాలలో మాత్రం మేం కలుసుకొని కబుర్లు చెప్పుకొంటూ వుండేవాళ్ళం. పార్టీ భేదాలు మా స్నేహానికి ఏనాడూ ఆటంకం కాలేదు. అప్పుడే అర్థమయింది నాకు కోనాడలోని సాహస ప్రవృత్తీ, స్థిత ప్రజ్ఞత్వమూ, నిమ్న జాతుల సముద్ధరణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడ్డ నిర్భీతీ, నిత్య పోరాట శక్తీ.

ఆలోగా ఆయన కొన్ని ఉద్యోగాలు చేశాడు. సరిపడక వదిలేశాడు. కులతత్వానికి, అంటరానితనానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీల అభ్యుదయం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించాడు. "కాకిచేత కబురు" కూడ అక్కడ లేకుండానే, ఎక్కడ ఈ దీన జనం చిక్కుల్లో పడితే అక్కడ రెక్కలు కట్టుకుని వాలేవాడు. భూస్వాములతోను, మూర్ఖ ఛాందసులతోను పోరాడడం మాత్రమే కాదు. కార్మికోద్యమ నాయకుల మంటూ బురఖాలు వేసుకొన్న నిరోధక శక్తులతో కూడ ఆయన పోరాడవలసి వచ్చేది. ఆ విధంగా దీనజన సేవకే అంకితమైపోయాడు. పేదరికంతో ధైర్యంగా కాపరం చెయ్యగలిగాడు. సేవా రంగంలో స్థిత ప్రజ్ఞుడై నిలిచాడు.

షెడ్యూల్డు కులాల ఫెడరేషను నాయకత్వాన్ని వరించిన తర్వాత ఆ వుద్యమాన్ని ఆయన చాల ముందుకు తీసుకుపోయాడు. ఫెడరేషను స్థాపకుడైన డా. అంబేడ్కర్ గారిని అనేక సందర్భాలలో స్వయంగా కలుసుకొని సంప్రదింపులు జరిపాడు. ఆ కాలంలో అంబేడ్కరుగారి ప్రియమైన సన్నిహితులలో కోనాడ ఒకరు.

అంబేడ్కరుగారు గాంధీజీ సూచన మేరకు కాంగ్రెసు మంత్రి వర్గంలో చేరినప్పుడు షెడ్యూల్డు కులాల యువ లోకంలో కలిగిన అలజడినీ, నిస్పృహనూ తొలగించి, అంబేడ్కరు గారి చర్యను సమర్ధవంతంగా బలపరిచిన భవిష్యద్దర్శి కోనాడ.

ఆ కాలంలో ఫెడరేషను పోరాట రంగంలో ఈలి వాడపల్లి, నందనారు హరి, పాము రామమూర్తి, అరుణకుమార్, బొజ్జా అప్పలస్వామి, రావూరి ఏకాంబరనాథ్, నక్కా చిన వెంకయ్య వంటి నాయకులెందరో పనిచేస్తూ వుండేవారు. ఆ రోజుల్లోనే కాబోలు ఏకాంబర నాథ్ కోనాడను గురించి–

"సూదిమొన పసలాంటి సునిశిత మేధావి
పేదోళ్ల దొక్కటే ఫెడరేష నంటాడు,
ప్రాణ లక్ష్యం లేని బండ – మొండీ – త్యాగి,
కోనాడ కుర్రోడు నీ కంగరక్షకుడు,
ఆది హిందూ లక్ష్మి! స్తవమో!
కార్మిక మాతరో! జయమో!"
అంటూ గానం చేశాడు.

ఫెడరేషను తరఫున ఎన్నికలలో కూడ పోటీ చేశాడీయన. ఫెడరేషను రద్దయిన తర్వాత భారత రిపబ్లికన్ పార్టీ కార్యక్రమాలను చేపట్టాడు.

కోనాడ చేపట్టిన జీవిత విధానం పేదరికంతో కూడుకొన్నదీ, ప్రవాద భరితమైనట్టిదీను. అటువంటి జీవితంలో భాగస్వామ్యం కలిగి వుండాలంటే ఎంతటి ధైర్యమూ, త్యాగశీలతా వుండాలో - వూహించవచ్చు. అంతటి మహనీయ గుణశీలాలు కలిగిన మహిళ ఆయన అర్ధాంగి కమలాబాయి. కుమార్తెలు రమాదేవి, శాంతాదేవి, కుమారులు వివేకానంద, అశోక్, రాంబాబు (ఈయన ఇప్పుడు లేడు), శ్రీహరిరావు – ఈ అందరూ కూడ తల్లిదండ్రులకు అనుకూలంగా తమ తమ కర్తవ్యాలను గుర్తించి వర్తిస్తున్న వాళ్లే. కోనాడ మామగారు ఏకుల జార్జిగారు గొప్ప ఆర్టిస్టు. అంబేడ్కరుగారి త్రివర్ణ చిత్రాలు ఎన్నో చిత్రించి ప్రజల కందిచ్చిన వాడు. కోనాడ రెండవ కుమారుడు డా. అశోక్ కోనాడ గొప్ప గాయకుడు. రాష్ట్రంలో అనేకచోట్ల లలిత గాన కచేరీలు నిర్వహిస్తున్న సుప్రసిద్ధుడు.

కోనాడ వారిని గురించి, గ్రామ సీమలలో ఆయన నిర్వహించిన ఉద్యమాలను గురించి విపులంగా ఒక ఉద్గ్రంథమే వ్రాయవచ్చు. అంతటి త్యాగధనుడికి, సాహితీ ప్రియుడికి, ఆదర్శ ప్రాయుడైన ఉత్తమ భారతీయుడికి ఇప్పుడు ఈ పాలేరు దృ శ్యకావ్యాన్ని అంకితం ఇస్తున్నానంటే ఇది నిజంగా నా అంకితాల చరిత్రలో అద్భుతమూ, అపూర్వమూను. యాభై ఏళ్ళుగా ఇది ఎవరికీ అంకితం కాకుండా వుండిపోయిందంటే నిజంగా ఆశ్చర్యకరమే మరి. ఈయన కోసమే అలా వుండిపోయిందనుకోవచ్చు.

ఈ సందర్భంలోనే చాలమందికి కృతజ్ఞతలు చెప్పుకోవలసి వుంది. అందులో ప్రధానంగా నాకు ఎల్లప్పుడూ చేయూతగా ఉండే డా॥ బాపురెడ్డి గారికి, బెజవాడలో కనకాభిషేకం చేసిన డా॥ పోలవరపు వెంకట సుబ్బారావు గారికి, మిత్రులు గోవాడ వేంకటేశ్వరరావు, సంజీవరావు గార్లకు, జొన్నకూటి నాగేశ్వరరావు గారికి, గనుమల జ్ఞానేశ్వర్ గారికి, దాకే శివాజీగారికి, ఈ కావ్యాన్ని ఎంతో అందంగా, ఆనందంగా, సత్వరంగా ముద్రించిన శ్రీనివాసు గారికి, వారా వేణు, బి. నాగేశ్వరావు, ముసలయ్య గార్లకు, నీతి పూడి భాస్కరరావు, ఎన్. భూషిగార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

తమ నాటకోత్సవాల సందర్భంగా ఈ నాటకాన్ని ప్రసారం చేసిన ఆకాశవాణి (హైదరాబాదు) వారికి, ముఖ్యంగా మానికొండ నిత్యానందరావు గారికి నమస్సుమాలు.

పాలేరు, కూలిరాజు జంట నాటకాలు. కూలిరాజును కూడా పరిష్కరించి ప్రకటించవలసి వుంది. ఎప్పటికో ఏమో !

–భీమన్న

## అంకితం
# స్థితప్రజ్ఞ కోనాడకు

వర్కరుగా పుట్టి
వారాలపై చదువుకొన్న దీక్షాపరుడు,
ఏ చిన్న ఉద్యోగంలో కొనసాగినా
ఓ పెద్ద లక్షాధికారి కాగల్గిన ప్రజ్ఞావంతుడు,
మా కోనాడ సూర్యప్రకాశరావు! కాని-

నిరుద్ధ జన సముద్ధరణ కోసం
ఆయన చెయ్యని త్యాగాలు లేవు
పడని కష్టాలూ లేవు!

చదువుకొన్న ప్రతి దళితుడూ
సర్కారు కొలువులో చేరిపోతున్నప్పుడు,
కొలువెక్కిన ప్రతి ఉద్యోగీ
కుక్షింభరుడై జారిపోతున్నప్పుడు,
పిరికివాడై పారిపోతున్నప్పుడు-

అంటరాని ఒంటరి జనానికి
ఆసరాగా నిల్చినవాడు
అంబేడ్కరు ఉద్యమానికి
అభయ హస్తం పట్టినవాడు

అధర్మ అన్యాయ అమానుష కుల వ్యవస్థను
అదరగొట్టి గెల్చినవాడు
మా కోనాడ!
మానవతకు నీడ!

నిస్వార్థ ప్రజాసేవకు లభించే ప్రతిఫలం
నిరుపేద తనం! అయినా–
కుటుంబ పోషణకోసం ప్రియజనం
కూలి పనులకు పోతుంటే
అందరూ కూలీలకూ అన్నం పెట్టేటందుకు
అసిధారా వ్రతం నిర్వహించిన
ధీరోదాత్తుడు కోనాడ!

అట్టి స్థితప్రజ్ఞ కోనాడకు
ఈ పాలేరు దృశ్య కావ్యం నవోఢ!

–భీమన్న

## పాత్రలు

| | | | వయస్సు సుమారు సం॥ |
|---|---|---|---|
| వెంకన్న | : | కథానాయకుడు, పాలేరు, చదువుతర్వాత వెంకటేశ్వరరావు అవుతాడు | 12-20 |
| కుబేర్రావు | : | భూస్వామి, కామందు, పూర్తిగా అభివృద్ధి నిరోధక తత్వం గల మనిషి | 35 |
| సుందరం | : | సంస్కార భావాలున్న కాలేజీ విద్యార్థి | 20 |
| ఉపకారి | : | పల్లెటూరి బడిపంతులు, సంస్కారి, కుల, మత భేదాలు లేకుండా అందరూ చదివి, విజ్ఞానం ఆర్జించాలంటాడు | 30 |
| వీరేశు | : | వెంకన్న పినతండ్రి, కార్మికుడు | 34 |
| పుల్లయ్య | : | వెంకన్న తండ్రి, కుబేర్రావు పెద్ద పాలేరు | 43 |
| రామం | : | కాకినాడ ఆనాథ శరణాలయం మేనేజరుగారి కుమారుడు, సుందరం మిత్రుడు. | 20 |
| వనబాల | : | సుందరం చెల్లెలు, అన్నగారి సంస్కార భావాలు బాగా ఒంట బట్టిన దిట్ట. | 12 |
| సీతమ్మ | : | వెంకన్న చుట్టం, వ్యవసాయకూలీ, వీరేశు ప్రేమికురాలు. | 18 |

ఇంకా : డొంగరామన్న, రౌడీరంగడు, బంట్రోతు,
కొంత మంది రైతులు, కూలీలు.
(వెంకన్న పాత్రను ఇద్దరు ధరించవచ్చు.
అలానే వనబాల పాత్రను కూడ.

## రంగం:1

(గోదావరి తీరంలో రైతువాడ అనే గ్రామం, గ్రామానికి చుట్టూ విశాలమైన పంటచేలు, చేల నిండా రకరకాల పైరులు - చేల గట్లలో అక్కడక్కడ తాటి చెట్లు; ఇతర ఫల వృక్షాలు, చేలల్లో ఒక ప్రక్కగా పశువులు పచ్చిక మేస్తూ వున్నై - పశువుల కాపరి పాలేరు వెంకన్న ఒక తాటి చెట్టుకు చేరబడి, మధ్య మధ్య పశువుల్ని అదలిస్తూ, మెల్ల మెల్లగా పాడుకొంటూ వుంటాడు.)

వెంకన్న : (పాట)

బానిసతనమును - బాపుమురా
భారతభూమికి - భాగ్యము తేరా !
సకల దేశముల - సర్వ మానవుల
సామ్యము - సాధింపుమురా ?

ఒకడు తినుచు - మరియొకడు - పస్తుపడి
యుండుట - ధర్మము కాదురా !
కూడు, గుడ్డ, కొంపయు సమానముగ
కూర్పుమురా లోకమున.

ప్రభువు - సేవకుడు లేని సంఘమును
పదిలముగా నిర్మింపురా !
సౌఖ్యము, సంతోషము మానవులకు
సమకూర్చుమురా ! వీరా !

(అప్పుడు కుబేర్రావు దురుసుగా ప్రవేశిస్తాడు)

కుబే : యెంకా ! ఒరేయ్ ! దున్నపోతా ! దూడలు తినెయ్యడం లేదట్రా ఆ నువ్వుచేను!

వెం : (అదిరిపడి) ధ ! ధ! ఇలా ! ఇలా ! నువ్వుచేను దూడలు తినవండి బాబు! ధ ! ధ!

కుబే : నువ్వు తినవ్ ! పరిగెత్తరా ఎడ్డి గాడిదా !

వెం : ధ ! ధ! చేలో పడలేదండి ! ధ ! ధ! గట్టున మేస్తున్నాయండి.

కుబే : మాటలు నేర్చిన కుక్క ఉస్కో అంటే, ఉస్కో అందిట ! నువ్వు పాటలు కూడా నేర్చావ్ ! ఆ గట్టంతా మేస్తున్నాయ్ పరిగెత్తరా మొద్దుపీనుగా !

వెం : (పరిగెత్తబోయి పడి, లేచి) ధ ! ధ ! మన పడమటావేనండి బాబు.

కుబే : నక్కతోకంతలేవు, నా కప్పుడే యెదురు చెప్పుతున్నావురా ! గాడిదా! వచ్చేదూడకి పోయేదూడకి ఆ కాస్తపచ్చనా కాయిదాగా లేకపోతే, చే నాగుద్దిరా ? కదలవేం కట్రాడులాగ ?

వెం : (కుంటుతూ పరుగెత్తబోయి మళ్ళీ పడి, కాలి రక్తం తుడుచు కుంటూ) ధ ! ధ ! తిరిగిందండి బాబు !

కుబే : ఒరి నీ మొఖం మండా ! పోరా ఇక్కడ నుంచి.

(వెంకన్న కుంటుతూ మరి రెండడుగులు వేసి, కూలబడతాడు. కుబేర్రావు ఉగ్రుడై వెంకన్నను తన్ని తోసేస్తాడు.)

కుబే : (చిరాకుగా, కోపంగా తిరుగుతూ) పాలేరు పీనుగుకి పాటలెందు కంట! వీడు పాడతాడని ఊరంతా గోలే. తలెత్తు కోలేక పోతున్నాను! వీణ్ణి పాలేరుగా పెట్టుకుంట పాటలు పాడటానికా ! ఓరి పనిదొంగ గాడిదా, పనిదొంగ గాడిదా ! వీడి పని ఇలాక్కాదు. ఇంతకీ ఆ పంతులుగాణ్ణనాలి. వాడు ఈ వూరొచ్చినప్పణ్ణుంచి ఇదే గోల. పాటలు, పుస్తకాలు, చదువులు! ఎంత పంతులైతే మాత్రం చదువో అని ఏడవాలా ? తక్కిన పంతుళ్ళలా జీతాలు తీసుకొంటూ, సొంత పనులు చూచుకోవచ్చుగా ? వీడేదో ఉద్ధరిస్తాడట, చూస్తా !

(ఒక వైపుకు వెళ్ళబోయి, మరోవైపుకు పోతాడు. తెర)

## రంగం:2

(అదే పొలంలో మరొక భాగం - దూరంలో పశువులు మేస్తూ వుంటై. సాయం సమయం. పలురకాల పైరు మొక్కల మీద సాయంకాలపు నీరెండ పడి దృశ్యం మనోహరంగా వుంది. వనబాల బడినుంచి ఇంటికి పోతూ, తనలో తాను ఏదో పాడు కొంటూ, ఆ పొలాల్లో నడిచి వస్తూ వుంది. భుజానికి పుస్తకాల సంచీ వేలాడుతూ వుంది.)

బాల : (పాట)

విశ్రమింపుము, విశ్రమింపుము
విశ్రమింపుము, మిత్రుడా :
నేడు పోయిన, రేపు నీదే
విశ్రమింపుము మిత్రుడా !

పగలు పగలు శ్రమించి జాతికి
ప్రాణమిత్తువు మిత్రుడా !
కాంతులెల్ల హరించి చీకటి
కడలి ముంతురె మిత్రుడా !

విశ్వమునకే సేవకుడవై
విసిగిపోతివి మిత్రుడా !
రేయివచ్చెను, విశ్రమింపుము
రేపు నీదే మిత్రమా ! !

(ఒక గిత్తదూడ గంతులు వేసుకొంటూ ఆమెవైపు వస్తుంది. బాల భయంతో "అమ్మో, అమ్మో" అంటూ, రక్షణార్థం వస్తూవున్న వెంకన్న ఒడిలో పడుతుంది. ఆ సందడిలో బాల తలలో నగ జారిపోతుంది. వెంకన్న ఆమెను విడిచి, గిత్తను అదలించి వెనక్కి తరిమికొట్టి వస్తాడు. నగ చూడరు)

బాల : (కంగారుతో) అమ్మో !

వెం : ఏం భయంలేదు, బాలా ! అది మా బుల్లాంబోతు, నీ రంగుచూచి బెదిరింది.

బాల : (ఆయాసపడుతూ) ఇక ఈ దార్ని రాను, బాబు !

వెం : ఏం, అది నిన్ను పొడవదు. రేపు దాన్ని లంకలోకి తోలేస్తాం కూడాను, నే నిక్కడ వుండగా నీకు భయమా ?

బాల : (నిట్టూర్చి) అబ్బ ! వెంకన్నా ! ఒక గండం తప్పించావు. కృతజ్ఞతగా నీ కేమివ్వను ?

వెం : భాగ్యవంతుల బిడ్డవు "వెంకన్నా" అని పాలేర్ని నోరార గౌరవించి పిలుస్తున్నావు. అంతే చాలు. ఒక దరిద్రుడు గొప్ప వారిచేత మన్నించి పిలవబడటంకంటె కోరదగిం దేముంది ?

(తెరలో పాట)

బాల : అదిగో ! మా అన్నయ్య ఇలానే వస్తున్నాడు. అలాంటి పాటలు నేర్చుకో నువు కూడా !

వెం : నేనా ? నేనువట్టి మొద్దును.

(సుందరం పాడుతూ ప్రవేశం)

సంద : (పాట)

పదరా, పదరా, పల్లెలకు
పల్లెటూరెరా, భారత భాగ్యము !

అజ్ఞానముతో, అధికారపు బహు
ధారపు లోహపు పదముల కింద,
క్రిమి కీటకముల మాదిరి నలిగే
కృషికుల, శ్రమికుల కాపాడుమురా,

పదరా, పదరా, పల్లెలకు
పల్లెటూరెరా, భారత భాగ్యము !

చీకటి కడుపున దాగిపోయి, ఈ
సృష్టి నిద్రపోయెడు నపుడైనా
నిరతి యెరుంగనిగతి పర్విడు రవి
విధమున కార్యసక్తుడవై ॥పద॥

"పల్లెలకు మరలండి" అనే మా ఉద్యమం ఎప్పటికి ఫలిస్తుందో, పల్లెల్లో ఆధునిక విద్యా వైద్య సౌకర్యాలన్నీ లభించే వరకు అది సాధ్యం కాదేమో! (చూచి) ఓహో ! చెల్లీ ; ఇంకా ఇక్కడే వున్నావా ? పోదాం పద, ఓరే వెంకా! మీ కామందుగారు ఊర్లో వున్నార్రా ?

వెం : చిత్తం. ఉన్నారండి బాబు.

సం : వీడేనా బాగా పాడతాడని చెప్పావు చెల్లీ ?

బాల : ఇతడే, ఎంచక్కా పాడతాడనుకున్నావు !

వెం : నేనాండి ? అబ్బబ్బే, నాకేమీ రాదండి బాబు !

సుం : ఫర్వాలేదు, ఏదీ, ఒక్కపాట పాడు, చూద్దాం.

వెం : నిజమేనండి బాబు – దూడల్ని కాసుకునేవాడికి పాటలే మొస్తా యండి. ఏదో బడి పిల్లలు పాడుకొంటుంటే వింటుంటానండి !

భాల : ఒక్కసారి వింటే చాలు. పట్టేసుకుంటాడు.

సుం : మీ కామందు గారు కొడతారని భయం వేస్తోందా !

బాల : అలాంటోడే కుబేరయ్యగారు. అతనికి అసలు మాలా ళ్ళంటేనే మంట. ఆటపాటలంటే మరీ మంట. మేడమీదికెళ్ళి నువ్వు పాడుకుంటేనే, తన దొడ్లో తను విసుక్కుంటూ వుంటా దన్నయ్యా.

సుం : అతను కళలకు శత్రువు.

బాల : అసలు నువ్వంటేనే అతడికి గిట్టదు. మొన్న నాతో అన్నాడు : "ఏంటి మీ అన్నయ్య కుడీ - ఎడమా, మాలా - మైలా లేకుండా అందర్నీ అలా రాసుకు తిరుగుతాడు. ?" అని - అందరూ మనుషులే కదా అన్నాను నేను.

(వెంకన్న కళ్ళల్లో కృతజ్ఞత కనిపిస్తుంది)

సుం : అతడితో పేచీ పడకు చెల్లీ, అతడు మంచివాడు కాడు - వెంకా? పోనీ, మాదగ్గర కుదురుతావా ! ఆ మాత్రం మేమూ ఇస్తాం.

బాల : ఇతడి పాట రోజూ వినాలనిపిస్తుంది నాకు.

వెం : తమదగ్గర కుదిరితే నే నెంతో బాగుపడుదునండి బాబు - నాలుగు ముక్కలు చదువన్నా అబ్బును. మా బాబు ఒప్పుకోడండి.

బాల : ఇతడి బాబేనా ? వాడొక బుర్రలేని కట్టు బానిస.

సుం : ప్రొద్దు పోతున్నది, పాడితే పాడు, లేకపోతే పోదాం పద మరి.

వెం : తమ లోగిలికివచ్చి పాడతానండి బాబు ! దూడలు వెళ్ళిపోతున్నా యండి, కామందు గారు మళ్ళీ తన్నుతాడండి.

సుం : సరే ఐతే, చెల్లీ ! పద.

బాల : తప్పకుండా రా... .... ఏం ?

(సుందరం, బాల నిష్క్రమిస్తారు, వెంకన్న కర్ర తీసుకోటానికి వంగి నగచూచి ఎత్తి)

వెం : ఓహో ! బాలది ! ఇప్పుడే వారికి అందజేయాలి.

(వారికొరకు పరిగెడతాడు. తెర)

## రంగం:3

(గ్రామంలో ఒక భాగం, ఇరుకు వీధి, వీధికి ఇరు ప్రక్కలా రకరకాల చిన్న, పెద్ద ఇళ్లు, ఇళ్ళ అరుగుల మీదా, వీధి లోనూ, అక్కడక్కడా జనం. బడికి పిల్లల్ని పిలుచుకుపోయే ఉద్దేశంతో ఉపాధ్యాయుడు ఉపకారి అటుగా వచ్చాడు. సమయం ఉదయం, బడిలో చేరని పిల్లల తల్లి దండ్రులను ఒక పద్యంలో ఉద్బోధిస్తూ నడుస్తున్నాడు)

ఉపా : ఓ తల్లి దండ్రులారా ! మీ బిడ్డల్ని బడికి పంపించండి !

సీ॥ గోచిపెట్టుట నేర్చుకొనగానె బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులారా !
నడువ నేర్చుటతోడనె బుడతని గొంపోయి
పాలేరుతన ముంచు మాలలార !
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించి
మనుగడలే మాపు జనకులారా !
వంటయిల్లొకటె ప్రపంచమ్ముగా చేసి
తనయల నేడ్పించు తల్లులార !

జాతి శక్తి విహీనమై చచ్చుచుండ
కన్నులను మూసికొంటిరే గాఢనిద్ర ?
శక్తికంతకు మూలము చదువు కాన
బడికి బంపుడు మీ వంశ వర్ధనులను

ఓహో ! విజ్ఞానసంపద కాలవాలమని పేరొందిన ఈ పుణ్యభూమి ఈ నాడు పొట్టచించినా అక్షరం ముక్కలేని ప్రజలతో నిండి ఉన్నది. ఎంత ఘోరం. దేశానికి ప్రజలే శక్తి కదా ?

అట్టి శక్తి అజ్ఞానాంధకారంలో మునిగివుంటే దేశానికి బానిసతనమే గతి –

మన బానిసత్వానికి మన అవిద్యయే ముఖ్య కారణం - దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో సౌఖ్యవంతం కావాలంటే ప్రజలు విజ్ఞాన భూషితులు కావాలి. ఓ భారత పుత్రులారా ! మీ బిడ్డల్ని నూటికి నూరు మందిని విద్యావంతుల్ని చేయండి ! బడికి పంపించండి !

(ఒక రైతు ప్రవేశం)

రైతు : (పరకాయించి చూచి, ముఖం తిప్పుకొని) పంతులా ?

ఉప : ఔనండీ, మీ అబ్బాయి...

రైతు : చెప్పక్కర్లేదు. అనుకుంటూనే వున్నాను. నువ్వు వస్తావని. ఏదో ఇంత వుంది. బ్రతకలేకపోడు. ఇలాపోనియ్యి.

ఉప : మీ వంటి...

రైతు : అబ్బబ్బే, ఇంకేమీ చెప్పొద్దు.

(నిష్క్రమిస్తాడు)

ఉప : చదువంటే రైతుకెంత ఈసడింపు !

(ప్రవేశం ఒక కూలీ)

కూలీ : (చూచి) పంతులుగారండి ! మావొణ్ణండి బాబు, కుబేరయ్యగారి పెత్తండ్రిగారి పొలాన్ని పెట్టేశానండి. ఇంక మీరు ఇటెకేసి రాఅక్కర్లేదండి.

ఉప : పాలేరు తనమే ?

కూలి : చిత్తం, ఎలా గడుస్తాదండి మరి ?

ఉప : నీవు కడుపార కన్న ముద్దు బిడ్డనే నీవు ...

కూలి : మీరు లచ్చుచెప్పండి, అదేం నాకు తెల్దు. తమరు దయచెయ్యండి-

(వెళతాడు)

ఉప : (నొసలు బాదుకుంటూ నిలబడతాడు)

(సుందరం ప్రవేశిస్తాడు పాడుకొంటూ)

సుం : మాష్టారూ ! ఎలావుంది మీ ప్రబోధం ? మొత్తంమీద మీరీవూరు వచ్చినప్పటి నుంచీ వూళ్ళో కుర్రాళ్ళలో విద్యాభిలాష పొడ చూపింది.

ఉప : ఏమో చెప్పలేనండి. పేదరైతుల్లోనూ, కూలీల్లోనూ అసలు విద్యాచైతన్యమే లేదు.

సుం : ప్రభుత్వం నిద్రపోతూ వున్నంతకాలం అంతే. నిర్బంధ ప్రాధమిక విద్య అమలు జరపకుండా పేదల్ని మనం బడికి ఆకర్షించలేం.

ఉప : అంతవరకు మడికట్టుకుని కూర్చోవలసిందేనా ? ప్రభుత్వం దానంతట అది ఏ పనీ చెయ్యదు. దాని చేత పని చెయ్యించు కోవలసిన బాధ్యత ప్రజలదే కాదా ? ప్రజాసేవకుల, సంఘ నాయకుల ప్రబోధాలు అరణ్యరోదనా లేనా ? నేటి అవిద్యకు కేవలం ఆర్థికదుస్థితి మాత్రమే కారణమంటారా ?

సుం : ప్రజల అలసత్వం కూడ కారణమే అనుకోండి.

ఉప : అదే ముఖ్య కారణ మండి.

సుం : నిరంతర ప్రబోధమే దానికి మందు. అది మీరు చేస్తూనే వున్నారు. చాలవరకు సఫలులయ్యారు కూడ.

ఉప : వెయ్యోవంతుకూడ కాలేదు, అయినా నిరాశకు మాత్రం నేను తావివ్వను లెండి. కాకినాడ వెళతాను. సెలవులు కదా ... ఇంత త్వరలోనే మళ్ళీ....?

సుం : అవునండి, పనుంది. మా బాల బాగా చదువుతున్నదా ? కొంచెం ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి మీరు. మా తల్లిగారు మీతో మరీ మరీ చెప్పి వెళ్ళమన్నారు.

ఉప : ఆ విషయం మీరు చెప్పాలా ? ఆమె నా చెల్లెలు కాదా !

సుం : కాకినాడ ఎప్పుడూ రారే ?

ఉప : ఈ మధ్య రావాలనుకొంటున్నాను. వస్తే తప్పకుండ మీ దర్శనం చేస్తాను. హాస్టలేకదా ?

సుం : అవును, మరచిపోకండేం, సెలవు.

(నిష్క్రమిస్తాడు)

ఉప : ఓ భారతీయులారా !

గీ॥ పుణ్యభారత భారతీ పుత్రులారా ?
కన్నబిడ్డ లజ్ఞానాంధకారమందు
ఒకరి నొక్కరు పట్టి కొట్టుకొనుచుండ
విద్య అనియెడు కాగడా వెలుగుజూపి
ఏల రక్షించుకొనరు మీ బాలకులను ?
విద్యలేని మనుష్యులు వింత పశువు
లన వినరె ? పశుత్వమ్మె మీక మృతమగునె ?
బడికి పంపుడు, విద్య నేర్పుడు, రవంత
ముందునకు బోవనిందు మీ ముద్దుసుతల -

## రంగం:4

(అదే పొలం దృశ్యం - గట్ల పొడుగునా గొబ్బి మొక్కలు పూచి వున్నై - వనబాల బడికిపోతూ ఒకొక్క పువ్వునే త్రుంచి, కాడను నోట్లో పెట్టుకుని తేనె పీల్చి పారేస్తూ నడుస్తోంది - తనలో తానే పాడుకొంటూ వుంది. చుట్టూ బెదురు చూపులు చూస్తూ వుంది -)

బాల : -- (పాట)

ముళ్ళమొక్కల ముద్దుల పూలు,
ముద్దుపూలలో మురిపెపు తేనెల్
నా కొరకేనా
నా తల్లి !

తెలుగు పొలములో తెల్లవారెనోయ్
పూవులు విరసీ తావులు పిలిచే,
తెలుగు యువకుడా !
మెలకువ రాదా !

ముళ్ళు గుచ్చుకే, పువ్వుల నీవే
తీరని దాహం తేనె తీర్చునే ?
ఏమి చేతువో
ఏమో తల్లి ?

(అంత వెనుకనుండి కుంటుతూ, కాలికి కట్టిన కట్టుతో ప్రవేశిస్తాడు వెంకన్న – ఎటూ చూడకుండానే రెండుమూడు గొబ్బి పువ్వులు చవిచూచి పారేస్తూ – బాలను చూస్తాడు. దగ్గరకు వస్తాడు)

వెం : బాలా ! అమ్మ దొంగా, నీవా ! రోజూ ఈ పువ్వుల్లో తేనంతా పీల్చేస్తున్న తుమ్మెదవు నీవా !

బాల : ఇంత పొద్దెక్కి ఎవరు రమ్మన్నారు నిన్ను !

వెం : నీకేం మహారాణివి ! కోయిలతో లేస్తావు – పెరుగన్నం తింటావు – తల్లో పువ్వులు పెట్టుకుంటావు – పుస్తకాలు పుచ్చుకొని బళ్ళోకి బైలుదేరతావు.

బాల : నీవు మాత్రం కోయిలతో లేవకూడదా ? పెరుగన్నం తిన గూడదా? జుట్టులో పువ్వులు పెట్టుకోకూడదా ? ముందేవచ్చి ఈ తేనంతా గండుతుమ్మెదలా త్రాగెయ్యకూడదా ? ఎవరొద్దన్నారు !

వెం : (విచారంగా) నాకా అదృష్టమా ? నేను కోడికూతతో లేవాలి. కామందు ఇంటికి వెళ్ళాలి – దూడల్ని మార్చాలి – దొడ్డి ఊడ్చాలి – పేడ చిమ్మాలి, పాచి పనులన్నీ చెయ్యాలి. దూడల్ని విప్పుకొని, పొలం వచ్చేటప్పటికి ఈ వేళ అవుతూ వుంటుంది.

బాల : పాపం ! (జాలిగా)

వెం : నా సంగతికేంలే బాలా ! నాకు కాలమంతా ఒక్కటే, నీకు ప్రొద్దెక్కి పోవటం లేదూ ? మాష్టారు కొట్టరూ !

బాల : ఎందుక్కొడతారూ ! బాగా చదివే పిల్లల్ని ఏమీ అనరు – మా మాష్టారు చాల మంచివారు.

వెం : గొబ్బి కంపలమీద అడుగు వెయ్యకేం, ముళ్ళిరుగుతాయి... నీ పాదాలకి కంపలైనా ముళ్ళు పొదుచుకొని పువ్వుల్నే ఇస్తాయిలే. (కళ్ళు తుదుచుకుంటాడు)

బాల : నీ కళ్ళు చెమ్మగిల్లాయేం ? అంత నీరసంగా వున్నావేం ? కాలికి ఆ కట్టేమిటి? పొద్దున్న ఏం తినివచ్చావు ?

వెం : ఏం తిన్నాను నా ముఖం ? నిన్నటినుంచి ఏమన్నా తిన్నానా ?

బాల : ఆ c ! ఏం తినలేదు ?

వెం : పోనీలెద్దూ !

బాల : మరెలాగ ? ఎలా వుంటున్నావ్ ?

వెం : నా కలవాటే – కామందులకు కోపంవస్తే చావదన్ని చప్పగా మాడేస్తారు. పొట్టిగిత్తను తిరగదోల్తుంటే నిన్న నెరబొత్తలో పడి కాలు బెణికింది – దూడను నిలబడి అదలించానని మా కామందు తన్ని తంపటేశారు !

బాల : మరెందుకీ పాలేరుతనం ?

వెం : గతిలేక –

బాల : మరి మీ బాబున్నాడుగా –

వెం : అతనికంటె మా కామందే నయం –

బాల : పాపం, మరెలా గిప్పుడు ?

వెం : ఏం ?

బాల : నీకు ఎంత ఆకలిగా ఉందో ? ఎలాగ !

వెం : నా గురించి ఆలోచిస్తున్నారా ? వద్దు - వద్దు బాలా ! అంత మాటన్నావు, చాలు, ఇక వెళ్ళు, నీకు ప్రొద్దుపోతుంది.

బాల : (సంచిలోనుంచి తీస్తూ) కొబ్బరి తింటావా ?

వెం : వద్దు - పస్తుండటం చేతగాని వాడు పాలేరుతనం చెయ్యలేడు.

బాల : బెల్లం కూడా వుంది.

వెం : నాకేమీ వద్దు. నీ ఆహారంతో నేను ఆకలి తీర్చుకోలేను.

బాల : ఇవి నా ఆహారం కాదు. నేను గొంతుదాకా తినే బైలుదేరాను - బళ్ళో పిల్లలకు పెట్టెయ్యటానికే.

వెం : నాకు వద్దు - కొబ్బరి నాకు పడదు.

బాల : అన్నం అక్కర్లేకుండా ఒక్క కొబ్బరి తినే బ్రతకవచ్చని మా మాష్టారు చెప్పారు.

వెం : ఐనా సరే, నాకు వద్దు - నన్ను బలవంతం పెట్టవద్దు.

బాల : (అభిమానంతో) వద్దా ?

వెం : వద్దు -

బాల : వద్దా ? ఇదిగో చిమ్మేస్తున్నా - (చిమ్మబోతుంది)

వెం : ఆఁ ఆఁ (వారిస్తూ) తప్పుకాదూ ? ఆహారాన్ని పండించాలేగాని, నాశనం చెయ్యటం ఎంత పాపం ?

బాల : పండిన ఆహారం సద్వినియోగం కాకుండా మూలపడి వుండి నీవంటి కష్టజీవులంతా మల మల మాడిపోతూ ఉండటం పాపం కాదా ? వద్దా ?

వెం : ఏదీ -- (దోసిలిబట్టి స్వీకరించి) మహాప్రసాదం .

బాల : (ఆనందంతో) రోజూ మా అమ్మ నా సంచిలో ఏదో వేస్తూనే వుంటుంది. అది మనకిద్దరికీ సరిపోతుంది ఏం ?

వెం : నా పాలిటి అన్నపూర్ణవు. బాలా , రేపటినుంచి నాకేమీ తేవద్దు - తెస్తే మరి నీకు నేను కనపడను.

బాల : చూస్తాన్లే ఎలా కనబడవో ! (చూచి) అదిగో మాష్టారు యిలాగే వస్తున్నారు, నే వెళతాను (సంచితో పరుగెత్తుతుంది.)

వెం : (దోసిట్లోకి చూసుకొంటూ, కన్నీరు నింపుతూ) నీ కెంత ఆకలిగా వుందో - ఎలాగా ? నా తల్లి పోయిన తర్వాత ఆ మాత్రపు జాలిమాట నేటికి విన్నాను. పాలేరు వాణ్ణి చూచి జాలిపడే దయగలవాళ్ళు లోకంలో వున్నారే! పరమేశ్వరా ?

పాట

ఆకటదూలీ అలసిన బ్రతుకున
అశేప్రాణము--దేవా !
కాలేకడుపుకు-- మండేబూడిద
కమ్మని కూడో -- దేవా !
ఆకురాల్చి మ్రోడైన చెట్టునకు
అలరుగాలమో దేవా !
అంధకారమున మ్రగ్గే జీవికి
అరుణోదయమో-- దేవా !
రాలే పూలకు మొలిచే మొగ్గలు
ప్రాణము లోయీ -- దేవా !
మనుజులలో యీ మాత్రపు సత్యము
మరుగై యున్నది-- దేవా !

(ఒకవైపు నుండి ఉపకారి, ఒక వైపునుండి వీరేశు ప్రవేశిస్తారు.)

ఉప : వెంకన్నా, చక్కగా పాడతావురా, ఏ సినిమావాళ్ళో యెత్తుకుపోతార్రా నిన్ను!

వీరే : అందానికి నేను, సంగీతానికి మా అప్ప అన్నట్టు, యేం పాటలండీ పంతులుగారూ ? పాలేరోళ్ళకి పాట్లెందుకండి ? దూడని తిరగెయ్యడం చేతగాదు మావోడికి, తాలింపులో నీళ్ళచుక్కలాగ 'చుంయి' మంటే యేమౌద్దండి బాబు !

ఉప : కాదురా వీరేశు ! మనం వట్టి పాలేరుతనం కోసమే అంటావా ?

వీరే : పంతులుగారిచేత తినే తన్నులకంటే కామందుచేత తినే తన్నులకు యిలవెక్కువండి బాబు ! నేను మొదట్లో మా బాబు బాధపడలేక బళ్ళోకెళ్ళానండి. ఆ పంతులు రోజూ పట్టుకు తన్నేవోడండి ! బళ్ళోకెళ్ళకపోతే మా బాబు తన్నేవోడండి – ఎందుకొచ్చిందిరా దిక్కుమాలిన చదువని – పారిపోయి పాలేరుతనానికి కుదిరానండి బాబు, పంతులుగారు !

వెం : ఆహా ! ఎంత ఆదర్శ(ప్రాయుడో వీరేశు తండ్రి !

ఉప : వీరేశు ! ఇపుడు నీకు జీతమెంత ?

వీరే : నాలుక్కుంచాలండి – నాలుగు ?

ఉప : స్వతంత్రమైన వృత్తిలో అంతకన్నా ఎక్కువ సంపాదించలేవా ? పోనీ – చదువక్కరలేదనుకో, మనిషిగా గౌరవంగా బ్రతికే మరో వృత్తి చేసుకోగూడదా?

వీరే : నా కదంతా తెల్దండి బాబు.

వెం : పోనీ – తెలుసుకోడానికి ప్రయత్నమైనా చెయ్యవద్దా ?

వీరే : చెప్పావు – నోరుమూసుకోవోయ్ – గుడ్డెల్లి పిల్ల నెక్కిరించినట్టు ! నిన్న తిన్న తన్నులు చాలవు నీకు !

ఉప : తన్నులా ? వెంకన్నా ! నీవు ఈ పాలేరుతనం రొంపిలో ఎలా పడ్డావురా ! బడికి వచ్చేశెయిరా.

వీరే : నాకు తెలవక అడుగుతానండి బాబు. చదువు కూడెడత దంటారా?

ఉప : ఎందుకు పెట్టదు ?

వీరే : మరి ఈ చదువుకున్న కుర్రకుంక లంతా అలా తిరుగుతారేం - వీధులంట, ఈతరుప్పల్లాగ తల్లిరబోసుకొని ?

ఉప : అది చదువురాని, పరీక్షలు ఫేలయిన, మొద్దు సరుకు చేసేపని– అది చదువు తప్పా ?

వీరే : ఇంతింత తలలు పెంచుకొంటారండి ఒకొకళ్ళు.

ఉప : వీటినే వెర్రితలలు అంటారు. చదువురానివాళ్ళు పశువులతో సమానం - మామూలు పశువులు కాదు, వింత పశువులు.

వీరే : నాకు 'కా' గుణింతందాకా వచ్చునండోయ్, ఏమనుకుంటున్నారో?

ఉప : గొప్ప చదవరివే !

వీరే : మా కామందుగారికి 'యి(రా' గుణింతందాకా వచ్చునండి.

వెం : భలే (నవ్వుతాడు)

వీరే : నవ్వుతావోయ్, నవ్వు ! నవ్విన నోరే ఏడుస్తది. అదుపు చేసుకో!

ఉప : సరే, వెంకన్నా, నువ్వు మీ బాబుని మరోసారి గట్టిగా అడుగు– బళ్ళోకి పంపించమని.

వీరే : గట్టిగా అడిగితే , గట్టిగా తన్నమని పుల్లయ్యతో చెపుతా–

(వెళ్ళిపోతాడు)

ఉప : ఈ శనిగా డేమిటి నీకు ?

వెం : తోడి పాలేరండి ! ఇతడెప్పుడూ ఇంతే, చాడీలు చెప్పి మా బాబు చేతా, కామందుచేతా తన్నిస్తాడండి నన్ను.

ఉప : అబ్బే ! నీవు ఈ నరకంలో ఉండలేవు - నూరు కాకుల మధ్య ఒక కోకిల, బళ్ళోకి రావడానికి గట్టిగా కృషి చెయ్యి. నీకు పుస్తకాలు, బట్టలు నేను ఇస్తాను. ఏదీ నిన్నటి పుస్తకం ?

వెం : (తలపాగాలోంచి తీసి ఇస్తూ) ఇదీ చదివేశానండి - ఇంకో పుస్తకం ఇప్పించండి.

ఉప : రేపు తీసుకొస్తాను - మన బడిసాలలో రేపటినుండి రాత్రిబడి పెడుతున్నాం, నీవు కూడా రా - పెద్ద వాళ్ళయిన పాలేళ్ళకి, రైతులకీ చదువు చెప్పడానికి రాత్రిబడి.

వెం : చిత్తం, తప్పకుండ వస్తానండి.

ఉప : ఇక పోయివస్తా - ఏ సంగతీ ఈ వేళ తేల్చేసుకో.

(నిష్క్రమిస్తాడు)

వెం : ఈ వేళ నేను లేచిన ఘడియ మంచిది. బ్రతుకు దారి తప్పుతూ వుంది.

(పాట)

దారితప్పిన బాటసారీ !
ధైర్యమోయీ బాటసారీ !

మింటి చుక్కో - మిణుగు పురుగో
కంటికంతా చీకటేనా !

అరుణరాగమొ అమృతగానమొ
అర్థరాత్రికి అంతులేదా -

కంటిలోపలి కాగడాతో
మింటివరకూ చూడలేవా

కట్టుకొయ్యగ నిలువనేలా !
పెట్టుమోయీ అడుగు ముందుకు,

దారి కంటక పూరమైనా
ధైర్యశాలికి భారమౌనా ?

(మెల్లగా తెర జారుతుంది)

## రంగం:5

(కుబేరరావుగారి లోగిలి బైట - ఆ చుట్టు పక్కల అదే పెద్ద లోగిలి. చుట్ట కాల్చుకొంటూ, చేతికర్రతో నేలను తడుతూ కుబేరరావు వీరేశుతో మాట్లాడుతూ వున్నాడు - వీరేశు చేతిలో కూడ ఒక కర్ర వుంది. తలకు తుండు గుడ్డ, ఎవరి మీదో చాడీలు చెపుతున్న ఫోజు)

కుబే : అదర్రా ? అదా సంగతి ? ఒక - సంగీతమే అనుకున్నాను, సాహిత్యం కూడానా ? ఓరి వీణ్ణి తగలెయ్యా !

వీరే : రాత్రి బళ్ళోకి వెళ్ళుతున్నాడండీ.

కుబే : ఆఁ ! రాత్రిబడే ! ఆ పంతులుగాడు చేస్తున్నాడ్రా ఇదంతా - వాణ్ణి పాతెయ్యా ! సరే ! నువ్వుపోయి ఆ పుల్లణ్ణి పిలు -

వీరే : మీకు 'యిర్రా' గుణింతందాకా వత్తాదని నేనంటే, నవ్వాడండి.

కుబే : (ఉగ్రుడై) ఆ ? దున్నపోతు ? నవ్వాడూ ? ఆ నవ్విన నోటే ఏడిపిస్తా !

వీరే : చిత్తం, అదండి. (వెళతాడు)

కుబే : ఓరి వీళ్ళమీద బాంబులుపడా ? చంపేస్తున్నారు. పేడ పిసుక్కునే వెధవలకి చదువులూ, సంగీతాలూనా !-

పుల్లయ్య: (ప్రవేశిస్తూ) దండాలుండి బాబో !

కుబే : పుల్లిగా ! నీ బాబుకి గోచీ పెట్టడం చేతనవునూ ?

పుల్ల : చిత్తం బాబయ్యా !

కుబే : కాదురా, నీకు పంచికట్టు చేతనవునూ ?

పుల్ల : చిత్తం బాబయ్యా !

కుబే : ఓరీ దున్నపోతుకొడకా ! మీ యింటావంటా ఎపుడైనా చదు వుందిరా?

పుల్ల : చిత్తం బాబయ్యా ! ఆc ? ఆc ? (అర్థం చేసుకొని) అదాండి ? లేదండి బాబు, లేదండి.

కుబే : మీలో చదువుకోవడం పాపం కాదంట్రా ?

పుల్ల : బోల్డంత పాపం బాబయ్య ; మహా గోర పాపం కాదండీ ! మా తాతనాడు గాని, మా బాబునాడు గాని, నేనుగాని, నా కొడుకు యెంకడు గాని...

కుబే : ఆగరా ! నీ దాకా బాగానే వుంది. యెంకడితో మీ ఆచారం అంతా మట్లో కలిసిపోయింది.

పుల్ల : లేదండి బాబు, నా తోడండి, నా పేణం తోడండి, వాడల్లాటోడు కాదండి.

కుబే : ఊరుకోరా ! వాడోదొంగ, నువ్వోదొంగ !

పుల్ల : (గుండె బాదుకొంటూ) నే నాండి? నేనే ? ఇంత టోణ్ణయానూ, ఒక్క పుల్లముక్క ముట్టు కున్నానా తమ కమతంలోది ? ఇంకా చూసుకోండి ఏమి దొంగతనం చేశానో - ఎక్కడ దాచుకున్ననో ! (పాగా, సంచీ చూపుతాడు)

కుబే : ఓరి మట్టి తలకాయ గాడిదకొడకా ! అది కాదురా ! పాలేరు తనం చేసుకు బతికే తొత్తుకొడుక్కి చదువేమిటిరా ! చదువు !

పుల్ల : ఎవడికండి బాబు ! పొట్ట చించినా అచ్చరం ముక్క వుందాండి నాకు ?

కుబే : అబ్బబ్బా ! చంపేస్తున్నావురా ! మీ యెంకడ్రా !

పుల్ల : (ఉలిక్కిపడి) అమ్మ నాయనోయ్ !

కుబే : వాడింక పనికి రాడురా -

పుల్ల : ఓరి దేముడోయ్, (గుండె బాదుకుంటాడు)

కుబే : పని ముట్టుకోడం లేదు. అస్తమానం పాటలూ, పుస్తకాలూ ! పాలేరుతనం మానిపించేయ్, చదివించి కలగటేరు పని చేయించు.... వో ?

పుల్ల : (బోకారి) గులాపోళ్ళం బాబయ్యా ! రచ్చిండండి బాబయ్యా! ఆ గాడిదకొడుకుని తన్ని తంపటేసేత్తా, ఉప్పు పాతర్ని పెట్టేత్తా - తమచేతి కడ్డమేముంది ? మక్కు తిరగబొడవలేక పోయారా ?

కుబే : ఏదో చేశాన్లే - వాడికి సరిగా బుద్ధి చెప్పగలిగితేనే వుంచు. లేకపోతే మరోదారి చూసుకో - ఏదో చిన్నప్పటినుంచీ ఆశ్రయించుకుని వున్నవాడివి కాబట్టి ఆలోచిస్తున్నాను - సరే పో -

(నిష్క్రమిస్తాడు)

పుల్ల : (ఒక కఱ్ఱతీస్తూ) ఎంకడి వొంటిమీద యీ కఱ్ఱ తుక్కై పోవాలి, నాకడుపున చెడబుట్టాడు - ఇంత మొగోణ్ణయాను, ఒక్కమాట యెదురు సెప్పానా కామందుగారికి ? ఎన్ని తిట్టినా, ఎన్ని కొట్టినా కామందుగారి కాళ్ళేపట్టుకుని బతికానుకాని, యీ ఎధవలాగ చదువో చదువో అని యేడ్చానా ?

వీరే : (ప్రవేశించి) ఏంటి మామా, అడావిడి ?

పుల్ల : కాదురా - యీరేశు ! నువ్వూ మాయెంకడి తోటోడివే కదా ? చూడు ఏంచక్కా చేసుకుంటున్నావో పని ? మా కుఱ్ఱగాడిద కొడుకు...

వీరే : ఆడికేనా..... అమ్మ, ఆడికి చదువు లెక్కువైపోయాయి...... చదువులు!

పుల్ల : నా ఖర్మంరా బాబు ! నా ఖర్మం

వీరే : మా బాబు నన్ను బళ్ళోకెళ్ళమని చితగ్గొట్టేవాడు - బళ్ళోపంతులుగారు కోదండం వేయించేవాడు - ఐనా సరే - తస్సాగొయ్య - నేను చదువుకున్నానా !

పుల్ల : బుద్ధిమంతుడివిరా ! నువ్వు బాగుపడేవోడివి గనుక ఆ బడికి తగులడకుండా బతుకుతున్నావు, మా దద్దమ్మకి చదువు కావాలంట.. చదువు.

వీరే : యెంకడికి కొంచెం బలిసిందిలే .... వొదలగొట్టు -

పుల్ల : కొంచెమేమిటి ? అంతా వదలగొట్టేత్తాను. ఆ వొచ్చేవోడేగా ? రానీ

వీరే : ఆడే, ఆడే, నే పోతాను, నేను చెప్పి కొట్టించా నంటాడు మళ్ళీ (పోతాడు)

పుల్ల : చావగొట్టి చెవులు మూత్తా నీ వేళ - రా, రా -

వెం : (చేతులు మోడ్చి, ప్రవేశిస్తూ) దండం బాబోయ్ -

పుల్ల : నీకు కర్రావోరి అమ్మాయిని పెళ్ళిచేత్తాను రా, రా, రా, (జబ్బ పట్టుకొని) నువ్వేంటి పుత్తకాలు చదివేత్తున్నావంట ?

వెం : ఇంకెప్పుడూ చదవను బాబోయ్.

పుల్ల : అమ్మ గాడిదకొడకా ? చదువుతున్నావూ (ఒకటి కొడతాడు)

వెం : కొట్టకు బాబో ! ఇంకెప్పుడు చదువను బాబో !

పుల్ల : ఇప్పుడుదాకా చదివిందంతా మరచిపో !

వెం : ఎలా మరచిపోను బాబో !

పుల్ల : ఆఁ ! మరచిపోలేవు ? (కొడతాడు, వెంకన్న భోరున యేడుస్తుంటే, ఉపకారి ప్రవేశిస్తాడు.)

ఉప : ఏమిటయ్యా అది ?

పుల్ల : మా కుర్ర వెధవకి వొళ్ళు బలిసింది లెండి, వదలకొడుతున్నాను. (మళ్ళీ కొట్టబోగా, వెంకన్న పారిపోతాడు)

ఉప : పుల్లయ్యా ! బంగారం లాంటి కుర్రవాణ్ణి ఎలా పాడుజేస్తున్నావు ?

పుల్ల : పనికిమాలిన వెధవండి - పాలేరుతనం చెయ్యలేనివాడు కూడ ఒక మనిషే అంటారా ?

ఉప : అయ్యయ్యో ! పాలేరుతనమా ? పాలేరుతనమూ ఒక వృత్తే అంటావా ? స్వతంత్రంగా బ్రతికే మనిషే మనిషి అంత ఎందుకు? వెంకన్నను నా చేతిలో పెట్టు. అతణ్ణి ఒక మహారాజులాగ తయారు చేస్తాను.

పుల్ల : చెప్పా వెల్లవయ్యా - తెల్లబట్టేసుకుంటే నేనూ అవుతాను మహారాజుని - మరి కడుపులోకో ?

ఉప : ఆ పిల్లవాడి వయస్సెంత ? వాడు తెచ్చేజీతమెంత ? పసిపిల్లల కష్టం తిని

బ్రతికే తల్లి దండ్రులు మనుష్యుల్లో లెక్కేనా ?

పుల్ల : ఒస్, పోవోయ్ – ఈ పాటికి – పుట్టావు పిల్లల్ని పాడుచేయటానికి.

ఉప : నీవు పాలేరువు. నీ బిడ్డనుకూడా పాలేర్ని చేస్తావా ? అంతకంటే ముందుకు పోనివ్వవా ? పాలేరు తరతరాలకూ పాలేరే అన్నమాట?

పుల్ల : అన్నమాట లేదు, తమ్ముడు మాటాలేదు : యెల్రా, యీ పాటికి. నువ్వెంత యేడ్చినా నా కొడుకును బల్లోకి పంపను.

ఉప : అయ్యయ్యో ?

పుల్ల : చదువు మా వంశంలో లేదు, మాకు చదువు అచ్చిరాదని మా కామందుగారు చెప్పారు, అచ్చురాలా అంతే – 'అ, ఆ'లు దిద్ది మోయి మా తాత కాలిరిగి చచ్చాడంట. మా బాబు రాగం తియ్యమోతే పళ్ళురాలి చచ్చాడంట.

ఉప : పాపం ఎంత అమాయకత్వం !

పుల్ల : ఆం, ఏంటి ? యెధవకూతలు కుయ్యకు పో, ఈ రోజు మొదలు ఈ చుట్టుప్రక్కల కనిపించావంటే చూడు మరి, చచ్చినా సరే, మావోణ్ణి బడికి పంపించను – పో – పో – (కర్రతో నేలను కొడుతూ, దురుసుగా పోతాడు)

ఉప : ఓహో ! మూర్ఖుడైన తండ్రికి కొడుకూ పుట్టటం ఎంత దురదృష్టం! మూర్ఖుడైన పుల్లయ్యకు పుట్టటం అనే ప్రమాదం జరగటం వల్లగదా వెంకన్న వంటి రత్నం మట్టిగొట్టుకుపోతున్నాడు ! అంధకారం అధికమౌతున్న కొలదీ వెలుగుచూసేవాడి బాధ్యత ఎక్కువవుతూ వుంటుంది. అవిద్యను పారద్రోలడానికి నా శక్తి సామర్థ్యాలన్నీ ఉపయోగిస్తాను – పాపం, వెంకన్న స్థితి !

గీ. రాజవనమున పుట్టిన రాయి కూడ
రాణి కుచహారముల ముద్దులానగలదు
పల్లె చెరువున బూచిన పద్మమైన
అంధ తిమిరాల అజ్ఞాతమై యడంగు.

(నిష్క్రమిస్తాడు)

## రంగం:6

(పొలంలో పశువుల్ని మేపుతున్న వెంకన్న - సమయం ఉదయం - కాలికి కట్టు - తలకు తుండు గుడ్డ పాగా - అందులోంచి ఒక చిన్న నలిగిపోయిన పుస్తకం తీసి చూచుకొంటూ, పాడుకొంటూ, పశువుల్ని అదలిస్తూ, పరిసరాలు పరికిస్తూ వున్నాడు - మధ్య మధ్య కాలి దెబ్బకు బాధపడుతూ వున్నాడు)

(పాట)

కాళ్ళబడిపోయేటి గడ్డిపూలారా
సుందరాంగుల జటా శోభ మీకున్నదా ?

లోతు సంద్రాలలో పాతుకొన్న మణీ !
భరతమాతను గొల్చు భాగ్యమ్ముగల్గునా ?

దూరానగల పల్లెటూరి బాలకుడా !
దేశభక్తులజాడ తెలిసి వర్తింతువా !

తడిలేని మడిలోన కడుబీద బడియేడ్చు
ఓ తల్లి ! నీ కేక కొకడైన పల్కునా ?

ఊళ్ళో కామందుచేత దెబ్బలు, ఇంటికాడ తండ్రిచేత తన్నులు ఓ పాలేరా! నీ జీవితం ఎంత దుఃఖకరం ! అయ్యో, నా పనితనానికి చీడపురుగు పట్టిందే! ఇక నాకు ఎదుగు బొదుగులు లేవా ? ఆశల్ని చంపి చిన్నప్పటినుంచే పసిబిడ్డను ఒక పశువులాగ తయారు చేసే పాలేరుతనం నాకు దాపరించిందే! అయ్యో, పాలేరుకు చదువు పనికి రాదా ? చదువు స్వతంత్ర భావాల్ని కలిగిస్తుందా ? చదువుకున్నా బానిసలై బ్రతుకుతున్నవాళ్ళు ఎంత మంది లేరు ? ఇక నాకు దిక్కేది ? ఈ నరకం నుంచి బయటపడే దారేది? చదువు సంధ్యల్లేక, ప్రపంచమంటే ఏమిటో తెలియక, నూతిలో కప్పలాగ, పగ్గంపోసి కట్టిన పశువులాగ, ఏదో ఇంత గడ్డి తింటూ బ్రతకనా? అదిగో ! ఆ బడికిపోతున్న పిల్లలు ! ఆహా ! ఎంత కులాసాగా పోతున్నారు బడికి! వాళ్ళ

యీదువాణ్ణి కానా నేను ! వాళ్ళు పొందే ఆనందానికి అభివృద్ధికి నోచుకోలేదా నేను ? అయ్యో ! తండ్రీ ! ఈ రొంపిలో నన్ను త్రొక్కే శావే! ఈ ఊబిలో నన్ను కూలేశావే ! పాలేరుతనమే పరమావధి చేశావే ! ఓరి బాబు ! నీవు రాక్షసుడవా ?

బిడ్డల్ని బడికి పంపించక, విద్యాబుద్ధులు చెప్పించక పాలేరుతనాలు పెట్టి, ఆ పసిబిడ్డల కష్టంతిని బ్రతికే ఓ తల్లిదండ్రులారా ? మీరు యెంత నీచులు! ఛీ! మీ ముఖం చూడగూడదు.

ఓ పెద్ద పాలేరా ! నీ కొడుకును చిన్న పాలేర్ని చేస్తావా? నీ చేతి కర్ర, నీ చెప్పుదెబ్బలు, నీ గంజికూడు తప్ప నీ ముద్దుల కొడుకును ఒక్క అడుగైనా ముందుకు వెయ్యనియ్యవా?

ఓరి దరిద్రుడా ! నీకన్న దరిద్రులు యెంతమంది తమ బిడ్డల్ని చదివించుకుంటున్నారో అలా చూడు ! నీ నీచత్వానికి కారణం పేదరికం కాదు, కులం తక్కువతనం కాదు, మూర్ఖత్వం ! అబ్బా! ఈ పాలేరువాళ్ళంతా గొడ్డుమోతులై పోతే యెంత బాగుండును ! ఇక నాకేది దిక్కు- ? ఏది దారి? బానిసగా బ్రతికేకంటే మరణం మేలుకదా ?

ఇక నాకు మరణమే శరణ్యం - పాలేరుగా బ్రతకలేను - విద్యావంతుణ్ణి కాలేను. ఈ పర్రనూతిలో పడి, యీ దరిద్రదాస్య జీవితాన్ని ముగించేస్తాను. అంటరాని, అసహ్యకరమైన, ఈ నా నికృష్ట జీవితం స్వతంత్ర నాగరిక జాతికి ఒక మచ్చ - ఇది నే భరించలేను - (నూతి దగ్గరచేరి చేతులు మోడ్చి ) ఓ పరమేశ్వరా? యీ బావిలో దూకి ప్రాణ త్యాగం చేస్తున్నాను - ఇక నీలో కలిపేసుకో:

సీ. మాలను గావించి - పాలేరుగా జేసి
కామందు కాలికి - గట్టినావు
అంటరాదని చెప్పి పెంటల పాల్జేసి
నీచులమను పేర నిల్పినావు
చదువు సంధ్యలు లేక జంతువులను బోలె
ఊరి వెల్పల చావ నుంచినావు.
జ్ఞాన తిమిరాల యడుగున బడద్రోసి
బరిగీసి యెదనొక్కి పట్టినావు

వెలుగు చూపవు, నేర్పవు మెలగు సరళి,
దాస్యముం బాపు కోనీవు, ధైర్యమూని
మనిషిగా నన్ను మననీవు, మహి నికేల
చంపుకొని పొమ్ము, చాలింతు జన్మమిక

(నూతిలో దూకబోతూ ఉండగా తెరలో పాట వినిపిస్తుంది. ఆగి వింటాడు - బాల బడికిపోతూ, తెరలోనుంచి పాడుకుంటూ ప్రవేశిస్తుంది.)

బాల : (పాట)

ధైర్యము విడిచెదవా ? వీరా !
ధర్మము మరిచెదవా ?

పరకను పామని భయమొందుదువా ?
పిరికివాడవై పరువెత్తుదువా ?

బానిసత్వమని బాధపడుదువా ?
స్వేచ్ఛా జీవిక అందరానిదా ?

ఓ యువవీరా ! ఉత్తేజముతో
సాగిన నీ దాస్యము విడిపోదా !

నిస్పృహ యేలా ? నీ హృదయములో
సోమరి తనముకు చోటీయకుమా !

విక్రమింపుమా వీరుడవై
విజయము నీదేరా !

(హఠాత్తుగా వెంకన్నను చూచి) అదేమిటి వెంకన్నా ! బావిలో తలపెట్టి, భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నావు !

వెం : (కన్నీరు తుడుచుకుంటూ) ఏమో – ఆపత్కాలంలో అలవాటు చొప్పున తలచుకోవటమేగాని, నిజంగా దేవుడున్నాడనే నమ్మకం నాకు లేదు. ఉంటే మనిషికిన్ని కష్టాలా ? మనుషుల్లో ఇన్ని తేడాలా? పోనీగాని – నీకు ప్రొద్దెక్కుతున్నది. త్వరగా పో బడికి.

బాల : ఫర్వాలేదు కాని – నీవు రోజు రోజూ అలా నీరసపడిపోతున్నావేం? ఆ దెబ్బలేమిటి ? అమ్మో రక్తం కారుతున్నది, కట్టు కట్టనా ? (ప్రయత్నిస్తుంది)

వెం : (వారిస్తూ) వద్దు బాలా, వద్దు, నీ బంగారు చేతులు నెత్తురవుతాయి.

బాల : ఆ వెధవ పాలేరుతనం మానేద్దూ !

వెం : నా కా అదృష్టం లేదు.

బాల : ఊరికే కూర్చుంటే ఎలా వస్తుంది అదృష్టం ?

వెం : పాలేరుతనం తప్ప నాకు గత్యంతరం యేముంది ?

బాల : బడికి రా !

వెం : బడికా ? అమ్మో ! ఆ మాటెత్తితే మా బాబు గొయ్యితీసి నిలువునా పాతేస్తాడు.

బాల : మీ బాబుకి నచ్చ చెప్పలేవా ?

వెం : అసలు చెప్పనిస్తేగా, నచ్చ జెప్పడానికి ?

బాల : అయ్యో ! అంత చాదస్తుడా ?

వెం : ఏమో నా కదంతా తెలీదు - నాకు పాలేరుతనం తప్పదు - అది నేను చెయ్యలేను.

బాల : మరి ?

వెం : మరి - లేకుండా పోవడమే -

బాల : అంటే ?

వెం : అంటే - మరణమే - దాంతో యీ బాధలు, బెంగలు, ఆకలి, అవమానం అన్నీ నన్ను వదలిపోతాయి.

బాల : చాల్లే - కాని ఆకలి అంటే జ్ఞాపకం వచ్చింది, నేనుండగా నీకు ఆకలా ? (సంచిలోనుంచి అరటి పండ్లు తీసింది)

వెం : (నిరాకరిస్తూ) తేవద్దని చెప్పలే ? నీ ఆహారం నేను తీసుకొని, నా ఆకల్ని నీకు అంటగట్టనా ?

బాల : ఆహారాన్ని స్వీకరించి ఆకల్ని దానం చేసేవాళ్ళు వేరే వున్నారు. ఈ పళ్ళు నీ కోసమే తెచ్చా.

వెం : మీ తల్లి గార్ని అడిగి తెచ్చావా ?

బాల : లేదు.

వెం : నా గురించి నీవు దొంగతనం చేశావా ?

బాల : నా సొమ్ము నాకు దొంగతనమా ?

వెం : చాటుగా తెచ్చావా లేదా ?

బాల : లేదు - అయినా, అదంతా నీకెందుకు ? తింటావా, తినవా ?

బాల : నాకు వద్దు.

బాల : గిరాటేస్తున్నా (గిరాటెయ్య బోతుంది)

వెం : ......................

బాల : చంపక, తీసుకొందూ!

వెం : ఇతరుల సొమ్ము నాకువద్దు.

బాల : ఎంత మూర్ఖుడివి ! (కోపంతో పళ్ళు గిరాటేసి పోతుంది)

వెం : (చెమ్మగిల్లిన కళ్ళతో ) ఆహా ! ఎంత దాక్షిణ్యం !

(పాట)

ఈ యెడారిలో మబ్బు నీడలా
ఓయాసిసులా దేవా ?
నడి సంద్రములో జడి వర్షములా
నౌకాశ్రయమా, దేవా !
వేసవి నడి మధ్యాహ్నములో - చలి
వేంద్ర గట్టితివె దేవా !
పడగొట్టిన యీ పాంథుని నోటికి
పాయసాన్న మా దేవా !

కుబే : (దురుసుగా) ప్రవేశించి ఒరే గాడిద కొడకా ! నీకు బ్రతుకే రోజులు లేవురా? (వెంకన్నను కొడతాడు). చదువుకునే పిల్లలతో స్నేహమంట్రా? దున్నపోతా! (మళ్లీ కొడతాడు. పుస్తకం చూచి) పుస్తకమే ! నీదే ! పాపంరా ! ఓరి పాపిష్టి ముండా కొడకా ! (పుస్తకం చింపి పారేస్తాడు - అరటి పండ్లు చూచి) అరటిపళ్ళే ! ఎక్కడివిరా ? తోట్లోవా ? ఇంట్లోవా? ఓరి దొంగ

గాడిద కొడకా! నాకెక్కడ దాపురించావురా, (మీదపడి ఒళ్ళు తెలియని రీతిగా తన్నుతాడు - వెంకన్న పెద్ద గోల చేస్తూనే ఉంటాడు - అంత ఉపకారి ప్రవేశిస్తాడు.)

ఉప : (అడ్డుబోయి) ఆగండి ! కుబేరయ్యగారు ! పసిబిడ్డని అలా కొట్టుకుంటా రెందుకండి ?

కుబే : ఏడ్చావ్, పోవోయ్ పంతులు ! అసలు నిన్నీ దార్ని రమ్మన్న వాడెవడు ? రే పీ దారిలో కంపలు పాతించేస్తా.

ఉప : ఔను, బ్రతుకుదెరువుల్లో కంపలు పాతేవాళ్ళనే వరిస్తుంది లక్ష్మి, అధికారమూ, అలాంటి ప్రమత్తుడికి కళ్ళు కనిపించవు.

(వెంకన్న నెమ్మదిగా పోతాడు)

కుబే : ఓరి నీ సిద్ధాంతం మండా - ఈ మాటలన్నీ నన్నే ! నాముందటే!

ఉప : నిన్ను కాదు - పాలేరు తనాన్నీ, కామందు తనాన్నీ , వర్ణ వ్యవస్థనూ సృష్టించిన సంఘాన్ని. ఒక వ్యక్తిని నేను ఎన్నడూ అనను - పద్ధతినే అంటున్నాను.

కుబే : చాతుర్వర్ణాలనూ దేవుడే పుట్టించాడు - మనమేం జేత్తామోయ్ ? ఎవళ్ళ పనులు వాళ్ళు చేసుకోవాల.

ఉప : ఓహో, భగవద్గీత కూడ తెలుసే ! శ్లోకంలో ఒక పాదమే తెలుసు కున్నారు. ఇంకా మూడు పాదాలున్నై - అవి చెప్పరేం ? అంతా మనం చెయ్యడం, దేవుడి మీదకు తోసెయ్యడం !

కుబే : ఓరి, దేవుణ్ణే కాదంటున్నావే ? కులాలే పనికిరావంటున్నావే ? ఓరి ! నీ తలమీద లెక్కలబాంబు బ్రద్దలవ్వా ! పో, ఇక్కడ నుంచి పో ! పోతావా, పోవా ? (కొట్టడానికి సిద్ధపడతాడు)

ఉప : పోక యిక్కడ కూర్చుంటానా ? తొందరపడవద్దు, మనిషిని కనిపెట్టి మాట్లాడు – పరాయి బిడ్డని కొట్టడానికి నీకకధికారం లేదు – ఇష్టం లేకపోతే, పనిమానిపించెయ్యి, ఇప్పటికయినా సంఘమూ, మతమూ బోధిస్తున్న దుర్మార్గపు మూఢసూత్రాల నుంచి విముక్తి పొందు – యిది నా సలహా.

(నిష్క్రమిస్తాడు – కుబేరయ్య నోరు తెరచి చకితుడై చూస్తాడు. తెర)

## రంగం : 7

(ఇంకా బాగా తెల్లవారలేదు – చీకటి పోతూ, వెలుగు వస్తూ వుంది. చేలో బెడ్డ విరుపు పని సాగుతూ వుంది, గునపాలూ, తట్టలూ పుచ్చుకొని కూలీలు అటూ ఇటూ పోతూ వున్నారు – ఒకచోట సీతమ్మా, వీరేశూ పనిచేస్తున్నారు. సీతమ్మ గునపంతో బెడ్డ విరుస్తుంటే వీరేశు దానిని తీస్తూ తట్టలో వేస్తున్నాడు. శ్రమతెలియకుండా పాటలు పాడు కొంటున్నారు)

(పాట)

వీరే : వస్తావంటోలి పిల్లా ! నాతో
కొత్తకోరంగి దాకా !

సీత : ఇస్తాను గారోరి కుర్రా ! నన్ను
కొట్టకుండ వుంటావా !

వీరే : నల్ల నల్లని దానా, పిల్లా
నవ్వు మొగమ్ముదానా !
నవ్వులో పువ్వునౌతా – నే
పువ్వులో తేనేనౌతా – వా ?

సీత : నీతిగల జాతివాడా ! మంచి
చాతిగల కుర్రవాడా !

తియ్యని తేనెనైతే – నన్ను
తిని పారిపోవు గంద ?

(వస్తావంటోలి – కొట్టకుండ వుంటావా' అంతవరకూ మళ్ళీ మళ్ళీ పాడతారు.)

వీరే : సీతే ! నిజంగా నీవు నాకూడా వచ్చేత్తే, నీ మీద ఇలా (చెయ్యేసి) చెయ్యికూడా వెయ్యను.

సీత : (కంపరిల్లి, తప్పుకొని) ఇదిగో – నీవు మోటు సరసానికి దిగావంటే – మాట దక్కదబ్బాయ్ –

వీరే : ఇల్లాలు కూతురువి !

సీత : మరే మనుకొన్నావు ?

వీరే : అందుకనే నీ మీద మోజు.

సీత : మోజుంటే ఏమి లాభం ? దేవుడు కూడా నా మీద చెయ్యి వెయ్యడానికి వీల్లేదు.

వీరే : మరి తీరా వేసేశాను చెయ్యి !

సీత : తప్పు దిద్దుకో !

వీరే : తప్పుదిద్దుకునే చాన్సు వుంటే చాలు. ఎన్నిసార్లయినా దిద్దుకుంటా – (మీద మళ్ళీ చెయ్యేసి తీసేసి) మొదటి తప్పు దిద్దుకున్నా, రెండో తప్పుకూడా దిద్దుకోనా ? (మళ్ళీ చెయ్యివేయబోతాడు)

సీత : ఇక నీ సరసని పనిచేత్తే – (కోపంతో వెళ్ళిపోబోతూంది)

వీరే : (వారిస్తూ) వట్టేసుకోవద్దు, నా మీ దొట్టు.

సీత : నిన్ను చూస్తుంటే, వళ్ళు మండిపోతుంది.

వీరే : అందుకే నిప్పుకోసం నీ అండకు చేరాను.

సీత : చాల్లేద్దూ.

వీరే : పోనీలేద్దూ. (బెల్లులతో నిండిన తట్టను చూపుతూ ) ఊఁ - ఎత్తు ?

సీత : ఇంత మొగాడివి , ఎత్తుకోలేవా ?

వీరే : కాని నువ్వుకూడా కలిస్తేనే సరదా !

సీత : కొరకరాని కొయ్యవు, పట్టు (ఎత్తుతుంది)

వీరే : ఎత్తు - ఇంకా, ఇంకా -

(ఇద్దరికీ నవ్వు వస్తుంది, వీరేశు తట్ట జారవిడుస్తాడు, ఇద్దరూ కిల కిలా నవ్వుతారు. అంతలో కుబేరయ్య ప్రవేశిస్తాడు)

కుబే : ఏమిట్రా, ఆ కిలకిల్లు ? ఓరి దున్నపోతా ! ఆ పిల్ల నేమి చేస్తు న్నావురా! ఓ యిబాసారి గాడిదకొడకా ! ఇందుకా ఒంటరిగా నువ్వు దీన్ని తీసుకొస్తా ? ఏమే సీతే ?

వీరే : (భయపడుతూ) ఆమె తప్పేమీ లేదండి బాబు! నా తప్పుకూడా లేదుగానిండి....

కుబే : ముయ్యరా నోరు ! ఆడదానితో సరస మాడవచ్చునట్రా, కుర్రతొత్తు కొడక -

వీరే : చిత్తం - చిత్తం -

కుబే : పోరా ! నువ్వుపోయి బండి కట్టుకురా -

వీరే : చిత్తం - (వెళ్ళిపోతాడు అనుమానంగా చూస్తూ)

కుబే : సీతే ! నీకు మొగుడుకావా లేంటే ?

సీత : ఏం మాట్లండి అవి ?

కుబే : అమ్మ నంగనాచీ !

సీత : నే వెళ్ళిపోతున్నానండి - (వెళ్ళబోతుంది)

కుబే : ఉండవే - ఈ చీకట్ని ఇంత పెందలకడే లేచి వస్త నీకోసమేగా ? (చెయ్యి పట్టుకుంటాడు)

సీత : (గింజుకుని) నే నంత లోకువగా కనిపిస్తున్నానా ?

కుబే : అబ్బే, మోజుగా కనిపిస్తున్నావు -

సీత : మీరు కామందులు, పెద్దలు, మీ కిది తగదు ! నన్ను విడిచి పెట్టండి.

కుబే : తగట మేమిటి ? తగకపోవట మేమిటి ? నీకూ నాకూ ఏమిటి ? నువ్వు పాలేరు దానవు, నేను కామందును, నేను చెప్పింది నువ్వు చెయ్యాలి.

సీత : చేస్తున్నాగా !

కుబే : మరింక అడ్డమేమిటి ? (మీదికివెళ్ళి మళ్ళీ చెయ్యిపట్టుకోబోతాడు)

సీత : (తప్పించుకొని) ఛీ, వొదలండి - ఈ రోజు మొదలు మీ పనిలోకి రాను.

కుబే : ఒక్కరోజు పనిలోకి రాకపోతే, పదిరోజులు సత్తావు వరసగా !

సీత : చస్తే చస్తాను - ఎప్పటికైనా తప్పదుగా ?

కుబే : కొంచెం వినవే, నీ కాళ్ళకు మొక్కుతాను.

సీత : మీ గౌరవం కాపాడుకోండి.

కుబే : (కోపంతో) అడిగేకొద్దీ అలా ఆకాశం మీదికి పోతావేం ? చూడు - నీకు అడ్డ మెవడొత్తాడో (మీదపడి పట్టుకుంటాడు. తెరలో 'బాబోయ్ బాబోయ్' అని కేకలు వినిసిస్తాయి. )

కుబే : (సీతమ్మను విడిచి ఉగ్రుడై) ఛీ ! ఎవడ్రా ఎదవ ? (తెరలో అయ్యబాబోయ్, కామందుగారుండోయ్)

కుబే : నిన్ను చిత్రవధ చెయ్యా ! ఏం పోయేకాలంరా నీకు ?

పుల్ల : (ఏడుస్తూ ప్రవేశిస్తూ) అయ్యబాబోయ్, బాబయ్యగారుండోయ్ !

కుబే : ఓరి శనిగా ! ఏడవరా ఏంటో ?

పుల్ల : (గుండె బాదుకుంటూ) చచ్చిపోతున్నాడండి బాబూ !

కుబే : ఎవడ్రా ఆ చవట ! చచ్చేవాణ్ణి చావనివ్వక, ఇలా ఎందుకు తగలడ్డావురా, ముసలి గాడిదా ?

పుల్ల : మా ఎంకడి కండి బాబయ్యా !

కుబే : ఇంకా చచ్చాడా, లేదా ?

సీత : శివ శివా ! (చెవులు మూసుకొని) యెంకన్నబాబుకా (నిష్క్ర మిస్తుంది.)

పుల్ల : ఈపాటికి చచ్చిపోతా దేమోనండి బాబు ! మందేమన్నా......

కుబే : చచ్చేవాడికి మందేస్తేమాత్రం బ్రతుకుతా డంట్రా, చావనియ్యి, నీ శనే వదిలిపోద్ది.

పుల్ల : కన్న కడుపు బాబయ్య !

కుబే : కడుపు ! ఎవడి కడుపు వాడిదే, ఎవడి కడుపుకు వాడే చూచు కుంటాడు, ఒకడి కడుపుకు ఒకడు పెడతాడ్రా ?

పుల్ల : వొచ్చే పాణం, పోయే పాణం బాబయ్య !

కుబే : పోనివ్వోయ్, 'కొరగాని కొడుకు పుట్టిన తండ్రి గుణముల జెరచున్' అన్నారు గాంధీగారు - వంశాన్ని తగలబెట్టే కొడు కుంటేం, పోతేం? (పది రూపాయలనోటు గిరవాటేస్తూ) పట్టుకుపో.

పుల్ల : మందిప్పించా లండి, బాబయ్యా !

కుబే : ఓరి నిన్ను తగలెయ్యా ! జిగురుకండె లాగ పట్టుకున్నా వేమిరా - పానకంలో పుడకలా గొచ్చీ ? ... సరే .... పోయి సీతని పంపు, - పో -

పుల్ల : చిత్తం ! చిత్తం - తమరు పెభువులు .... ఆ బళ్ళో పంతులండి... ఏదో కేసెడతా డటండి, వొచ్చి చూశాడు కుర్రోణ్ణి.

కుబే : (ఉలిక్కిపడి) ఆరి నీ దుంపతెగా ! ఎందుకు రానిచ్చావురా వాణ్ణి? అయ్య గాడిదకొడకా ? ... అందుకేరా జబ్బు ఎక్కువై పోయింది. అందుకే, అయ్యయ్యో ! ఆ పంతులుగాణ్ని ఇంటికి రానియ్యకురా! నీ కొడుకుని బతకనియ్యడ్రా వాడు !

పుల్ల : తెలిసిందండి బాబయ్యా ! ఈసారి ఒత్తే తన్ని తంపటేత్తానండి. ఆడికి సిగ్గు లేదండి - రావొద్దంటే వత్తాడండి గాడిదకొడుకు !

కుబే : పంతుళ్ళంటే ఏమనుకున్నావురా ? వొట్టి దొంగలూ, యిబా సార్లూను- బ్రతకలేనివాళ్ళంతా బడిపంతుళ్ళుగా తయారయ్యి, వూళ్ళన్నీ తగలెడుతున్నార్రా - పుల్లా !

పుల్ల : చిత్తం బాబయ్యా ! చిత్తం -

కుబే : ఆ పంతులుగాడి మాట వినేవుసుమా ? వాడి మాటలూ, పాటలూ యెంకడి తలకెక్కి తినేస్తున్నైరా వాణ్ణి. జాగర్తా - చెడిపోతావు - ఇక పో - మందు ఇప్పిస్తాగాని, సీతిని పంపు -

పుల్ల : చిత్తం చిత్తం (నిష్క్రమిస్తాడు)

కుబే : ఎంతప్రమాద మొచ్చింది ! అన్నన్నా ! వెంకడు నేను కొట్టిన దెబ్బలవల్ల చచ్చిపోయాడని కేసెడతాడా ఆ పంతులు ! .... వాడంతటివాడే - డాక్టరు సక్కి పిక్కంటు అక్కర్లేదూ ? అదీ చేస్తాడు! ముందే నేను డాగుటేరుతో మాటాడితేనో ? అదే రైటు. జ్వరంవల్ల చచ్చినాడంటే తీరిపోద్ది ... పర్వాలేదు. నామీద కేమీ రాకుండా నేను చూసుకోగలను - పుల్లడు నా చేతిలో మనిషే - కాని ... ముందుంది పంతులు పని - వాడొకడు తెగ నీలుగు తున్నాడులే - వీడొచ్చినప్పటినుంచీ మా వూళ్ళో పాలేళ్ళకి కరువై పోయింది. కుర్రకుంక లంతా పెద్ద పెద్ద మాటలు మాట్లాడు తున్నారు. (పచార్లు చేస్తూ) సరే కానీ .....

## రంగం:8

(పొలానికి ఆనుకొని వున్న కూలీపేట - పుల్లయ్య గుడిసె - బైట ఒక కుక్కి మంచంలో వెంకన్న మూల్గుతూ పడి వున్నాడు - సీతమ్మ ఒక చిన్న గ్లాసులో మందు పెట్టుకుని పక్కనే నిలబడి వుంది. వెంకన్న మాట్లాడేటప్పుడు కష్టం మీద లేచి నిలబడుతూ, తూలి పడిపోతూ వుంటాడు - మందు త్రాగమని సీతమ్మ బ్రతిమాలుతూ వుంది.)

సీత : తాగు బాబు ! ఇదిగో మందు, తాగవూ ?

వెం : వద్దు పిన్ని ! నేను తాగను - 'నా' అనేవాళ్ళు లేని నా బతుకు ఎంత నిరర్థకం !

సీత : 'నా' అనేవా ళ్ళెందుకు లేరు నీకు ? కొండంత బాబుండగా !

వెం : బాబు ! బాబు... దేశాన్ని అవిద్యలోనూ, అజ్ఞానంలోనూ, దాస్యంలోనూ ముంచేస్తున్న ఇలాంటి వాళ్ళంతా బాబులేనా ?

సీత : పోనీ నే నున్నాగా ?

వెం : నీవా ? నీవు స్వతంత్రురాలవా ? స్వతంత్రం లేని వ్యక్తి తాను బతకడమే బరువు - ఇంకొకర్ని ఎలా బతికించగలదు ? ఇంత వరకూ నీవే నన్ను బతికించావు - ఇక బతికించలేవు.

సీత : నాకదేమీ తెలవదు - ముందు మందు తాగు, బాబు కదూ ?

వెం : నేను తాగను - నన్ను బలవంతం చెయ్యకు.

పుల్ల : (ప్రవేశించి) ఓరి తాగరా, పెంకి గాడిదకొడకా ! యమిలోడివి దాపరించావేరా మాకు ?

వెం : నాకు మందక్కరలేదు - నేను తాగను, నేను చచ్చిపోతాను.

పుల్ల : ఎవ ణ్ణుద్ధరింతావురా చచ్చీ ?

వెం : బానిసతనం కంటే చావు మేలు - నాలాంటి కుర్రవాళ్ళంతా హాయిగా చదువుకొని పైకి వస్తూవుంటే - నేను పాలేరునై పశువు లాగ బ్రతకలేను - నేను సుఖంగా చచ్చిపోతాను.

పుల్ల : కాదు, తాగరా !

వెం : నేను బతికితే బడికి పంపిస్తావా ?

పుల్ల : చదువు మన అనాయం కాదురా - ఐనా గడవని వాళ్ళం, ఒక పూట తింటే రెండో పూటకి గతిలేనోళ్ళం, కడజాతివాళ్ళం, కూలోళ్ళం ఎలాగరా చదవడం ?

వెం : మనకంటే దరిద్రులు, మనకంటే దీనకులాలవాళ్ళు, ఎందరు చదువుకొని పైకొస్తున్నారో చూస్తున్నావుగా ? ఉద్దేశాలు వుంటే ప్రయత్నాలు ఫలించి తీరుతాయట - కొడుకు ఉద్దేశాన్ని అనుసరించి అభివృద్ధి పర్చటం తండ్రి ధర్మం కాదా ? తనకంటే తన కొడుకు ఒక అడుగు ముందుకు పోవడంకాదా తండ్రి కోరవలసింది ? ... నన్ను బడికి పంపిస్తానంటే మందు త్రాగుతాను.

పుల్ల : (కోపంతో) చచ్చినా సరే నిన్ను బడికి పంపించను - (వెళ్ళి పోతాడు)

సీత : పిచ్చి పట్టువద్దు - తాగు నాయనా ! (మందు అందిస్తుంది,

వెం : (తోసేస్తూ) ఎవరిది పిచ్చిపట్టు ? ... వద్దు పిన్నీ ! వద్దు ! మాయమ్మ పోయిననాటి నుంచి నీవు నన్ను పెంచావు - నీ ఋణం ఇక నేను తీర్చుకోలేను - పంతులుగారు ఒక్కసారి వస్తే బాగుండును - (ఆలోచనలో పడతాడు)

సీత : (కళ్ళు తుడుచుకుంటూ) పోనీ - ఆ పంతులుగారి మాటైనా వింటాడేమో, తీసుకొస్తా (వెళుతుంది)

వెం : ఇంతటితో నా జీవితం సరి. నిన్న పత్రనూతిలో పడి చావటం బాల గురించి తప్పింది - ఈ వేళ ఇక తప్పదు - బాధలుపడుతూ అవమానాలు భరిస్తూ - ఏహ్య జీవితం గడిపేకంటే, హాయిగా ఆత్మహత్య చేసుకొని, కళ్ళుమూసేస్తే యెంత సుఖం ! నా తల్లి బ్రతికివుంటే నా కిన్ని కష్టాలు

రాకుండేవేమో ! (కళ్ళు తుడుచు కుంటూ) ఏమో ! అందరి తల్లుల్లాటిది కాదా నా తల్లి మాత్రం. మా బాబు నాలుగు తన్ని కూర్చోబెడితే ఏంజేస్తుంది... అయ్యో! ఇక యీ ప్రపంచంలో నేను కనబడను - ఆ దూడలు, ఆ చేలూ, ఆ ఆటలూ, ఆ గొబ్బిపూలు, ఆ బాల.... (వెక్కి వెక్కి ఏడుస్తాడు)

ఉప : (ప్రవేశించి) వెంకన్నా! (మీదచేయివేసి చూసి) స్వతంత్ర పోరాటం ఎంత కష్టమో తెలుస్తున్నదా ? (మందుగ్లాసు అందుకొని) దేశంలో నీలాంటి పట్టుదల కుర్రాళ్ళు ఒక్క పదిమంది వుంటే, ఎంత అభ్యుదయం చేకూరగలదు! ఇదిగో మందు తాగు.

వెం : క్షమించండి పంతులుగారూ ! నేను మందు తాగదలచుకోలేదు - నన్ను సుఖంగా చచ్చిపోనివ్వండి.

ఉప : చావా ? చచ్చిపోవడం ఒక ప్రయోజకత్వం అనుకొంటున్నావా ? ఆత్మహత్య పిరికితనం, పౌరుషహీనం.

బ్రతికి యుండియె మనిషి శుభమ్ములొంద
వలయు, చచ్చిన తరువాత బ్రతుకులేదు ;
బ్రతికి సాధింపవలెగాని వాంఛితములు,
చచ్చి సాధింతు ననుమాట చచ్చుమాట.

వెం : నేను చచ్చిపోయి ఈ కామందులకు కామందునై పుడతాను - ఈ కామందూ, మా బాబూ నాకు పాలేళ్ళయి పుడతారు. అప్పుడు నా పగ సాధించుకొంటాను.

ఉప : నీవు పాత అబద్ధాలెందుకు నమ్ముతావు ? పూర్వజన్మ - పునర్జన్మ సిద్ధాంతాలు తప్పు - పాటకపు జనాన్ని మోసగించడానికి పుట్టిన సిద్ధాంతాలవి, అసలు దేవుడున్నా డనేదే మూఢ విశ్వాసం, ఈ లోకంలో పుట్టిన ప్రతి జీవి

స్వాతిశయం స్థాపించుకుని, స్వయం పోషకమై బ్రతకాలి. స్వాతిశయం, స్వయంపోషకశక్తి బ్రతుక్కి మూలాధారాలు - అవిలేని జీవి బానిసతనంలో పడుతుంది - నీ ఆశయాలు ఫలించడానికి ముందు నీవు బ్రతకాలి.

వెం : బ్రతకడం చేతకాకనేగదా చచ్చిపోవడం !

ఉపం : ముందు మందు త్రాగు.

వెం : తాగుతాను చెప్పండి.

ఉప : నిన్ను నేను చదివిస్తాను - సరా ?

వెం : పరసహాయం నేను పొందను - అది నన్ను ఋణ గ్రస్తుణ్ణి చేస్తుంది.

ఉప : ఈ మెట్ట వేదాంతం యెక్కడిదోయ్ నీకు ? మీ కామందు చెప్పాడా? మీ బాబు చెప్పాడా ? .... పోనీ ఇదివరలో నీ ఋణగ్రస్తులే ఇప్పుడు నీకు సహాయం చేస్తున్నారేమో ?

వెం : అదీ కావచ్చు.

ఉప : పిచ్చి కుదిరింది తలకు రోకలి చుట్ట మనక, మందు త్రాగు, సహాయం వచ్చిన చోటల్లా పొంది, చదువుకో! అదృష్టం వుంటే పైకొస్తావు - అప్పుడు పునస్సహాయం చేస్తావు -

వెం : సహాయం---- పునస్సహాయం....

ఉప : (నాడి చూచి) జ్వరం తీవ్రంగా వుందే ! పలవరిస్తున్నాడు ! డాక్టర్ని పిలవాలి - (త్వరితంగా నిష్క్రమిస్తాడు)

వెం : సహాయం---- పునస్సహాయం....

(అంత బాల ప్రవేశించి, శరీరం తాకిచూచి - తడిపిన మల్లెపూల దండ అతని నొసటిపై పెడుతుంది. కొంచెం సేపటికి వెంకన్న ఉలిక్కిపడి లేస్తాడు... పంతులుగారూ ! అంటూ.... )

బాల : వెంకన్నా !

వెం : (ఉలిక్కిపడి చూచి) బాలా ! (ఏడుస్తాడు)

బాల : ఏం వెంకన్నా ? ఏడుస్తావెందుకు ? ఇదిగో మందు త్రాగు !

వెం : బాలా ! క్షమించవు ?

బాల : ఎందుకు ? ఏం తప్పుచేశావని ?

వెం : నేను పుట్టడమే ఒక తప్పు. బ్రతకడం రెండో తప్పు.

బాల : అస్వతంత్రులు అందరికీ అంతే.

వెం : నీవు యిచ్చిన అరటిపళ్ళు వెంటనే తినేస్తే, ఈ దెబ్బల్లో సగం దెబ్బలు తప్పును - పట్టుదలే చూచుకున్నానుగాని, ప్రేమ చూచు కోలేదు.

బాల : ముందు మందు త్రాగు (అందిస్తుంది)

వెం : తాగను, నీవు క్షమించానంటే ఆ మాటలు వింటూ ప్రాణం వొదిలేస్తాను.

బాల : నే క్షమించను.

వెం : అయ్యో ! క్షమించవు ? క్షమించవు ? బాలా ! బాలా ! అయ్యో ! క్షమించవు ?

బాల : చదివిస్తా నంటే మందు త్రాగుతా నన్నావటగా మీ బాబుతో ?

వెం : అదంతా ఇప్పుడెందుకు ?

బాల : ఆ పని అతడేమి చేయగలడు ? నేను చేస్తాను - మందు త్రాగు!

వెం : నీవు చిన్నపిల్లవు -

బాల : నీవు మహా పెద్దవాడివా ?

వెం : నీ వల్ల ఒక్క ఉపకారం కోరుతున్నాను.

బాల : ఉపకారం చెయ్యడానికే నేనూ వచ్చాను - మా అన్నయ్య కాకినాడలో చదువుతున్నాడు - ఎరుగుదువుగా ?

వెం : అది కాదు !

బాల : మరేమిటి ?

వెం : నీ విప్పుడు నన్ను చూడ్డానికి వస్తా వనుకోలేదు.

బాల : నీ వైతే రాకపోదువు.

వెం : నిజమే ! ఉద్దేశం లేక కాదు. సాహసం లేక – నీవు శ్రీమంతురాలవు – సాహసంచేసి, స్వతంత్రంగా మెలగగలవు – నేను పాలేర్ని – స్వతంత్రం లేదు – సాహసం చెయ్యలేను – చేసి నిలుపుకోలేను – అందుకే నీ కోరిక సఫలమౌతుంది – నీ జీవితం వికసిస్తుంది – నా కోరిక నాలోనే తుప్పుపట్టి నశించిపోతుంది....

బాల : కోరిక ఉండటమే ముఖ్యం. ఈనాడు కాకపోతే రేపైనా సఫలమౌతుంది – నీ క్కావలసిన ఉపకారం ఏమిటి?

వెం : మొన్న నువ్వు పాడిన పాట – ఒక్కసారి పాడు – ఆ లయబ్రహ్మలో ప్రశాంతంగా లయమైపోతాను.

బాల : బ్రహ్మంగారి తత్వాలు బాగానే బుర్ర కెక్కాయి ! మరి పాడినందుకు నాకు బహుమతి ?

వెం : ఈ గర్భదరిద్రుడు యీ యగలిగిం దేదైనా సరే ?

బాల : ముందే యియ్యాలి .

వెం : సరే.

బాల : ఈ మందు త్రాగు.

వెం : చచ్చి పోవద్దా ?

బాల : నీవు బ్రతకాలి.

వెం : బానిసగానా ?

బాల : స్వతంత్రుడిగా.

వెం : ఎలాగా ?

బాల : నేను చెపుతానుగా.

వెం : ఏమో, నా కర్థంకావటం లేదు.

బాల : మహా మహా వాళ్ళకే అర్థంకాని వెన్నో ఉన్నాయి – అంత మొండితనం పనికిరాదు – ఇదిగో మందు –

వెం : (అందుకుని) ఈ ప్రాణం నీ భిక్షం (త్రాగుతాడు)

బాల : (పాట)

ప్రేమ మనరా – ప్రేమ గనరా
ప్రేమే జీవిక – మౌరా

ప్రేమము నిచ్చీ – గైకొనువాడే
పృధ్విని ధన్యుడురా !

మనుజుల అభివృద్ధికి – తోడ్పడనీ
మనుగడ యేలనురా !

బ్రతికియుండియును ఏలా చచ్చిన
గతి బడి యుందువురా ?

నిరాశ యేలా ? యువకుడ , నీకు

జరామరణములు లేవురా !

రేయి గడిచి వచ్చెడి రవి రీతి !

మాయాజాలము ఖండించుమురా !

(పాడుతుండగా తెర జారుతుంది.)

## రంగం:9

(సాయం సమయం, బెల్లు విరుపు పని కొనసాగుతూ వున్న పొలం, వీరేశూ, సీతమ్మా, మరికొందరు కూలీలూ పనిచేస్తూవున్నారు. వీరేశు పాట పాడుతుండగా, తక్కిన కూలీలు వంత పాడుతూ వున్నారు.)

వీరే : (పాట) ఎండలో వానలో కూలోడా !

అందరు : బండచాకిరి చేసి కూలోడా !

వీరే : .... .... .... ...

అంద : .... .... .... .... .... ...

వీరే : పండించి పెడతావు కూలోడా !

తిండి నీ కేదిరా కూలోడా !

అంద : పండించి .... .... .... ...

వీరే : నీ శక్తికి నీ బ్రతుకు కూలోడా !

అంద : నేల కర్పిస్తావు కూలోడా !

వీరే : .... .... .... ...

అంద : .... .... .... ...

వీరే : పోరాడగల్గితే కూలోడా !

ఈ రాజ్యమే నీది కూలోడా !

అంద : .... .... .... ...

మొదలి కూలీ : రాయే సీతమ్మ ! పట్టు (తట్టచూపుతూ)

వీరే : అంత బరువు తట్ట దానిచేత పట్టించకురా !

రెండవ కూలీ : ఏంట్రో వీరే శంటాడు ?

మొ.కూ : అంతా వుందిలేరా !

వీరే : ఏం వుందిరా నీ తలకాయ ?

సీత : కాదు, మొట్టికాయ (ఆ కూలీని మొట్టుతుంది)

మొ. కూ : అమ్మ సీతమ్మతల్లో ! (తల గోక్కుంటాడు)

రెం. కూ : నీ నీ కెందుకమ్మ అంత వులుకు ?

వీరే : నీ బులుపు కూడా వదలా లేంట్రా ?

సీత : వీళ్ళతో నేను పనిచెయ్యలేను బాబు (వెళ్ళబోతుంది)

వీరే : (చేతితో ఆపి) వీళ్ళిద్దర్ని మెళ్ళిరగతొక్కేత్తా – చూడు !

మొ.కూ : ఇంకేం అనములేరా బాబూ !

రెం.కూ : మీ కిద్దరికీ పెళ్లని తెలిసిందిరా !

వీరే : ముందు మీ కిద్దరికీ అవుద్ది.

మొ.కూ : కామందుగారు ఇంకా రాలేదు నయమే.

రెం.కూ : వత్తే, మనందరికి అవుతాయి పెళ్లిళ్ళు.

వీరే : (అటు చూచి) కామందుగారు ! కామందు గారు !

అంద : (ఉలిక్కిపడి) దండాలండి బాబుగారు !

వీరే : (విరగబడి నవ్వుతాడు – అంత మెల్లిగా ప్రవేశం, ఊతకర్రతో వెంకన్న.)

అంద : (చూచి) ఓరి యెంకట్రా !

వీరే : కుంటి కామందుగారు !

సీత : ఇలా వచ్చావేం పడుకోక !

వెం : బాబు వెళ్ళమని చంపుకు తింటేనే !

వీరే : పాలేరుతనం చెయ్యరు దొరగారు ! గట్టుమీద కూర్చోండి.

సీత : ఎందుకా వేళాకోళం ?

వీరే : అబ్బే డబ్బులేను దొరగా రిన.

మొ.కూ : కూర్చోరా యెంకన్నా ! నిలబడలేవు.

వీరే : గొడుగేసుకో !

రెం.కూ : వాణ్ణి అలా ఆక్షేపించకురా ! పాలేరుతనం వద్దంటే - నిజమే ! రోజూ మనం తిట్లూ, దెబ్బలూ తప్పితే ఏం బావుకుంటున్నాం పాలేరు తనంలో ?

వీరే : చదువులో కెళితే మాత్రం తిట్లూ, తన్నులూ, ఇంకా గోడ కుర్చీలు, కోదండాలు తప్పుతాయా ?

మొ.కూ : గోడకుర్చీలు వేసినవాళ్ళే కుర్చీలమీద కూర్చోడం, కోదండాలు వేసినవాళ్ళే దండాలు పెట్టించుకోడం.

రెం.కూ : వెళ్ళి పడుకోరా, నిలబడలేవు.

మొ.కూ : మనిషి పనికిరాకుండా కొట్టి పారేశార్రా, ఇంతలో కోలుకుంటాడని అనుకోలేదు.

వీరే : ఏడిశారు పోంర్రా ! రారా యెంకన్నా ! పడుచోడ్కి నీర్సమేంర్రా? ఇదిగో గునపం ! (పుల్లయ్య ప్రవేశం)

పుల్ల : పత్రా తట్ట ! అలా నిలబడతావేం మొద్దులాగ ?

వెం : (భోరున ఏడుస్తాడు)

సీత : చాల్లే, చాలని ! రా బాబూ , గంజి తాగుదువుగాని (వెంకన్నను తీసుకుపోతుంది)

పుల్ల : ఈ కుఠ్రముండే యీణ్ని చెరిపేత్తుంది - (వెనకాల దురుసుగా పోతాడు)

మొ.కూ : వాళ్ళని చావదన్నే లాగున్నాడ్రా !

వీరే : వాళ్ళ వొంటిమీద ఒక్క దెబ్బపడితే, పుల్లడి నడుం పెళ్ళునవిరిగి పోద్ది - (దురుసుగా వెళతాడు - వెనుక కూలీలిద్దరూ వెళతారు - అంత వెనుక నుంచి ఉపకారి ప్రవేశిస్తాడు)

ఉప : (ముందుకు పరికించి చూచి) ఓహో ! వీళ్ళు వెంకన్నను బ్రతక నిచ్చేలా లేరు. ఇక అతణ్ని ఈ వూళ్ళోవుంచి లాభంలేదు. కాకినాడ అనాధశరణాలయానికి పంపించెయ్యడమే మంచిది. అధోగతి నుంచి ఒక జీవి ఉద్ధరింపబడినా ఉద్ధరణమే - ఓహో యెంతలో చీకటి పడింది.

గీ॥ అంధకారము నుండి యీ యవని నొకని
ఉద్ధరించుట కొరకు, సూర్యుండు తానె
అంధకారములో మన్గి యరిగె నొక !
సదయు లగువారి త్యాగమే గద చరిత్ర !

## రంగం:10

(పుల్లయ్య గుడిసె ప్రాంతం - రాత్రివేళ - సమీపంలో కుబేరయ్య తచ్చాడుతూ వున్నాడు - ఏదో దురుద్దేశం అతడి ముఖంలో కనిపిస్తూ వుంది.)

కుబే : ప్రొద్దుగూకి యెంతోసేపు కాలేదు ! అప్పుడే యెంత చీకటి పడ్డది! ఇది నా కార్యసాధనకి శుభసూచన - సీతిని యెలాగైనా వల్లో వేసుకోవాలీ వేళ - అమ్మ ! ఆడదాని లోతు కనిపెట్టలేము - కామందుని నన్ను నిరాకరించింది. ఆ వీరిగాడికి చనువిచ్చింది - దీనిపని యీ వేళ చెపుతాను - ఆఁ ! (ఆలకించి) ఎవరా పాట ! (పరికించి చూస్తాడు)

(తెరలో పాట)

హృదయము కొనగలవా, మూఢా
ఏ మాత్రము నీ ధనము ?
స్వేచ్ఛా జీవిని బంధించెదవా ?
శృంఖల బల మేపాటి ?

నీ సదయత్వము, నీ సౌహార్థము
నీ ప్రేమామృత మాధురిమా,
లెక్కకు వచ్చే శక్తులురా !
తక్కిన దంతా చెత్తేరా !

కుబే : (తొంగిచూచి) అమ్మ ! యెంకడే ! అదిగో ! అలా పోతున్నాడు ! అరే ! ఇలాగే వస్తున్నాడే - (ఒరుగుతూ) కాదు, అలా తిరిగాడు.... .... యెక్కడికో ప్రయాణమై పోతున్నాడే ! ఏ కొంపైనా దొయ్యటానికి కాదుగద! అలాంటివాడు కాదుగాని.... యేమో.... వినాశ కాలానికి విపరీత బుద్ధులు.... ... యెక్కడికో చస్తాడు, చావనీ, నాకూ మంచిదే...... ఇక .... ముందు పుల్లణ్ణి లేపి పొలం పంపేస్తాను. ఆఁ ! నా కుడికన్ను అదరడం లేదే ! (కదిపి చూసుకుంటాడు) పుల్లిగా (కేకేస్తాడు.) (లోపలినుంచి) ఎవడెసే వాడు, నిద్ర సెడగొడతాడు ?

కుబే : కళ్ళుతెరిచి మాట్లాడ్రా, గాడిద కొడకా ...

పుల్ల : (ప్రవేశిస్తూ) ఎవడ్రాడూ ? (కళ్ళునులుముకుని చూచి) దండాలు బాబయ్యా! గులాపోణ్ణి బాబయ్యా ! నిద్రమత్తు బాబయ్యా !

కుబే : ఓరి దున్నపోతా ! నీ పని ఇలా కాదు. నువ్వుపోయి, కొబ్బరిరాశి దగ్గర పడుకో, ఏదో అల్లరిగా వుంది చూడు.

పుల్ల : చిత్తం చిత్తం - కానీ.... కాలూ, చెయ్యీ లాగుతున్నాయండి బాబయ్యా! ఆముదం రాసుకుని కుంపటెట్టుకుని కాచుకుంటున్నా నండి -

కుబే : ఎండాకాలంలో కుంపటేంట్రా, వెళ్ళు ! కావలిస్తే కుంపటికూడా పట్టుకెళ్ళు-

పుల్ల : చిత్తం - సీతీ ! ఆ కుంపటి, చుట్టా, కర్రా ఇలా ఇయ్యి -

సీత : (అవన్నీ తెచ్చి యిస్తుంది)

పుల్ల : తలుపేసుకో (పోతూ) తలుపేసుకో ! (నిష్క్రమిస్తాడు)

కుబే : సీతీ ! కాస్త అగ్గి నిప్పు అందుకో.

సీత : కుంపటి తీసుకుపోయాడు కదండి , మా బావ ? ఈ దీపాన్ని కాల్చుకోండి- (దీపం తెస్తుంది)

కుబే : భలే ! దీపం ఇంకా వెలుగుతోందే ? ఎక్కడ సంపాదించావే కిర్సనాలు!

సీత : మా యెంకన్నబాబు కనపడలేదని ఇప్పుడే వెలిగించానండి. మీ వంటోరికిగాని మా కెలా దొరుకుద్దండీ కిరసనాలు ?

కుబే : ఆఁ ! మీ యింట్లో ఎంత కిరసనాయిలు చూపను ?

సీత : చూపండి, ఒక్కచుక్కయినా ?

కుబే : రా చూపుతాను (చెయ్యిపట్టుకొని లాక్కెళ్ళబోతాడు)

సీత : (గింజేసి) మీద చెయ్యివేస్తే మాటదక్కదండి. గొప్పయింటోరికి నీచపుబుద్ధులు కూడవు.

కుబే : గొప్పింటోరైతే పిల్లల్ని కనుక్కోరా యేంటే ? అయ్యో యెర్రి మొగమా!

సీత : పెద్దరికం నిలుపకోండి. ఇక పోండి.

కుబే : పోవడానికేనా వస్త ? ఎన్నాళ్ళనుంచో అనుకొంటున్నాను - నీకు చీరా, రైకా ఇవ్వాలని, రేపు మా షాపులోకిరా - నీకు నచ్చిన బట్టలు తీసుకుందువుగాని.

ీత : నాకున్నవి చాల్లెండి.

కుబే : పోనీ - ఇదిగో ఈ పది రూపాయలు తీసుకో.

సీత : నేను బోగందాన్ని కాను. ఈపాటికి దయ సెయ్యండి.

కుబే : బలవంతం చెయ్యించుకుంటావ్ !

సీత : మీతరం కాదు..... మీరు కామందులు, నా మర్యాద కాపాడండి.

కుబే : దిబ్బ మర్యాద, ఆ యీరిగాడితో......

సీత : ఊc ! ఈరిగాడితో ? ఏcటి ? సరసమా ? సరసాని కే మొచ్చింది? మీరూ ఆడారుగా ఇప్పటిదాకా ?

కుబే : నేను కామందుని, కామందంటే సగం మొగుడు.

సీత : ఒడబడ్డోళ్ళకి పూర్తిగా మొగుడే.

కుబే : నా కమతంలో అడుగు పెట్టనివ్వను.

సీత : అడుక్కుతింటాం.

కుబే : మా కొట్లో సరుకు అమ్మం.

సీత : మాడి చస్తాం.

కుబే : నా బలం నీకు తెలవదు.

సీత : ఎందుకు తెలవదు ? ఈ చుట్టు పక్కల రౌడీలు అందరూ మీ బామ్మర్ధులేగా ?

కుబే : చూచుకో మరి (దగ్గరికి వెళతాడు)

సీత : ఒక్క అడుగు కదపలేదు.

కుబే : ఆc ! (నడుం బిగించి) కోడి రామ్మూర్తిని కూడా అమాంతంగా ఆమడదూరం

గిరవాటెయ్యగలను. నా మజా నీకేమి తెలుసు ? నీ యప్ప నా చేతిలోనే చచ్చిపోయింది, తెలుసా ? (మీసం దువ్వి) చూచుకోమరి (మీదపడతాడు - సీతమ్మ గింజేస్తుంది. కుబే(రావు వెల్లకిల పడతాడు - అంతలో వీరేశు (ప్రవేశించి కర్రెత్తుతాడు. కుబే(రావు భయకంపితుడై పారిపోతాడు.)

వీరే : (రోషంతో) గాడిద కొడుకు ! వీడా కామందు ? తనను ఆ(శయించుకుని (బతికేవాళ్ళనే దోచుకునే దొంగ ! ఇందుకే ఈ దేశం యిలా ఏడుత్తోంది. ఛీ ! పాలేరుగా (బతికేకంటే, ఛత్తే నయం. మా యెంకడు యిందుకే పాలేరుగా బతక నంటాడు. వాడే రైటైన మనిషి.

సీత : ఇప్పు డెలా గొచ్చావూ ?

వీరే : నేనా ? నీ వరసంతా చూత్తూనే వున్నాను.

సీత : ఆс ! నా వరస ?

వీరే : కాదులే, నీ కామందు వరస ?

సీత : ఇక ఈ ఊళ్ళో ఉండలేను.

వీరే : ఎక్కడికైనా లేచిపోదాము.

సీత : నువ్వుకూడా ఎందుకు ?

వీరే : ఆడమనిషితోకూడా మగోడు ఎందుకొత్తాడూ ?

సీత : తన్నులు తినడానికి !

వీరే : అహ్హాహ్హా! (నవ్వి) నేను కుబేరయ్యను కాను.

సీత : అలానే వుంది నీ వరస.

వీరే : నే నంత నీచుణ్ణికాను.

సీత : ఆc !

వీరే : ఇన్నాళ్ళూ నాకు చనువెందు కిచ్చావు !

సీత : తప్పా ?

వీరే : తప్పే, మగోడికి ఆడది చనువిత్తే......

సీత : నువ్వుకూడానా ?

వీరే : ఆc ! సొభావం అంతటా ఒక్కటే కాని, నా కంతటితో తృప్తి లేదు.

సీత : ఇంకా ?

వీరే : ఇంకా ఏమిటి ? నీవు మొత్తానికి కావాలి. నిన్ను పెళ్ళాడతాను.

సీత : చాలించు, ఇక నడు, బెడ్డపన్లోకి.

వీరే : ఒకమాట విను – మనమిద్దరమూ పేదోళ్ళమే, పని చేసుకొని బతకగలం, పట్టమెల్లిపోయామంటే, రెండురూపాయల్లో మనం పెళ్ళాడొచ్చు – చిలకా గోరింకల్లాగ బతకొచ్చు, ఆలోచించు, ఈ కామందు ఇక మనల్ని బతకనియ్యడు – ఎలాగో ఒకలాగ పగసాధిత్తాడు – ఈ రాత్రే పోతే మంచిది.

సీత : నిజంగానేనా ? నన్ను అన్నాయం చెయ్యవుగంద ?

వీరే : (చేతిలో చేయివేసి) పచ్చని చెట్టుకింద నిలబడ్డాం – ఈ చెట్టు సాక్షం – ఆ చుక్కలు సాక్ష్యం, నిన్ను లక్ష్మి లాగ చూచు కుంటాను, రా, పోదాం, తెల్లారేటప్పటికి ఈ చుట్టుపక్కల కనిపించగూడదు.

సీత : (అతని చేతుల్లోకి పోతుంది. ముందుకు సాగుతారు.)

వీరే : (పాట)

పట్టమెల్లిపోదామె నా బుల్లి సీతి ! మనం

పెళ్ళి చేసుకుందామె నా చిట్టి సీతి

సీత : పట్టమెల్లిపోదాము,

పెళ్ళిచేసుకుందాము,

పనిచేసుకోనీ బం

గారంలా బతుకుదాము.

వీరే : వొంటినిండ నగలెడతా , బంగారుబొమ్మా నీ

కంటినిండ కనబడతా, పువ్వులగొమ్మా,

సీత : భయమూ, బెంగలేక

బాధా, బందిలేక

రేపటి మాటలేక

వీరే : ప్రేమతో వుందాము....

స్వేచ్ఛగా వోదామె, పువ్వుల బోణీ ! మనం

చిలకల్లాగుందామే, నవ్వులరాణీ !

(నెమ్మదిగా చీకట్లో కలిసిపోతారు)

## రంగం:11

(ఉదయం పూట – కుబేరయ్యగారి ఇంటి వాకిలి – పుల్లయ్య గుండె బాదుకొంటూ గోలపెడుతూ ప్రవేశించాడు, క్రుంగిపోయి ఉన్నాడు.)

పుల్ల : అయ్య కొడుకో ! ఏమైపోయావురా , నిన్ను పాతెయ్య ? పుట్టినప్పు డైనా చచ్చిపోయావు గాదేమిరా, నిన్ను నూకాలమ్మ మింగెయ్య ? ఎక్కడ వెదకను ? ఎక్కడ చావను ? ఎక్కడ దిగమారిపోను ?

కుబే : (ప్రవేశించి) ఓరి బడవా ! ఏమిటిరా ఆ గోల ?

పుల్ల : (ఏడుస్తూ) ఎంకడండి బాబయ్య !

కుబే : ఎక్కడ చచ్చాడు ? తగలెయ్యి తీసికెళ్ళి .

పుల్ల : ఎక్కడికో పోయాడండి రాత్రి –

కుబే : ఆc ! ఆc ! పోలీసులకు రిపోర్టు ఇయ్యి – ఏమైనా తీసుకు పోయాడా?

పుల్ల : ఏముందండి తీసుకుపోడానికి ? ముంతా, మూకుడూ ? ఏముందండి బాబయ్యా ! ఓరి దొంగ గాడిద కొడకా ఏమై పోయావురా....

కుబే : వాడి సంగతి నేను చూస్తాను – మీ సీతి నొకసారి పంపు, దొడ్డి తుడవాలి.

పుల్ల : నే తుడుత్తానండి బాబయ్య !

కుబే : ఓరి దొంగతొత్తుకొడకా ! పోయి పంపరా !

పుల్ల : సీతీ కనబడ్డంలేదండి !

కుబే : ఆc ! ఏమిటీ ! స్టేషన్‌లో చెప్పు – ఎంకడే దాన్ని తీసుకుపోయాడని రిపోర్టు ఇయ్యి ! పో, పద, నేను కూడా వస్తా – (ఇటూ అటూ కలయ తిరుగుతాడు)

పుల్ల : వొద్దు బాబయ్యా ! పోతే పొయ్యారు లెండి.

కుబే : ఓరి దున్నపోతా (పుల్లయ్యను తన్ని) పోరా, నువ్వూ వాళ్ళూ వొకటే, పో, ఇక నా కంటికి కనపడకు – నా కమతంలో అడుగుపెట్టకు – నీ బాబుల్లాంటోళ్లని పెట్టుకుంటాను. నీ దిక్కున్న కాడికి పో, పోరా, (వెనక్కిచూచి) ఒరే దొంగ రామన్నా !

దొంగ : (ప్రవేశించి) చిత్తం దొరా !

కుబే : ఈణ్ణి తన్ని అవతలికి ఈడ్చెయ్ !

దొం : (పుల్లయ్యను తన్ని ఈడుస్తాడు)

కుబే : నువ్వు పోయి వీడి ఇల్లు పీకేసి పోయిలో పారెయ్...

పుల్ల : ఇన్నాళ్ళు తమ కమతంలో బతికాను. కాని, ఒక్క గడ్డిపరక అన్యాయంగా మీది తినలేదు – నా రెక్కల చెమటతో మీ పొలా లన్నీ తడిపాను – ఆ కొబ్బరి తొటలన్నీ నేను నెత్తురోడ్చి పెంచి నయ్యే – తమర్ని పది రూపాయల మనిషిని పది లక్షల మనిషిగా చేసింది నేనే బాబయ్యా ! నే నెక్కడున్నా అడుక్కు తింటానుగాని, ఈ సంగతులు మాత్రం మరచిపోకండి.

కుబే : ఏడ్చావు, పోరా ! ఫో –

(దొంగరామన్న పుల్లయ్యను ఈడ్చుకుపోతాడు)

కుబే : ఒరేయ్ !

దొం : (మళ్ళీ ప్రవేశించి) చిత్తం !

కుబే : యెంకడి జాడ తెలుసుకుని, ఆణ్ణి చావదన్నాలరా ! ఆ పని నువ్వే చెయ్యగలవు.

దొం : ఇన్నాళ్ళు తమ కందాలో వున్నాను. ఆ మాత్రం పని చెయ్యలేనాండి బాబు!

కుబే : అయితే, చూడు... సరే ..... పోయిరా.

దొం : చిత్తం. చిటికెలో చేసుకొత్తానండి. (వెళతాడు)

కుబే : ఒరేయ్ !

దొం : (ప్రవేశించి) చిత్తం.

కుబే : యెంకడితో కూడా సీతి ఉంటుందిరా , దాన్ని లాక్కురావాలి.

దొం : చిత్తం, బరబరా లక్కొచ్చేత్తానండి. (పోతాడు)

కుబే : ఒరేయ్ !

దొం : (ప్రవేశించి) అబ్బబ్బా ! చిత్తం.

కుబే : బరబరా లాక్కురావడం కాదురా ! దాని వొంటిమీద చెయ్యి వెయ్యకూడదు.

దొం : (తికమకగా) మరెలాగండి ? చిత్తం. అలాగేనండి – (పోతాడు)

కుబే : అది యెంకడితో కాదు... వీరిగాడితో లేచిపోయిందేమో ! ఒరేయ్! ఒరేయ్! ఒరేయ్ (బిగ్గరగా పిల్చి విసుక్కుని) ఛీ ! తలకాయల్లేని గాడిదలు !

## రంగం:12

(సమయం మధ్యాహ్నం. ఒక బాట. ఆ ప్రక్క ఒక తోట. బాటసారి వెంకన్న ప్రయాణం బడలికతో అటుకేసి వచ్చాడు. అతడి పై మీది తుండుగుడ్డకు ఒక చిన్న మూట మాత్రం వుంది. దిక్కులు చూస్తూ నడుస్తున్నాడు.)

వెం : (దిక్కులు చూస్తూ) ఆహా !

గీ॥ పైని ఆకాశమున కంతు కానబడదు.
నిల్చుటకు నీడయును లేదు నేలమీద,
రెక్కలాధారముగ ప్రచరించుచుంటి,
ఆశ్రయములేని బ్రతుకయ్యె నయ్య దేవ !

కలిగిన దానితో తృప్తిపడేవాడే ధన్యుడేమో ! ఎంతమంది పాలేళ్ళు తృప్తిగా బ్రతకటంలేదు. ఇప్పుడు నాకీ బాధలన్నీ ఎందుకు? బాధ అసంతృప్తి లక్షణం.... సంతృప్తి అభివృద్ధి లక్షణం కాదు. గంజికూటితో తృప్తిపడేవాడికి గంజికూటికంటే అధికం లభించదు. బానిసతనంలో తృప్తిపడేవాడు ఎప్పుడూ బానిసగానే ఉండి పోతాడు.....

ఈ దారి తరగడంలేదు, ఈ పేద బాటసారిమీద ఈ సూర్యుడికి కూడా కోపమేనా ? ఎందుకని ? ఎంత మిడసరంగా వుంది ? ఒక్క పిట్టయినా మెలగడం లేదు.

పట్నం ఏలా వుంటుందో ! మా వూరులాగే వుంటుందా ! అక్కడ కామందులూ, పాలేళ్ళూ వుండరేమో ! (ఉత్తరం చూచుకుంటూ) ఈ ఉత్తరం నే నెవ్వరికివ్వాలో ! ఆయన నా కెక్కడ దొరుకు తారో? అనాథశరణాలయం అంటే ఎలా వుంటుందో ? అందులో చదువు నేర్పుతారా కూడూ గుడ్డా పెట్టి ? ఎంత ఉపకారం !.... చాలా దూరం వచ్చేశాను ... బస్కెక్కితే ఒక్క గంట ప్రయాణ మట....

ఈ గాడ్పులో ఇక నడవలేను. ఈ చెట్టు నీడని కాసేపు కూర్చొని పోతాను. (కూర్చుని) అబ్బా ! ఎంత ఉడుగ్గా వస్తోంది గాలి ! మా కామందుకన్న ఇది కొంచెం నయమే ! ఇక్కడకాదు, ఆ చెలమ ఒడ్డున కూర్చుంటాను.

మనిషిపై ఎన్ని ఎండలు మండుచున్న
మనసులో చల్లదన ముంచు కొనగ వలయు
ఒక్కరైన ప్రేమించు వారున్న వాడు
ఎంత నిస్పృహ నైన భరించగలడు.

మాష్టారి పద్యాలెంత బాగుంటై ! ప్రాణాలు నిలబెడతై !

వెం : (అక్కడికి పోయి కూర్చుని) హాయిగా వుంది ! ఎంత చల్లగా వుంది ! పంతులుగారి దయ, బాలప్రేమ ఇంతకన్నచల్లన. (పడుకుంటాడు - కొంత సేపటికి దొంగ రామన్న ప్రవేశిస్తాడు)

దొం : ఓహో ! వీడే యెంకడు ! వీణ్ణి లేవకుండా చావ గొడతాను. (కర్రెత్తి) కుర్రనాయాలు ! వీణ్ణి కొట్టేం, కుక్కను కొట్టేం ! (చట్టూచూచి) సీతి లేదే ! కామందుగారి కేమని చెప్పను ? (పరిశీలించి) అదగో ఏదో మూట ! (మూట విప్పి) ఓహో ! లక్ష్మీప్రసన్నం ? పది రూపాయలు ? ఈ ఉత్తరం నాకెందుకు చెప్మా ? (ఉత్తరం గిరాటేసి, రూపాయలు జాగ్రతపెట్టు కుంటాడు.)

ఒక్క ఏడాది పాలేరుతనం చేసినా, పది రూపాయలు సంపాదించ లేను - కామందు నాయాలు ఇత్తేగా సంపాదించడానికి... ఒక్క క్షణంలో సంపాదించా - సంపాదనకు ఈ మార్గమే మంచి దనుకుంటాను ? వెధవ పాలేరుతనం మానేసి, ఈ యవ్వారం మొదలెడితే లక్షలు లక్షలు సంపాదించొచ్చు.... ఇక కామందుగారి దగ్గరికి వెళ్ళను... కామందుగారి దయవల్ల మంచివృత్తే నేర్పారు నాకు, (ఉత్తరం చూచి) నా పేరు ఉత్తరంగాని చెప్పదు గంద ! (ఉత్తరం తీసుకొని పోతాడు)

వెం : (లేచి) అబ్బ ? ఎంత పొద్దుపోయింది ? ఇక త్వరగా వెళ్ళకపోతే బస్సు దొరకదేమో ! (చూచి) ఆఁ ఆఁ ! మూటేది ? అయ్యో ? (మూటకోసం వెతుకుతాడు - పంచె దులుపుతాడు) పది రూపాయలు, పంతులుగారిచ్చిన ఉత్తరం ఈ పంచను కట్టానే ? (కలయవెదకి) దొంగతనమా ? ఎవరూ లేరే ! అయ్యో ! భగవంతుడా ? నన్ను దిక్కుమాలిన పక్షిని చేశావా ? కొట్టినచోటనే కొట్టావా ? (ఏడుస్తూ) ఈ వూరుగాని వూళ్ళో నన్ను పాతేశావా? ఇక నాకేది దారి ? ఏది దిక్కు ? అయ్యో ! అయ్యో? (క్రింద పడిపోతాడు - తెర మెల్లిగా జారుతూవుంటుంది. తెరలో పాట వినిపిస్తూ వుంటుంది. తర్వాత తెర లేచేవరకూ వినిపిస్తూనే వుంటుంది.)

(పాట)

ఆశ విడువకురా ! పాంథా

అలమటించకురా !

ఆశే జీవము

ఆశే మార్గము

ఆశే అభయము

ఆశే విజయము

ఆశే సుందరము ! పాంథా

ఆశే అందలము

ఘోరారణ్యము ?

దారి తప్పితివో ?

అడుగు నిలువకుము,

మడమ త్రిప్పకుము

ఆశే దిక్సూచీ ! పాంథా !

ఆశే కరదీపి.

ఆశే అవకాశమురా

ఆశే పువ్వుల గాలోడా

ఆశాపూరిత జీవితమే

ఆనంద సుధా భాండమురా !

ఆశామార్గములో పాంథా !

అరుగుమురా కడదాకా

(తెర పూర్తిగా పడుతుంది)

## రంగం:13

(ప్రభాత సమయం – కాకినాడలో పెద్ద వీధి – అనాథశరణాలయం దగ్గరలో కనిపిస్తూ వుంది – చేతిలోని వుత్తరంలోకి చూస్తూ ప్రవేశించాడు సుందరం.)

సుం : వెంకన్న (ఉత్తరం మళ్ళీ చూచి) వెంకన్న ! (ఆలోచించి) అతడే ! కుబేరయ్యగారి

పాలేరు ! తెలివైనవాడే పాపం. చదువు కుంటే పైకొస్తాడు. (నడుస్తాడు ! అంత రామం ప్రవేశిస్తాడు)

రా : హలో ! గుడ్ మార్నింగ్ ! ఏమిటి ప్రొద్దుటే బైలుదేరావ్ ?

సుం : నీ కోసమే, వెంకన్న అనే కుర్రవాడు మీ ఆర్ఫనేజికి వచ్చాడా ?

రా : నీ కెలా తెలిసింది ?

సుం : మా వూరేలే – మా చెల్లెలు వ్రాసింది, అతణ్ణి కొంచెం చూస్తూ వుండమని.

రా : చాలా రోజులైందట బయలుదేరి, మాకూ వుత్తరం వచ్చింది, ఆ వూరు టీచరుగారి దగ్గరనుండి, ఇంకా అతను రాలేదు –

సుం : ఏమైపోయాడో !

రా : వెతికించా లనుకుంటున్నాం.

సుం : అయితే – మన కాలేజీ స్కౌటును కూడా నియోగిద్దాం, మనం కూడా వెళదాం, నాకు మనిషి తెలుసుగా ! ఇట్టే గుర్తు పట్ట వచ్చు.

రా : ఈ వేళ ఆదివారమేగా ! పద ! బజారుకేసి పోదాం.

(నిష్క్రమిస్తారు – వెనుకనుండి వెంకన్న ప్రవేశిస్తాడు)

వెం : ఓహో ! పట్నం ! ఎక్కడ చూసినా మేడలే ! ఎక్కడ చూచినా జనమే ! ఇంతమంది జనం ఎక్కడనుంచి వచ్చారో ! ఇన్ని మేడలు ఎవరు కట్టారో, ఎలా కట్టారో..., ఇక్కడ రోజూ తీర్థంలాగే వుంది ! ప్రతి మనిషి ఏదో మునిగి పోతున్నట్టే పోతున్నాడే దురు సుగా ! అమ్మో మోటరు ! (పరికించి) ఎన్ని మోటార్లు ! ఎన్ని సైకిళ్ళు ! ఎన్ని రిక్షాలు! .... వీళ్ళందరూ ఎక్కడికో ప్రయాణం ! .... ఇక్కడ మనిషికి మనిషికీ సంబంధమేలేదు ! ఈ మహా సముద్రంలో నేనొక నీటి బొట్టును. నన్నెవరు చూస్తారు.... ఇంత

మహాపట్నంలో కూడా నిలవడానికి చల్లని నీడే లేదు ! ఇంత మహాతీర్థంలోనూ ఆకలి తీర్చుకోడానికి పుట్టెడు మెతుకులు లేవు! అయ్యో ! ఇప్పుడు నా గతేమిటి? ఏమి చెయ్యాలి ? ఏమైపోవాలి ? ఇంతమంది జనంలోనూ నేను ఏకాకినే ? సరే – ఈ రోడ్డే బడి పోతాను.

(వెళతాడు – వెనుక నుండి సుందరం ప్రవేశిస్తాడు)

సుం : మా రామం కూడా మారిపోయాడే ? లేనివాణ్ణి వెదకబోయి వున్న వాణ్ణి పోగొట్టుకున్నా నీ వేళ ? ఎక్కడా వెంకన్న జాడేలేదు. అతడెక్కడికి పోయాడో ! అప్పుడే మధ్యాహ్నమైంది – రామం ఇటు చూచి అటు మాయమైపోయాడే? అతడు నాగురించి ఎక్కడ వెదుకుతున్నాడో ! .... (అటుచూచి) అదిగో అక్కడెవళ్ళో చాలామంది మూగారు – అక్కడికి వెళ్ళి చూస్తాను – (వెళతాడు – వెనకనుంచి వెంకన్న బహు నీరసంగా ప్రవేశిస్తాడు)

వెం : అబ్బ ! ఇప్పటికెన్ని రోజులైంది నేను బయలుదేరి ? ఎన్ని రోజులైంది అన్నం కళ్ళజూచి ? మా గ్రామంలో నిరు పేదలు కూడ అడుక్కు తినే వాళ్ళకి ఇంత అన్నం పెడతారే ! ఈ పట్నంలో గంపలాది తినుబండారాలు ఈగలు తినేస్తున్నా, ఆకలితో ఎంతమంది చచ్చిపోతున్నారు ! ఈ ఆకలికిక తట్టుకోలేను – ఎన్ని రోజులు తిరిగినా ఈ పట్టణానికి దరీ అంతూ కనిపించడంలేదు – ఇక నే బ్రతకడం అనవసరం... ఆ వొచ్చే కారుకింద పడి ప్రాణాలు వొదిలేస్తాను, ఇక భరించలేను

(వెళతాడు, వెనుకనుంచి రామం ప్రవేశిస్తాడు)

రా : ఈ సుందరం ఇట్టే మాయమైపోయాడే ! పోలీసు స్టేషనులో చెప్పాను ! సరే, మా స్కౌట్లు ప్రయత్నిస్తూనే వున్నారు. ఈ పట్నం వస్తే మాత్రం వెంకన్న దొరికిపోతాడు – ఇక సుందరాన్ని పట్టుకుని ఇంటికి తీసుకుపోవాలి. నెత్తి మాడేస్తున్నది ఎండ (నిష్క్రమిస్తాడు – తెర)

## రంగం:14

(సమయం మధ్యాహ్నం. ఆర్ఫనేజి ప్రాంగణం - అందమైన వృక్ష లతాదులతో కలకల లాడుతూ వుంటుంది. కొంచెం మంచి బట్టలతో వెంకన్న ఒక బల్లపై కూర్చొని వున్నాడు - అలసిపోయిన ఆలోచనలతో - అంతలో అక్కడికి రామం వచ్చాడు.)

రా : (వెంకన్నని చూచి) ఇతడెవరు చెప్మా ?

వెం : (లేచి) నమస్కారమండి, నన్ను వెంకన్న అంటారు.

రా : ఓహో ! ఆశ్చర్యంగా వుందే ! ఎలా వచ్చావు ఇక్కడికి ?

వెం : సుందరం గారు తీసుకొచ్చారండి. నన్ను ఇక్కడ విడిచి, మళ్ళీ వస్తానని చెప్పి భోజనానికి వెళ్ళారు. తమరు రామం గారా ?

రా : అవును సరే - నేను పది నిమిషాల్లో వస్తాను. కొంచెం విశ్రమించు (నిష్క్రమిస్తాడు)

వెం : ఆహా ! ఎంత మంచి యువకులు ! ఎట్టి రాజభవనం ! మా కామందుగారి మేడమీద వెయ్యిరెట్లుంది - సూపరెంటుగారు ఎంత దయ గలవారు - దీన్ని స్థాపించిన మహారాజా వారు నిజంగా దేవుడే! ఎంత మంచి భోజనం పెట్టారు ! ఎంత మంచి బట్టలిచ్చారు ! నా జీవితంలో ఎప్పుడైనా అనుకున్నానా ఈ వైభవం నాకు పడుతుందని!

(సుందరం ప్రవేశం)

సుం : ఏమిటి వెంకన్నా ! ఏమిటి మనవూరు విశేషాలు ? కుబేరయ్యగారు పాపం నిన్ను చాలా అవస్థలు పెట్టినట్టున్నారే ! మాష్టారు బాగున్నారా?

వెం : చిత్తం.

సుం : చిత్తం అనక్కరలేదు. నీవు నీవు అనుకోవడమే ఇక్కడ. నీవుకూడా కాలేజీలో చేరతావుగా !

రా : (ప్రవేశించి) మహా బలే పనిచేశావు, సుందరం !

సుం : నేనేం చెయ్యను ! కారు క్రింద పడుతున్న వెంకన్నను రక్షించి రిక్షామీద తీసుకొచ్చేశాను - పాపం అతనికి కొన్ని రోజులుగా తిండే లేదట !

రా : మంచిపనే చేశావు - వెంకన్నా, నీకు చదువు ఏమాత్రం వచ్చు ? రేపు కాలేజీలో తగిన తరగతిలో చేర్పించమని మా నాన్నగారు చెప్పారు.

వెం : (చేతులు మోడుస్తాడు కృతజ్ఞతతో - )

సుం : చదువేమో గాని, సంగీతం బాగావచ్చు.

రా : ఆహా ! మనకు సంగీతం కరువు తీరిందన్న మాటే !

వెం : నాకేమీ రాదండి. పల్లెటూరి పాలేర్ని , నాకేమి వస్తుంది?

సుం : ఉపకారి మాష్టారు దగ్గర కొంత చదివావుగా రాత్రి బడిలో ?

వెం : కొంచెం.

రా : ఇంగ్లీ షేమన్నా వచ్చా ?

వెం : అదీ కొంచెం !

రా : పర్వాలేదు -

సుం : ఒక పద్ధతి చేస్తే బాగుంటుంది. ఇతడు తెలివైన వాడు కాబట్టి, ఇంటి దగ్గర ట్యూషన్ చెప్పించి, మెట్రిక్యులేషన్ పరీక్షకు కట్టిస్తే... త్వరలో ఎక్కిరావచ్చు.

రా : సలహా మంచిదే ! మా నాన్నగారితో చెపుతాను - నిజమే, తెలివైనవాడు కాబట్టి, త్వరగా ఎక్కిరావడానికి వీలుంటుంది.

వెం : మీ కిద్దరికీ నేను శాశ్వతంగా కృతజ్ఞుణ్ణయి వుంటాను.

రా : అలాంటిదేమీ అక్కర్లేదు - ఏది , నీవు పాడతావట, ఒక్క పాట కానీ ?

సుం : పాపం అలిసిపోయినట్టున్నాడు.

వెం : ఈ మాత్రం అలసట నాకు అలవాటేలెండి. ఏమి పాడమంటారు?

రా : నీ యిష్టం - ఊరికే నీ కంఠసరళి చూద్దామని.

సుం : నీ కష్టాలన్నీ కలిపి పాటగా పాడు - ఉపకారి మాష్టారి వద్ద చాలా నేర్చావుగా ?

వెం : (పాట)

ఆకటి బాధకు అల్లాడెదవా ?

బానిసవై బ్రతికెదవా ?

ఈ విశాల విశ్వములో మరియొక

త్రోవయె కనబడదా ?

పగలగొట్టు నీ భిక్షా పాత్రము

తెగత్రెంపుము నీ శృంఖలము

అభ్యుదయముతో ఆశాగతిలో

అడుగిడి సాగుము వీరా !

(మెల్లగా తెర జారుతుంది)

## రంగం:15

(ఒక పెద్ద భవనం - అది బాల - సుందరం వాళ్ళది - రైతు వాడలో బాగా కలిగిన కటుంబం అది - సమయం ఉదయం - భవనానికి ఆనుకొని వున్న తోటలో పూలు కోస్తూ పాడుకొంటూ వుంది బాల.)

బాల : ....... (పాట)

పదరా ముందుకు పదరా వీరా !

విశ్వము సువిశాలమురా !

వడి వడి ముందుకు పోయిన వానినె

విజయశ్రీ వరియించునురా !

గుమ్మము దాటని మ్రోడు జీవిలో

ఊహలున్న ఫలమేమి !

ఇమ్మహి యొక పోటీ పందెమురా ?

ఉరుకుమురా గుర్రమువై !

సుందర హిమగిరి శృంగములో

ఆశా వలయములో

అందుకో గెలవు కదిలిన నాడే !

అరుగుము లోకము లోకి.

(పాడుతూ మధ్య మధ్య పూలుకోస్తూ ఉంటుంది. అంత ఒక మూకుడు, చేతికర్రతో పుల్లయ్య వడివడిగా, దిక్కులు చూస్తూ ప్రవేశిస్తాడు)

పుల్ల : (చూచి) ఓహో ! ఇక్కడ అమ్మాయి గారున్నారే ! నన్ను చూడగలరు. (తప్పుకుపోబోతాడు)

బాల : (చూచి) ఓహో పుల్లయ్యా , ఎక్కడికి పోతున్నావు ?

పుల్ల : ఎక్కడికీ లేదు తల్లీ ! (కిందపడతాడు)

బాల : (సమీపించి) మూకుడితో బైలుదేరావ్ ? ఎక్కడికీ లేదంటావ్ ? ఏం, మా యింటిదగ్గర నీకు బాగుండటంలేదా ?

పుల్ల : ఎందుకు బాగుండ లేదమ్మ ? ఇన్నాళ్ళూ నన్నాదరించిన తల్లి దండ్రులు మీరేగదా ?

బాల : మరెక్కడికి ప్రయాణం ? (చిరునవ్వుతో) అబ్బాయి మీద మతి తిరిగిందా ?

పుల్ల : (దుఃఖంతో) ఇంకెక్కడ అబ్బాయి తల్లీ ? ఇంకా నా పాపిష్టి కళ్ళకి నాకొడుకు కనిపిస్తాడా ? 'నా' అనే వాళ్ళెవరూ లేకుండా.... (దుఃఖిస్తాడు.)

బాల : అబ్బాయి కేమీ ఫర్వాలేదు - చదువుకొని చక్కా వస్తాడు. నీ కేమిలోటు ? ఆ కుబేరయ్య లేకపోతే మేం వున్నాంగా ? మనల్ని అతడేం చెయ్యగలడు?

పుల్ల : కామందే లోకం అనుకున్నాను - కామందుకోసం నా జీవితం అంతా ఖర్చుపెట్టాను. కుటుంబాన్ని సర్వనాశనం చేసుకున్నాను - ఇప్పుడు మీ పంచన బ్రతకవలసి వచ్చింది తల్లీ ! ఎంతకాలం పెడతారు నాకు ఊరికినే ? (కుములుతాడు)

బాల : నీవు బ్రతికి వున్నంతకాలం పెడతాం, సరా ?

పుల్ల : నాకు వద్దు తల్లీ ! మీ రుణాన్ని పడివుండలేను. నేను ఎక్కడికో పోతున్నాను. నన్ను పోనియ్యండి -

బాల : నేను పోనియ్యను. నీవు వృద్ధుడివి - మిగతా నీ జీవితకాలం మా పొలాన్ని గడిపివెయ్యమని మా అమ్మగారు చెప్పలేదూ నీకు ?

పుల్ల : చెప్పారు కానీ, నేను ఉండలేను, ఈ ఊళ్ళో ఇక ఒంటిగాణ్ణయి బ్రతకలేనం డమ్మ ! నేను సేద్యంచేసిన యీ పొలాల్లో తోటల్లో నేను పరాయివాణ్ణయి తిరగలేను. నా యింటిది, నా కొడుకు, మరదలు అందరూ ప్రతీ గడియా గేపకం తెచ్చే ఈ ఊళ్ళో నాకు నిద్దర పట్టదం డమ్మ - ఇన్నాళ్ళూ మీ బలవంతంమీద ఆగాను - ఇంక ఆగలేను - సెలవిప్పించండి. (నిష్క్రమిస్తాడు)

బాల : (చకితురాలై) ఈ నిర్భాగ్యు డెక్కడికి పోతాడో ఇప్పుడు ? అయ్యో పాపం ? యిత డెలా బ్రతుకుతాడో ? ఇక మా అమ్మతో చెప్పి, ఇతడ్ని మళ్లీ రప్పించేస్తాను. (పరుగెడుతుంది - ఆ వెనుకనుంచి కుబేరయ్య ప్రవేశిస్తాడు)

కుబే : (తల వూపుతూ) ఆс ! యీ పుల్లిగాడికి వెకనబలం ఈవిడా ? సరి, తెలిసింది. అమ్మా ఎంత పెత్తనదారి అయిపోయింది ! గోలీ కాయంత లేదు ! ... ఏమిటి పుల్లడితో ఆలోచిస్తూ వుంది ? .... ఆ యెంకడ్ని చెరిపింది యిదే. బంగారంలా పాలేరుతనం చేసు కుంటున్నవాడికి పాటలు నేర్పి..... యీ పిల్లా, ఆ పంతులుగాడూ యెంకడ్ని చెరిపేశారు. వీళ్ళిద్దరే పాడుచేశారు.... ఈ పిల్ల తల్లితో గట్టిగా చెప్పుతాను మాలాంటోళ్ళం బ్రతికి వుండగానే యీ వేషాలా? ఇక ఆ పంతులుగాడి సంగతా, హుс ! యిక్కడే నా మజా - వాడెంత పలుకుబడి గలవాడైనా, వాడి వాళ్ళ చేతే వాణ్ని పాత రెయ్యించగలను - యీడ్చి తన్నినా ఏగానీకి గతిలేని కూలీ పీనుగలేగా నా చేతికిందవాళ్ళంతా ! పావలాకి పాతికమందిని చంపి రాగలరు... లేకపోతే ఏ కేసో కల్పించి ఖైదులో తొయ్యించాలి. అవకాశం మాత్రం దొరకాలి... అమ్మ సీతి ! కంట్లో దుమ్ముగొట్టి పోయావే ! ఆ వీరిగాణ్ణి ఉరితీయిస్తాను.... దొరకాలి.

(నిష్క్రమిస్తూ వుండగా తెర పడుతుంది)

## రంగం:16

(ఒక రహదారి - చేతిలో ఒక వుత్తరంతో ఉపాధ్యాయుడు ఉపకారి అటుగా వచ్చాడు.)

ఉప : ఆహా ! కాలం ఎంత చిత్రగతి కలది !

ద్విп అంతలో చీకటి, అంతలో వెలుగు

అంతలో జడివాన అంతలో యెండ

అంతలో కష్టము అంతలో సుఖము

కాలచక్రపుదారి గలదెల్ల వింత !

కష్టసుఖాలు ఒకదాని వెంట ఒకటి పోతూవుంటాయి - వెంకన్న ఎంత

కష్టం అనుభవించాడో అంత సుఖం అనుభవించవలసి వుండి - అతడు నేడు వెంకటేశ్వరరావు అనే పేరుతో బి.ఎ. చదువు తున్నాడు - గొప్పవారు ఎందరో అతనికి స్నేహితులయ్యారు - ప్రతి ఉత్తరంలోనూ తన తండ్రి గురించి, తన పిన్ని గురించే వ్రాస్తాడు - ఎంత ఆరా తీసినా వాళ్ళజాడ కనిపించడంలేదు - అతని హృదయం కలతజెందకుండా 'అంతా క్షేమం' అని వ్రాస్తున్నాను ఇన్నాళ్ళదాకా - అతడు వచ్చేలోగా వాళ్ళను పట్టుకోవాలి... ఈ ఉత్తరం ఏదో, రంగు కవరు మీద వ్రాశాడే ! (కవరుచించి ఉత్తరం చదువుకొని) ఓహో ! బి.ఎ. పూర్తి కావచ్చిందట - ఇంకా పైకి చదవాలని వుందట - ధన సహాయం తన మిత్రులు చేస్తామంటున్నారట - అయినా అనేక సంశయాల్తో బాధపడుతున్నాడట - బాలకు వందనాలు మాత్రం మానడు ప్రతి ఉత్తరంలోను !

బాల : (ప్రవేశించి) వెంకటేశ్వరరావు గారి ఉత్తర మేమిటండి. మాష్టారు ?

ఉప : ఔనమ్మా ! సరిగ్గా మాటలోనే వచ్చావే ?

బాల : నాకు నూరేళ్ళు ఆయుష్షండి - (ఉత్తరం తీసుకుని చదివి) పైకి చదవడానికి ఏ మాత్రం డబ్బు కావాలండి ?

ఉప : కొన్ని వేలు కావాలి.

బాల : మా అన్నయ్య మదరాసు వెళ్ళి చదువుతున్నాడు ! అట్లాంటిదేనా?

ఉప : ఏమో సరిగ్గా వ్రాయలేదు - ఇంకా ఎందుకు ? ఏదో మంచి ఉద్యోగంలో ప్రవేశించమని సలహా యిద్దా మనుకొంటున్నాను -

బాల : తనకు తృప్తి కలిగే వరకు చదువుకో నివ్వండి.

ఉప : ధనసహాయం కావాలిగదా? పెద్ద చదు వంటే మాటలతో ఉందా!

బాల : (తన మెడలోని కాసులపేరు తీసి) ఇదిగో - అమ్మేసి వెంకన్న కివ్వండి.

ఉప : అమ్మో ! ప్రమాదం – నీ వింకా చిన్నపిల్లవు – ఇలాంటి పనుల పర్యవసానం చాలా క్రూరంగా వుంటుంది – నీవు స్వతంత్రురాలవు కావు.

బాల : నేను చేస్తున్న పనికి మా అమ్మ మా అన్నయ్యకూడ సంతోషిస్తారు– ఒక అనాధ చదువుకోసం నేను నాకు కలిగినంతలో సాయం చెయ్యడం తప్పు కాదనుకుంటాను. దీన్ని వెంకన్న కందియ్యడానికి భయపడుతున్నారా ? మీ దృష్టిలో కూడా నేను చేస్తున్న పని తప్పుగా కనిపిస్తోందా ?

ఉప : లేదు, లేదు, నీవు చేస్తున్నది అత్యుత్తమమైన పని – నేను ఎవరికీ భయపడేవాణ్ని కాను, బాలా ! నీ వింతదాన వని ఇప్పుడే తెలిసింది నాకు – నివురుగప్పిన నిప్పువు, బాలా నీకు వెంకన్న శాశ్వతంగా దాసుడై వుంటాడు –

బాల : (సిగ్గుపడి) మీరు కాకినాడ వెళతారా ?

ఉప : వెళుతున్నాను – ఇంకేమైనా చెప్పేదున్నదా ?

బాల : ఏమీ లేదు – క్షేమమని చెప్పండి – మరచిపోవద్దనండి –

(నిష్క్రమిస్తుంది)

ఉప : (బాల వెళ్ళిన వంక, కాసుల పేరు వంక చూస్తూ) ఈ బిడ్డ త్యాగాని కర్థమేమిటో ! ఈ ప్రేమకు దారేదో ? పర్యవసానమేదో? కాలగర్భంలో ఏముందో ? బైటపడితేగాని తెలుసుకోలేం (నిష్క్రమిస్తాడు – వెనుకనుండి కుబేరయ్య ప్రవేశిస్తాడు)

కుబే : ఆc ! (పరికించి, ఈ పంతులు ఎక్కడకు పోతున్నాడు చెప్మా ? ప్రయాణమై పోతున్నాడే ! అందరికి బుద్ధి చెప్పాను గాని వీడికి ఇంకా తగిన శాస్తి జరిగింది కాదు. ఇప్పుడెక్కడికి వెళతాడో చూస్తా – దొంగ రామన్న చేతికి దొరక్కుండా పోయాడు – నా కింద కూలీల్ని ఇద్దర్ని పురమాయించి వీడి పని పట్టిస్తాను – ఆ రౌడీ రంగడికి ఒక పావలా చేతిలో పెట్టి, నాలుగు

ముంతలు పొయ్యించేసా నంటే... ఇట్టే పని జరుగుద్ది - తాగి తండ్రిని పొడిచినోడేగా -

(వెళతాడు - వెనుకనుండి పుల్లయ్య భిక్షకుని వేషంతో - భిక్షాపాత్రతో, చేతికర్రతో, ప్రవేశిస్తాడు)

పుల్ల : తల్లుల్లారా ! తండ్రుల్లారా ! ముట్టోణ్ణుండమ్మా.... ఎర్రిదద్దమ్మ నైపోయి, పాలేరోణ్నయి బ్రతికి, బంగారంలాంటి కొడుకుని పోగొట్టుకుని, కూటికిగుడ్డకి మొగమాసి తిరుగుతున్నా నీ యూళ్ళంట- తల్లీ ! తండ్రీ !

(పాట)

తల్లుల్లారా ! తండ్రుల్లారా ?
యిన్నారమ్మా నాకథను ?
పేదమాలగా జన్మించాను
పెంటలపాలై జీవించాను
కష్టం కామందుకి ధారోసి
ముప్టైత్తుకు పస్తుంటున్నాను ॥యి॥
పొట్ట చింపినా అచ్చరంలేదు
పట్టెడు మెతుకు పొట్టకులేదు
కటికోణ్ని నమ్మిన గొర్రెను నేను
కడుపుకాలి చస్తున్నాను.

(కొందరు పౌరులు భిక్షం వేసి పోతారు)

తల్లుల్లారా ! తండ్రుల్లారా !
యిన్నారమ్మా ! నా బోధ !

కడుపున బుట్టిన కసుగాయల్ని,

కామందుల కాళ్ళకు బలియ్యకండి

విద్యాబుద్ధులు చెప్పించండి

పెంచండి పనికొచ్చేలాగ

పాలేర్తనములో ఏమీ లేదు

బానిసకూడూ కడుపునిండదూ

స్వేచ్ఛగ తలయెత్తుకు బతకండి !

జీవించండి సొంతముగా ! ॥యి॥

అమ్మా కడుపునిండిన తల్లులు ! పొలం పండిన బాబులు!

(అడుక్కుంటూ పోతాడు - వెనుకనుంచి ఉపకారి ప్రవేశిస్తాడు)

ఉప : చాలాదూరం వచ్చేశాను - ఇంకొక్క గంట ప్రయాణంతో కాకినాడ చేరుకోవచ్చు - ఈ ప్రాంతంలోనే ఎక్కడో వెంకన్నని దొంగలు దోచా రానాడు - కొత్తవాళ్ళు ఒంటరిగా ప్రయాణాలు చేయ కూడదు- తన కుటుంబం గురించి వెంకన్నకు ఏమని చెప్పను ? ఎంతకాలం మభ్యపెట్టగలను ? అయినా సరే అతని పరీక్షలైపోయే వరకూ చెప్పను..

(దొంగరామన్న ప్రవేశం)

దొంగ : ఆc ! దొరికిందొక పిట్ట !

ఉప : (చూచి) వీడెవడో మార్గస్థుడు - నడుస్తూ వుంటాడు)

(దొంగ వెనుకగా వచ్చి ఒక దెబ్బ కొడతాడు - ఉపకారి పడిపోయి మూల్గుతాడు - కాసులపేరు దొంగిలించి దొంగరామన్న పారిపోతాడు - అంత రౌడీ రంగడు, మరో ఇద్దరు కూలీలు ప్రవేశిస్తారు)

కూలి : ఇదుగో, వీడే పంతులు !

దొంగ : మన కామందుగారు కాళ్ళిరగ్గొట్టి రమ్మంది వీణ్నేగా ?

కూలి : ఆ పని ముందే చేశా డెవడో !

రౌడి : (ముందుకు పారజూచి) అదుగోనోయ్, ఎవడో పారి పోతున్నాడు. వాణ్ణి నేన్ను పట్టుకుంటాను. వీణ్ణి లాక్కెళ్ళి, పోలీసు స్టేషనులో పారెయ్యండి. (పరుగెత్తుతాడు – కూలీలు ఉపకారిని మోసుకు పోతారు – ఆ వెనుకనుంచి వీరేశు, సీతమ్మ ప్రవేశిస్తారు)

వీరే : ఎలాగుంది సీతే ! పట్న జీవనం ?

సీత : మొదట్లో బాగానే వుంది కానీ .... .... ....

వీరే : మనలాంటి దరిద్రులికి ఎక్కడైనా వొకటే – పట్నం రంగు పింగు లున్న వాళ్ళకి –

సీత : డబ్బుంటే మాత్రం – ఒక కొంపకీ ఒక కొంపకీ సంబంధమే వుండదిక్కడ. పల్లెటి గ్రామాల్లో ఎంత కలసిమెలసి వుంటారు జనం! ఇక్కడ ఎవరికి వారే.

వీరే : పోనీ మళ్ళీ మనవూరు వెళ్ళిపోదామా ?

సీత : వెళ్ళాలనే వుంది నాకూనూ – మా బావ, మా యెంకన్న బాబు ఎలా వున్నారో చూడాలని బెంగగా వుంది !

(దొంగ రామన్న ప్రవేశం)

దొంగ : ఓహో ! నాయెంట పోలీసులు పడ్డారు ! ఇక లాభంలేదు.

(అటూ ఇటూ చూచి, కాసులపేరు వీరేశు మీదకు విసిరేసి, పారిపోతాడు – అంత రౌడీ రంగడు ప్రవేశిస్తాడు.......)

రౌడీ : ఓరేయ్ ! ఇలాగ ఒక దొంగ పారిపోయి వచ్చాడు, చూశావ్ ?

వీరే : వాడే గాబోలు పారిపోయాడు - ఇదిగో కాసులపేరు !

రౌడీ : (తీసికొని, అమ్మ గాడిదకొడకా, పద స్టేషనుకు, అరుగో పోలీసులు (వీరేశును పట్టుకుంటాడు - వీరేశు గింజేస్తాడు ! సీతమ్మ ఏడుస్తూ అడ్డుపోతుంది.)

సీత : మేం ఏ పాపమూ ఎరగం, నాయనా !

వీరే : పుణ్యానికి వెళితే పాప మెదురొస్తున్నది.

రౌడి : ఏడిశావ్, నోరు ముయ్యరా ?

(మళ్ళీ కలయబడతాడు - వీరేశు రౌడీరంగణ్ణి పడగొడతాడు - వస్తున్నాం ! వస్తున్నాం, పట్టుకో అనే కేకలు తెరలో వినిపిస్తాయి)

(పోలీసులు వచ్చి వీరేశును పట్టుకు పోయినట్టు చూపినా చూపవచ్చు)

## రంగం:17

(శరణాలయం ముందు ఒక తోట, సమయం ఉదయం - వెంకటేశ్వరరావు (వెంకన్న) మంచి దుస్తులతో, ఏదో ఆలోచిస్తూ తనలో తాను పాడుకొంటూ తోటలో తిరుగుతున్నాడు.)

వెం : (పాట)

అనుభవించుకొలది, జగము

అమృత మధురమౌగా !

సాగిపోవుకొలదీ, పథము

సస్యశ్యామలము !

నడిచెడు కొలదీ

నలుగురు దారీ

అడుగులు బలమై

అలవాటౌగా !

సాహసమే

సౌఖ్యమార్గము

శౌర్యమే

జయమూ !

పాలేరు వెంక డెక్కడ ! పట్ట పరీక్ష లెక్కడ ! ఆ పూరి పాక లెక్కడ ! ఈ సుందర రాజభవనా లెక్కడ ! ఓహో ! నక్కకూ నాకలోకానికీ ఎంత దగ్గర !.... లక్షాధికార్ల బిడ్డలతో "ఒరే ఓరే" అనుకుంటూ, ఈ కాలేజీలో, పట్టణ వీధుల్లో విహరిస్తున్న నా అదృష్టానికి కారకులు ప్రోత్సాహకులు ఆ పంతులుగారు – ఆ బాల (చేతులు మోడ్చి) ఆ పాలేరుతనం కుళ్లులోనుంచి నన్ను ఉద్ధరించి, అభ్యుదయ గతి చూపిన ఆ యిద్ధరికీ నేను జీవితకాల మంతా కృతజ్ఞణ్ణయి వుంటాను. ఇన్ని సంవత్సరాలనుచీ నేను ఇంటికే వెళ్ళలేదు – మా నాన్న , పిన్నీ... అంతా ఎలా వున్నారో ఒకసారి వెళ్ళి చూచి రావాలి.

(అంత రామం బండి దిగి ప్రవేశిస్తాడు, చేత న్యూస్ పేపరుతో, సూట్‌కేసు, బెడ్డింగు బండివాడు తెచ్చి లోపల పెట్టి నిష్క్ర మిస్తాడు.)

వెం : గుడ్ మార్నింగ్, రామం, మాటలోనే దిగావే ! (కరస్పర్శ చేసు కుంటారు)

రా : (న్యూస్ పేపరు అందిస్తూ) మన పరీక్షా ఫలితాలు చూశావా ?

వెం : ఆఁ ! ఈ వేళ పడ్డాయా ? మనపని ఏమైనట్టు ?

రా : చూడు – చేతిలోనే వుందిగా ! !

వెం : నీవు చూచింది చెప్పుడూ, నాకు ధైర్యం చాలడం లేదు.

రా : నీది ఫస్టు క్లాసు, నాది సెకండు క్లాసు.

వెం : ఇద్దరిదీ ఫస్టే అయితే బాగుండును.

రా : నే నసలు ఏమీ వ్రాయందే !

వెం : (అప్పుడు పేపరు విడదీస్తాడు)

రా : నీకు ఇంకో శుభవార్త.

వెం : ఏమిటి ?

రా : ఆ రెండో పేజీలో చూడు, సర్వీసెస్ కమీషన్ ప్రకటన.

వెం : (చూస్తూ) అయితే ఏమంటావు ?

రా : డిప్యూటీ కలెక్టర్ వుద్యోగానికి ఒక గ్రాడ్యుయేటు, షెడ్యూలు తరగతికి చెందినవాడు కావాలని ప్రకటించారురా ? నీవు అప్లయి చెయ్యి.

వెం : ఏం ఉద్యోగంరా ! పాలేరుతనంలో నుంచి బయటపడి, బానిసతనంలో ఇరుక్కోనా ?

రా : ఉద్యోగం – అందులోనూ అంత పెద్ద ఉద్యోగం బానిసతనమా ?

వెం : బానిసతనమే, పైగా 'ది మోస్ట్ ఒబిడియెంట్ సర్వెంట్' తనము.

రా : మరేం చేస్తావు ?

వెం : ఇంకా చదవాలని వుంది – ఉపకారి మాష్టారికి తోడుగా ఆయన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలనీ ఉంది. ఈ మాత్రం చదువుకోడానికి నేనెంత కష్టపడవలసి వచ్చిందో చూశావుగా? నే నదృష్టవంతుణ్ణి. నాకెందరో తోడ్పడ్డారు. దారి చూపారు. ఏ దిక్కూలేని ఎంతమంది పసివాళ్ళు పిల్లపాలేళ్ళుగా, బాల కార్మికులుగా, కట్టు బానిసలుగా నలిగి నశించిపోతున్నారో ! గడిచి గట్టెక్కిన నేను, నా వెనకవాళ్ళను ఉద్ధరించడానికి కృషి చెయ్యవలసి లేదా ?

రా : ఎంతైనా వుంది. అట్టి కృషిలో మాలాంటి యువకులుకూడ ఎంతోమంది నీకు తోడ్పడగలరు. అయితే నీవు ఒక సంఘ సేవకుడిగా కంటె, ఒక అధికారిగా ఎక్కువ కృషి చెయ్యగలవు కదా ?

వెం : అధికారాన్ని పురస్కరించుకొని గర్వం, స్వార్థం, అవినీతీ, క్రౌర్యం వంటి అమానుష దుర్గుణాలన్నీ నెత్తికెక్కవా ?

రా : నిజమే, అధికారంలో కళ్ళూ, చెవులూ, హృదయమూ కూడ మూసుకుపోయేవాళ్ళు కొందరుంటారు. నీ వలాంటివాడివి కావు, కాలేవు, పైగా పీడకులకు వివేకమూ, పీడితులకు చైతన్యమూ కలిగించాలంటే నీ వంటివాళ్ళు అధికార్లు కాక తప్పదు.

వెం : ఆలోచిస్తాను.

రా : ఆలోచించడం కాదు, అప్లయి చెయ్యడమే. ఇది... ఇది మంచి అవకాశం ! ఇది నీ కోసమే వచ్చినట్లుంది. ఇదిగో సుందరం కూడా వ్రాశాడు నీకు.

(ఉత్తరం ఇస్తాడు)

వెం : (చదువుకొని) ఎప్పుడు వస్తాడు సుందరం !

రా : నీవు ఈ ఉద్యోగానికి అప్లయి చేసి, అది నీకు వచ్చినప్పుడు !

వెం : (నవ్వుతూ) ఇదేం ఇంద్రజాలమా ?

రా : ఇంద్రజాలమే, చూద్దాం, పద !

(నిష్క్రమణ – తెర)

# రంగం:18

(17వ రంగం వంటిదే, ప్రవేశం రామం, చేతిలో ఒక లేఖతో)

రా : కాల చక్రం ఎంత చకాచకా దొర్లిపోవుతున్నది ! వెంకన్న పాలేరుతనం, కాలేజి చదువు, డిప్యూటీ కలెక్టరుగా నియామకం - ఇంత చరిత్ర రెండు గంటల్లో జరిగిపోయినట్లుగా వుంది ! తన అధికార పరిధికి లోబడి, అతడు చేస్తున్న ప్రజాసేవ నిజంగా అద్భుతం ! ఆదర్శప్రాయం ! అదిగో ఇలానే వస్తున్నాడు !

(ప్రవేశం వెంకటేశ్వరరావు, ఆఫీసరు దుస్తుల్లో)

వెం : హలో, రామం !

రా : నీకు మరో శుభవార్త !

వెం : శుభవార్తా పరంపరలు మోసుకురావడానికే నీవు మద్రాసు వెళుతున్నట్లు కనిపిస్తున్నదే ! ఏదీ కానీ...

రా : అది నాకు సంబంధించినది.

వెం : అయితే, నాకూ సంబంధించినదే.

రా : ఈ విషయంలో మాత్రం మన ఇద్దరికీ భాగంలే దబ్బాయ్ ! ఇది ఎవరికో ఒకరికి పూర్తిగా చెందే విషయం.

వెం : ఏమిటా విచిత్రవిషయం.

రా : శుభం.

వెం : అబ్బ, ఊరించేస్తున్నావే !

రా : ఇదిగో (లేఖ అందిస్తాడు)

వెం : (చదివి తెల్లబోయి) వివాహం ! వన బాల !

రా : అలా తెల్లబోయావేం ? వనబాల.... సుందరం చెల్లెలు. ఎప్పుడైనా చూశావా ? ఎలా ఉంటుంది ?

వెం : .... ..... ....... ....

రా : ఏమి టనుమానిస్తున్నావు ?

వెం : (తేరుకొని) జ్ఞాపకం తెచ్చుకొంటున్నాను. చిన్నప్పుడు చూశాను.

రా : ఎలా వుంటుంది ?

వెం : దేవతలా వుంటుంది.

రా : కుటుంబం ?

వెం : దివ్యమైన కుటుంబం.

రా : మన స్నేహం శాశ్వతంగా ఉండాలని ఈ సంబంధానికి ఒప్పు కున్నాను.

వెం : బలవంతం మీదనా ?

రా : నిజమే కాని, నేను బలవంతానికి లొంగేవాణ్ణి కానుగా ? బ్రహ్మ సమాజ పద్ధతికి సుందరం ఒప్పుకోవడం ఒకటి, నీవూ ఆ వూరివాడివే అయివుండడం ఒకటి నాకు అనుకూలించాయి. మన స్నేహం చిరస్థాయిగా ఉండడమే ఈ సంబంధానికి ఒప్పుకోవడంలో నా ఉద్దేశం. మా నాన్నగారు కూడా సరే అన్నాడు.

వెం : .... .... ...... .....

రా : నీ వింత కృంగిపోయినట్లు కనిపిస్తున్నావేం ?

వెం : తలపోటుగా ఉంది. మనస్సు కలతదారి ఉంది. విద్యార్థి దశ అనే ఒడ్డుపైనుంచి జీవితం అనే నౌకమీద కాలుపెట్టిన సంధికాల గదా?

రా : అయితే, కొంచెం విశ్రమించు - నేను స్నానం చేసి వస్తా - మద్రాసు విశేషాలు చాలా ఉన్నాయి - మాట్లాడుకుందా - (నిష్క్రమిస్తాడు)

వెం : (కన్నీరు తుడుచుకుంటూ ఆకాశంకేసి చూచి) బాలా ? సంతోషించవలసింది పోయి, ఏమిటిలా దిగులు పడిపోయింది నా మనస్సు ! నా స్నేహంలో ఇంత స్వార్థమున్నదా ?

సీ॥ అలనాటి మా పొట్టి యాబోతు బెదిరిన
రంగైన నీ పరీరంభ సుఖము
అలనాటి నీవు యెంగిలిజేసి విడిచిన
గొబ్బిపువ్వుల తేనెగ్రోలు తీపి
అలనాటి బడికి రమ్మని నీవు చేసిన
నవదుషస్సంకీర్తనముల సొబగు
అలనాటి ఆత్మహత్యా ప్రయత్నము నుండి
తప్పించినట్టి నీ గొప్పదనము.
దిక్కులేనట్టి పక్షినై తిరుగుచుండ
దిక్కుచూపి, నన్నింతకు దెచ్చినట్టి
బాల! నిన్నెట్లు మరతు ? దేవతవు నీవు
నిన్ను మరచుట యన మరణించుట గద ?

బాలా ! ఏ భావం నా హృదయంలో తేనే లూరించిందో, అదే నేడు విషమై కాలుస్తూవుంది ! బాలా ! నిన్నెంత ప్రేమిస్తున్నానో - ఇప్పుడుగదా నా కర్థమవుతూవుంది... త్యాగశీలా ! నీ త్యాగానికి ప్రతిఫలం నీ కేమీయగలను ! నా బ్రతుకే నీ పాదాల కర్పించి సేవించాలనుకున్నాను. కాని .... ..... ఏమిటో యీ అవేదన నాకు! ఓహో ? నా దీనస్థితికి జాలిపడి, నా కుపకారం చేసిన దేవత కలకాలం నాదైవుండాలని కోరుతున్నా నే ! అయ్యో

! అందని పండుకు అర్రులు చాస్తున్న వెర్రినా నేను ! ఈ ఆశా భంగాని, ఈ వాంఛా ఘాతాన్ని ఎలా భరించి జీవించగలను ? బాలా ! నేను నిర్మించుకొన్నవి గాలి మేడలా ? నీవు గగన కుసుమానివా ! (కన్నులొత్తుకొని)

చ॥ హృదయము బీటవారె సహి
యింపగరాని వియోగవహ్నిచే ;
బ్రదికితి నీదు దర్శన శు
భాభ్యుదయంబిక తొల్కరించు నం ,
చదియును పోయె; ఆశలు ని
శాచరులై భయపెట్టసాగె; రే
పుదయ మె లేదు గావును త
లోదరి ? ఈ దరిలేని రాత్రికిన్ !

బాలా ! నీవు లేకపోతే నాకీ చదువు, ఉద్యోగం ఎందుకు? ఏ జీవనశక్తి నన్నీ స్థితికి పురోగమింపజేసిందో – ఆ చైతన్యశక్తి నన్ను హఠాత్తుగా విడిచిపెట్టి పోతున్నప్పుడు – నా హృదయం ఛిన్నాభిన్నం కాక నిలవగలదా!

గీ॥ గ్రామమును జేరి, సస్య సుశ్యామలంపు
గట్టులో దాగి 'అమ్మదొంగా' యటంచు
నిన్ను మనసార బెదరింపనున్న నాకు
చెదరిపోయెనె జీవితాభ్యుదయ మిట్లు !

నీకు సేవచేస్తూ మానవసేవ చెయ్యాలనుకొన్న నాకు ఒక్క మానవసేవనే మిగిల్చిపోతున్నావా ?

కులపు గొడ్డళ్ళతో మొత్తుకొనెడు జాతి

నిన్ను నన్నును ఒకటి కానిచ్చు టెట్లు ?

పిచ్చికోర్కెల భ్రాంతిని పెంచుకొంటి !

ఎరిగి యుండియు ఎద కుందు నేలొ ఇట్లు !

(తల పట్టుకుంటాడు, తెర)

## రంగం:19

(రైతువాడలో బాల గృహ ప్రాంగణం, ప్రవేశం సుందరం – చేతిలో శుభలేఖలు – ముందుగా నౌకరు బెడ్డింగు పట్టుకొని ప్రవేశించి ఇంట్లోకి పోయాడు – వెనకగా సుందరం ప్రవేశించాడు)

సుం : (గాలి పీల్చుకొని) ఎంత మధురం ! ప్రకృతి సిద్ధమైన ఈ సౌభాగ్యం గ్రామంలోనే తప్ప పట్టణంలో పొందలేము.

సీ॥ శుకపిక శారికా నికరమ్ము చెల్మితో

స్వాగతములు పల్కు శాఖలందు

మల్లికాది మనోజ్ఞ వల్లికా కులములు

భూషించు సుందర పుష్పవితతి,

శ్యామల సస్యపుష్కలములై పొలములు

ఆహ్లాద మొనగూర్చు నడుగడుగున,

స్వేచ్ఛగా భూమిని సేవించు కృషికులు,

శ్రమికులు నేత్ర పర్వమ్ముచేయు,

అవని జనుల కందరకు నాహార మొసగు
గ్రామ సీమయె నంద నారామ సీమ,
అమృత చైతన్య మీ నేల నాడిపాడు !
శ్రీమనోహృష్టి మీ గ్రామ జీవనమ్ము.

(అంత ఎదురుగా ప్రవేశం ! కుబేరయ్య)

కుబే : ఓహో ! సుందరమా ! ఎప్పుడొచ్చావ్ ? ప్లీడరుపట్టా చదివావట కదూ ?

సుం : అలాంటిదే నండి - ఏమి టీదారిన వచ్చారు ?

కుబే : అబ్బే, పొలం పోతూ, నీవు వచ్చావని తెలిసి, చూసిపోదామని వచ్చాను.

సుం : నేను ఇప్పుడే వస్తున్నానే ! అప్పుడే మీ కెలా తెలిసింది !

కుబే : తెలియడ మేంటి, తెలియకపోవడమేంటి ? సరేగాని... చేతిలోవి శుభలేఖలా?

సుం : ఔనండి, మా చెల్లెలు సంబంధం - కాకినాడ అనాథశరణాలయం సూపరింటెండెంటుగారి అబ్బాయికి....

కుబే : ఆс ! అంటే ?

సుం : 'అంటే' అంటే ?

కుబే : పెద్ద తలకాయ లేకపోతే ఎద్దు తలకాయ తెచ్చి పెట్టుకోమన్నారు పెద్దలు, సంబంధాలు నిర్ణయించేటప్పుడు కుర్రతనాలు పనికొస్తా యటోయ్ ? కాస్త పెద్ద తలకాయ సలహాలు తీసుకోవద్దూ ?

సుం : ఇప్పుడు వచ్చిన ప్రమాద మేమిటి ?

కుబే : ప్రమాదమే - ఆ మాలకూడు తెచ్చి పండువంటి వంశంలో కలిపేస్తున్నావ్ ! పైగా మమ్మల్నందరినీ చవటల్లాగా వూరుకో మంటున్నావ్ ?

సుం : బ్రహ్మ సమాజంలో అవేవీ లేవండి. అందరూ మానవులే - అందరూ సోదరులే - పైగా వరుడు గౌరవకులస్థుడు, గౌరవ వంశస్థుడు.

కుబే : ఏమో, నాకిలాంటివి నచ్చవు - ఈనాడు ఇదైంది; రేపు శుద్ధ మాలోణ్ణి తీసుకొస్తావు - నీతి నియమాలు తప్పిన తర్వాత ఒకదారేంటి, ఒక తెన్నేంటి?

సుం : పవిత్ర వర్తనుడు, ప్రజ్ఞాశాలి అయిన మానవుడు ఏ కులమైనా ఒక్కటే నాకు –

కుబే : ఆఁ ! అంతటివాడి వైనావు ? ప్రమాదం ! జాగ్రత్తసుమా, సంఘాన్ని ధిక్కరిస్తున్నావ్.

సుం : సంఘం సంగతి నాకు తెలుసు లెండి. మంచివాణ్ణి వంచి కాలరాస్తూ, రౌడీకి దాసోహం చేసే స్వభావంగల సంఘాన్ని నేను లెక్కచేసే వాణ్ణికాను.

(కుబేరయ్య కళ్ళెర్రచేసి చూస్తూ, తల పంకిస్తూ నిష్క్రమిస్తాడు).

సుం : మా దౌర్భాగ్య హిందూ సంఘానికి ఇలాంటి వాళ్ళంతా పెద్దలు. ఓభారత సంఘమా.

గీ॥ కుటిల కులమత భేదాల కుళ్ళులోన
కూలబడి యెంతకాలము కుందె దమ్మ !
ఏక జాతీయశక్తి యెపుడునీవు
స్వేచ్ఛపొంది పురోగమిచెదవో ? తల్లి !

(నిష్క్రమిస్తాడు - కొంచెం సేపటికి బెంగతో, దుఃఖంతో కృశించిన బాల ప్రవేశిస్తుంది....)

బాల : (పాట)

ప్రేమామృతము పోసి పెంచుకొన్నానే,

ఫెళ్ళుమని విరుతువా, యీ పూలతీవ ?

భూగర్భమందుండి కూర్చుకొన్నానే,

పుటుకుమని త్రెంతువా, నా రత్నమాల ?

నీ కొరకు పైనమై నడివీధి బడితినే,

నిశితకంటకము లడుగడునకు పోతువా ?

గాలిలో మేడలు కట్టుకున్నాను

ధూళిలో నా యాశ కూలద్రోసెదవా ?

నా బ్రతుకు బ్రతుకెల్ల నమ్ముకొన్నానే

నా తల్లి భారతీ ! నాకేది మార్గమే ?

(చేతిలోని శుభలేఖ చూచి) అయ్యో ! నా ఆశ మొగ్గగానే రాలిపోతే ఎంత బాగుండును ! పెరిగి, వికసించి పరిమళించే టప్పుడా గిల్లేస్తావు ? విధీ ! ఎంత కఠినం నీ చర్య ! ... నన్నుకూడా గిల్లి పారెయ్యరాదా ? .... చిన్నప్పటినుంచీ ఎరిగివుండి, అతడంటే ఏదో హృదయంలో నెలవేర్పరచుకొన్న మిత్రుడ్ని విడనాడి.... పరిచయంలేని పరాయివాణ్ణి పెండ్లాడడం ఎంత ఘోరం. ఎంత దుఃఖకరం ! ... ఏనాడు మెడలో నుంచి కాసుల పేరు తీసానో ఆనాడే నా దురదృష్ట దినాలు ప్రారంభమయ్యాయి. మా అమ్మ నన్ను రోజూ వేధించుకు తింటున్నది. కాసుల పేరు దొంగల పాయ్యింది. వృధాగా పంతులుగారు ఖైదులో పడ్డారు. కుబేరయ్య పగ సాధిస్తున్నాడు. ..... ..... మా అన్నయ్యతో చెప్పి ఏమైనా చెయ్యాలనుకుంటే అతడు హఠాత్తుగా ఈ శూలాన్ని తెచ్చి నా హృదయం చీల్చేశాడు ! నా ఇష్టం కనుక్కోవద్దా ? అబ్బా ! ఈ బాధ భరించలేను...

(లేఖచూస్తూ) వివాహ మహోత్సవ మట ! మహోత్సవం, నాకిష్టం లేకుండా ! ఏదో ఒక చక్రానికి కట్టి జీవితయాత్ర సల్పమనే మహోత్సవం ఇది .... ఓహో ! ఇదెంత మూర్ఖసంఘం ! విద్యాధికుడైన మా అన్నయ్య ఇట్టి పని చేస్తాడనుకోలేదు. కన్నులు మూసికొని సంఘ దురాచారాల్ని అనుసరిస్తాడని తలంచలేదు. .... .... .... (మళ్ళీ లేఖ చూచి) 'శుభమస్తు' స్త్రీ బ్రతుకంటే యీ సంఘానికి యెంత వెటకారం ! ఎన్ని అశుభాలు శుభం పేరిట జరుగుతున్నాయో గదా.... ఏమైనాసరే ! .... .... నా కంఠంలో ప్రాణం ఉండగా, వెంకన్నను తప్ప పరాయి వాణ్ణి పెండ్లాడను, ఇది నా నిశ్చయం, తప్పితే ఆత్మహత్య ! ఆఁ ! (వణుకుతూ) ఆత్మహత్య ? వెంకన్నను ఆత్మహత్య నుండి తప్పించాను. నేనే దానికి గురి అవుతాను ? అయ్యో ! ... ... ఈ వివాహం తప్పదా ? శుభలేఖలు అచ్చయి పోయాయే ! పెండ్లి సన్నాహాలు జరుగుతున్నాయే ! వారం రోజులు కూడా లేదే ! ... ఈ శుభలేఖ చింపేస్తే పెండ్లి ఆగిపోదా ? ... వెంకన్నా ! నిన్ను యేనాడు చూసానో ఆనాడే నా హృదయం నాకు తెలియకుండానే నీకు నెలవిచ్చింది. నిన్ను ఉన్నతస్థితికి యెత్తడానికి ప్రయత్నించాను. నేను అధోగతికి పోతున్నాను... నన్ను జ్ఞాపకం పెట్టుకోగలవా ? నా జ్ఞాపకం నీకు దుఃఖం కలిగించదా ? ఆనాటి గిత్తదూడ బెదరడం, ఆనాటి గొబ్బి పాటలు, ఆనాటి ప్రియా లాపాలు ! ఆనాటి ఆటలూ, పాటలూ జ్ఞాపకం వచ్చి నీవు యెంత ఏడుస్తావో ! నా దారుణ మరణవార్త యీ హారంలో నీ కెక్కడున్నా వినిపిస్తుంది.... పెండ్లి ఆగడమో, మరణమో తప్పదు .... ముమ్మాటికీ తప్పదు.

సీత : (ప్రవేశించి) దండాలం దమ్మగారు ! (కన్నీరు తుడుచు కుంటుంది)

బాల : ఎవరే నీవు ?

సీత : సీతి నండి.

బాల : ఆఁ ! (తేరిచూచి) ఎంత మారిపోయావు ! ఎక్కడనుంచి ? అన్నట్లు వీరేశుని తీసుకు పోయావు కావూ ? పెండ్లి చేసు కున్నారటగా !

సీత : అయ్యోతల్లీ ! కాకినాడలో, ఇద్దరమూ చిలకా గోరింకల్లాగ బ్రతుకుతున్నామండి –

బాల : అదృష్టవంతులు –

సీత : ఏం అదృష్టం తల్లీ ! (కన్నీరు వొత్తుకుంటూ)

బాల : ఏం పాపం ? వీరేశేడి ?

సీత : ఓ దొంగోడు, ఓ కాసులపేరు దొబ్బుకొచ్చి మా మీద పారేసి పారిపోయాడండి – మమ్మల్ని పట్టుకుని ఆయన్ని ఖైదులో పెట్టారు తల్లీ ?

బాల : అయ్యో... అయితే ... ఆ దొంగ దొరికాడా ?

సీత : మొన్నే దొరికాడంట తల్లీ ? రేపో యెప్పుడో కేసు యిసారిత్తా రంట.

బాల : పంతులుగారి కేసుకూడా కదూ ?

సీత : ఔనంటండి – రెండూ ఒకే కేసంటండి – అమ్మా! ఒక యిశోసం యిన్నారా ? ఇప్పుడు మన డిప్టీ కలకటేరు దొరగారు మా యెంకన్న బాబే నండి !

బాల : (ఆశ్చర్యంతో) ఆఁ ?

సీత : ఔనండమ్మా; కొత్తగా ఈ మధ్యేఅయిందంటండి ఉద్యోగం – ఉపకారం జరుగుతాదండి.

బాల : మరి నీవు వెళ్ళి మాట్లాడలే ?

సీత : నాకు భయమేత్తుందం డమ్మా ? ... మీకు స్నేగంగా ?

బాల : ఏం స్నేహంలే, అంతా పోయింది.

సీత : ఎందుకు పోద్దండమ్మా ? .... మీకు ! యివాహంకూడా నంట.

బాల : కాదు, దినం.

సీత : అలా అనకండమ్మా ! పెండ్లి కుమారుడు మా వెంకన్న బాబుకి స్నేగమేనంట !

బాల : (ఉలిక్కిపడి) ఆఁ ! (విచారంతో వాలిపోతుంది)

సీత : ఏమండమ్మా ? అలా అయిపోయారు ?

బాల : .... .... ...

సీత : అమ్మగార్ని పిలవనాండి ?

బాల : వద్దు – (మెళ్ళో గొలుసు తీసి) ఇదిగో ఇది తీసికెళ్ళి అమ్ముకు తినండి.

సీత : వద్దండమ్మో ! ఇతర్ల సొమ్ము మాకొద్దు. ఇలాంటిదే మా కొంప తీసిందండమ్మో ? మా రెక్కా కాలు సుఖంగా వుండి, రేపు మీ పాలేరు యిదుదల అయి వొత్తే – బంగారంలాగ పనిచేసుకు బతుకుతాం –

బాల : భాగ్యవంతుల కంటే పేదలే నిజమైన సౌఖ్యవంతులు ! అన్నం లేకపోవచ్చు, ప్రేమానంధం మీరు స్వేచ్ఛగా అనుభవిస్తారు.

సీత : మీరు ?

బాల : మాకు స్వేచ్ఛ లేదు – బజారుమీది సరుకును దబ్బిచ్చి కొనుక్కుంటాం –

సీత : కాని మీ విషయం ...

బాల : నా విషయం రేపు వల్లకాట్లో –

సీత : అన్నీ అశుభాలే పలుకుతున్నారే !

బాల : నాకీ పెళ్ళి ఇష్టంలేదు !

సీత : బంగారంలాంటి అబ్బాయిగా రమ్మా !

బాల : తుమ్మెదకు పుష్పం కావాలిగాని, బంగారం కాదు –

సీత : మీ కన్నెవరిమీ దుందో ?

బాల : నీకు చెప్పితే ఏం లాభం ?

సీత : ఏమో ? సింగం – చిట్టెలుక కథ నాకు మీరు చెప్పిందే.

బాల : (సిగ్గుతో) మీ వెంకన్న –

సీత : (అదిరి పడి) అమ్మో ! కుదరదం డమ్మో , కుదరదు – మీరు గొప్ప కులపోరు.

బాల : ఏమిటి గొప్ప ? రాళ్ళలో రత్నాలు పుట్టవా ? రత్నాల్లో రాళ్ళు పుట్టవా?

సీత : అయినా – పై కొచ్చినవాణ్ని పై వాళ్ళు పై నుంచే ఎగరేసుకు పోతే, ఇక మాకు మిగిలే దేమిటం డమ్మా ?

బాల : (విషాదంగా నవ్వి) ఆ భయం నీ కక్కర్లేదే ! నేను మీ యింటికి వస్తాను, మీ పేటలోనే వుంటాను, సరా ?

సీత : (మౌనం)

బాల : వర్గ దృష్టిని కొంచెం సడలించుకొని, మానవతా దృష్టితో చూడమ్మా ఈ సమస్యను.

సీత : అదేదో నాకు తెలవదు కాని, ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?

బాల : నేను వెంకన్నను ప్రేమిస్తున్నట్లు పెండ్లికుమారుడు తెలుసుకోవాలి.

సీత : ఆ యిద్దరూ ఒక్కచోటే ఉన్నారమ్మా !

బాల : (ఆశ్చర్యచకితయై) ఆఁ ! ఒక్కచోటే ?.... ఒక్కచోటే ? అయితే ... వెళ్ళు, సీతమ్మా, వెళ్ళు, మీరు సుఖంగా బ్రతకండి. వెంకన్నకు నా పేరెప్పుడూ జ్ఞాపకం చెయ్యకేం ? వెళ్ళు.

సీత : (ఆలోచిస్తూ) అయ్యోతల్లీ ? మీ సుఖంకోసం నేనేమీ చెయ్యగలను? (నెమ్మదిగా పోతుంది)

బాల : ఈ ఆశ కూడా తీరిపోయింది - నన్ను తన స్నేహితుడు పెండ్లాడ్డం వెంకన్నకు ఇష్టమేగా ? అంటే అతనికి నాయందు ప్రేమ లేదన్నమాట? ఆత్మహత్య తప్పదు. రేపటితో నా జీవిత యాత్ర సరి - జలాధారంలేని ఓ జ్యేష్ఠమాసమా ? ఈ పుష్పాన్ని ఇక రాల్చేయి.

(పాట)

పైన మబ్బే లేదు, పైరుగాలే లేదు
మండు వేసవిలోన మాడిపోనేలా ?
రాలిపోవే మొగ్గ ? రాలిపోవమ్మా ?
ఇన్నాళ్ళు తన ప్రేమ కన్నీటిధారచే
నిన్ను పెంచినవాడు నిర్దయాత్మకు డయ్యె
ఏలనే బ్రతుకింక రాలిపోవమ్మా ?
లావణ్యమే పోయి జీవనంటే ఆరి
చీడపట్టి కృశించి చితికిపో నేలా ?
రాలిపోవే, నేడె రాలిపోవమ్మా ?

(విచారంగా బాల పడిపోతుంది - తెర)

## రంగం:20

(కాకినాడలో ఒక భాగం - డిప్యూటీ కలెక్టరు ఆఫీసు - రామం వెంకటేశ్వరరావు రెండు కుర్చీలలో కూర్చొని వున్నారు - సూట్లు ధరించి వున్నారు - (బుష్‌షర్టులు అయినా ఫరవాలేదు -) వెంకటేశ్వరరావు ముఖంలో నిస్పృహ కనిపిస్తూ వుంది.)

రా : నీ విషయం నా కేమీ అర్థం గావటంలేదు - నీవు కలెక్టరువైన సంతోషం మా కున్నంతగా నీకు లేదు - నీవు రోజూ రోజూ నీరసించి పోతున్నావు.

వెం : కలెక్టర్లు మాత్రం చిక్కిపోరా, గవర్నర్లు మాత్రం చచ్చిపోరా ?

రా : ఈ తీరమూ ఆ తీరమూ అందరికీ సమానమే - మధ్య జీవన యాత్రలోనే ఏ గాలి విసరినా, ఏ లంగరు అవసరమైనా - నీవు నీ ఆరోగ్యం గురించి శ్రద్ధతీసుకోవాలి.

వెం : నడిసముద్రంలో లంగరు ఏమి లాభం ? తెరచాప చినిగి, తెర కొయ్య విరిగి, చుక్కాని పట్టుతప్పిన తర్వాత ఇక చేతులు జోడించి కూర్చోవడమే -

రా : అది పూర్వకాలం - నేటి ప్రకృతి శాస్త్రవిజ్ఞానం, ప్రజ్ఞాశక్తి విజృంభణ, సర్వమానవ చైతన్యం లోకానికి భద్రత చేకూర్చుడం లేదా ? చేతులు జోడించుకు కూర్చోవడం అచేతన లక్షణం - చైతన్య వంతుడు సాధించలేని దేదీ లేదు -

వెం : తింటే అజీర్ణం, తినకుంటే నీరసం - (పెదవి విరుస్తాడు - బంట్రోతు ప్రవేశం - )

బం : సర్కార్ (విజిటింగ్ కార్డు యిస్తాడు.)

వెం : (చూచి) సుందరం ! (బంట్రోతుతో) తీసుకురా.

(బంట్రోతు నిష్క్రమిస్తాడు)

రా : నిన్ను ప్రత్యేకంగా ఆహ్వానించడానికి వచ్చి వుండవచ్చు.

వెం : నాకు ప్రత్యేకాహ్వానమా ? కాకిచేత కబురు చేస్తే నే వస్తానని సుందరానికి తెలుసు.

(సుందరం వస్తాడు - విష్ చేసుకుంటారు - బంట్రోతు కుర్చీతెచ్చి వేస్తాడు)

సుం : (కూర్చుంటూ) నాకు టైం లేదు - అర్జంటు పనులున్నాయి - మీరంతా కలిసే వస్తారా ?

వెం : నన్నూ రమ్మంటావా ?

సుం : ఇప్పుడు నేను వచ్చిందెందుకు ?

వెం : తప్పదంటే వస్తాను - ఆలోచించు -

రా : మొన్నటినుంచీ ఈ విషయమే ఇతడితో వాదిస్తున్నాను - తన వూరినీ తన కులాన్నీ తలచుకొని, తనకు తగిన మర్యాద జరగదని వాపోతున్నాడు -

సుం : దానికి నేనో వుపాయం ఆలోచించాను - నేను ప్రత్యేకంగా వచ్చిందే అందుకు - రైతు వాడ క్యాంపు వేసుకో - ఆ ప్రాంతాల నుంచి వచ్చిన కేసుల హియరింగ్ అక్కడ వెయ్యి - మామూలు కంటే వెయ్యి రెట్లు నీకు గౌరవం జరక్క పోయినప్పుడు నేను చూస్తాను.

రా : మేమూ అదే ఆలోచనకు వచ్చాం.

సుం : నీ కిం కేం భయం ? నా పలుకుబడి నీకు తెలుసుగా !

వెం : రామం చెప్పడానికి, నీవు నమ్మడానికి సరిపోయింది, నాకు భయమా? .... కాని, నే రాకపోతే మునిగిపోయిందేముంది ? నా ఆరోగ్యం...

సుం : నీవు వచ్చి తీరాలి. నీవు లేకపోతే మోజే లేదు.

రా : నీవు రాకపోతే అసలు పెళ్ళేలేదు -

సుం : కుబేరయ్య మన మీద కుట్రలు పన్నుతున్నాడు - మాష్టారి మీద కేసు

కేవలం కల్పితం – ఎంక్వైరీ వేసుకో – క్యాంపుకు మా బంగళా ఇస్తాం – సదుపాయంగా ఉంటుంది.

రా : మగ పెళ్ళివారికి విడిదికూడా అదే ....

సుం : మరీ బాగుంది... ఏమంటావు ?

రా : ఉద్యోగి అయిన తరువాత గంభీరత నేర్చుకున్నాడు - ఏమంటాడు ?

వెం : (నీరసంగా నవ్వి) ఏమంటాను ? మీ మాట ఎన్నడయినా కాదన్నానా! సరే.

సుం : సరే, నే వెళతాను – రామం : వెంకటేశ్వరరావును తీసుకొచ్చే బాధ్యత నీది. (అందరూ నవ్వుతూ లేస్తారు –)

వెం : ప్యూన్ :

బం : (ప్రవేశించి) సర్కార్ !

వెం : రైతు వాడకు క్యాంపుకు సిద్ధపడమని క్యాంపు గుమాస్తాకు చెప్పు, చాల జరూరు !

బం : చిత్తం, చిత్తం, (సుందరం, రామం, వెంకటేశ్వరరావు నిష్క్రమిస్తారు)

బం : (కుర్చీలు సర్దుతూ) హింత మంచి దొరవారు హెప్పుడూ రాలేదు మాకీ – మనిషి అంటే ఇలాగా వుండాల. తమ కింద నౌకర్లనీ హెంత మర్యాదా చేస్తార్ ! కొత్త దొరవార్ మహా సత్తా గలవార్ (పాటవలె కూనిరాగం తీస్తుంటాడు. అంతలో పాట వినిపిస్తుంది)

(పాట)

ఎవరిని అడిగితె సిగ్గౌతున్నది
ఏమని చెప్పుదు లోకులకు
మనిషే మనిషిని ఎవరని యడుగుట
మానవధర్మము కాదనుకోక – ॥ఎ॥

బం : అచ్ఛా ! అచ్ఛా

(పాట)

నరజన్మమునే యెత్తితి నేను

పెరిగితి నొక బానిసనై,

మనిషిగ పుట్టి, మనిషి కాళ్ళకే

మనుగడ బలి యిచ్చితిని – ॥ఎవ॥

బం : వహ్వా, వహ్వా ! అరే మనిషి ! దొడ్డిగుమ్మం కాడ వేంటి బే? అరే ! ఇదరావ్ ! (ప్రవేశం పుల్లయ్య, చేతిలో మూకుడు, కఱ్ఱ, భిక్షకుడై)

పుల్ల : బాబయ్యా ! ముష్టివాణ్ణి.

బం : అరే ముష్టివాడు ! లేదు నీకీ ?

పుల్ల : చిత్తం.

బం : ఏదీ పాడు –

పుల్ల : .......

కాలిక్రిందగల ఎండు కొమ్మనే

కట్టుకొంటి నొక గూడు

విరిగిన నాడైనా, ఆ పైగల

విరుల గొమ్మ గననైతి – ॥ఎవ॥

బం : బలే ! బలే !

పుల్ల : బాబయ్యా ! తమ దయ !

బం : ఏం దయ ? నహీఁ ఇది ఆఫీస్ !

పుల్ల : అయ్యో -

బం : కొత్త దొరవారు మంచివారు కారు, పో, బే ! ఇది ఆఫీసు.

పుల్ల : (నిట్టూర్చి) పరమేశ్వరా !

బం : ఛో, ఛో, పొమ్మంటూంటే !

పుల్ల : (చేతులు మోడుస్తాడు)

బం : (మీదికి పోయి) పోతావా , నాకీ చెయ్యి చేసుకోవాలా ?

(పుల్లయ్య నీరసంగా పోతాడు)

బం : హీడికీ దాచబెట్టా డిక్కడ ? మొగుడి సొమ్ము హుంది ఆఫీస్‌లో ?

(నిష్క్రమిస్తూవుంటాడు - తెర)

## రంగం:21

(రైతువాడలో డిప్యూటీ కలెక్టరు వెంకటేశ్వరరావు గారి క్యాంపు - సాయంకాలం - బంట్రోతులు హడావిడిగా తిరుగుతూ వున్నారు. అప్పుడు కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరు రైతులు ప్రవేశించారు)

మొదటి రైతు : కలగటేరు దొరగార్ని చూశావోయ్ !

రెండవ రైతు : ఆఁ - దూరాన్నుంచి - అయితే - ఆయన్ని ఎరుగుదువా, ఆ పుల్లడి కొడుకంట !

మొ. రై: ఆఁ ! ఆ పారిపోయిన యెంకడా ! ఛ - యెంకడు గారా ? ఛ....

రెం. రై: (నాలుక కరచుకొని) ఎవళ్ళయినా వింటారు.

మొ. రై: అలవాటుగా -

రెం. రై: మనవన్నీ దురలవాట్లేలే, మార్చుకోవాలి.

మొ. రై: ఎవరైతే ఏముందీ ! అదృష్టం -

రెం. రై: ప్రొద్దుటి కేసు చూశావూ! ఎంత పసందుగా నడిపించాడో !

మొ. రై: మరే, మరే, ఆహా, ఏం న్యాయం ! ఏం ధర్మబుద్ధి !

రెం. రై: ఔను - ఆ కుబేర్రావు చేత క్షమాపణ కోరించి, ఆ పంతుల్ని, వీరేశునీ ఖైదునుంచి విడిపించాడు.

మొ. రై: ఐనా ఆ కుబేర్రావుకి ఆ బుద్ధేమిటి ! పూరు అభిమానం ఉంచుకుని క్షమాపణతో విడిచిపెట్టాడుగాని - ఆ దుర్మార్గానికి మరో కలకటేరైతే - యేశేవాడే పదేళ్ళు.

రెం. రై: ఏ దెలాగైనా, అభిమానం ఎక్కడికి పోద్దోయ్ !

మొ. రై: మనిషంటే యెంకడే.... ఛ ! వెంకటేశ్వరరావుగారే మనిషి, వజ్రం తునక అంటే నమ్ము.

రెం. రై: తప్పకుండా - మాలో డని నమస్కారం పెట్టకుండా వుండేవు సమీ !

మొ. రై: ఎవరైతే నేమోయ్, మనకు పనిజరగడమే కావాలిగాని ! పద పద ! (పోతారు - వెనుక నుండి పెండ్లికొడుకు రామం ప్రవేశిస్తాడు)

రా : నా పెండ్లి విషయంలో వెంకటేశ్వరరావు ఎంత ఉదాసీనంగా వున్నాడు ! ఎంతో ఉత్సాహం ఇతర విషయాల్లో చూపుతూ, వివాహ సంభాషణ వచ్చేటప్పటికి చివుక్కుమంటున్నాడు - వన బాల అన్నగారితో, తల్లిగారితో పోరాడుతూ వున్నట్టు వార్త వచ్చింది. ఆమె వెంకటేశ్వరరావును ప్రేమిస్తూ వున్నదనటానికి ఈ కాసులపేరు కేసు ఒక ప్రత్యక్ష నిదర్శనం.

"బాల వెంకన్నని ప్రేమిస్తున్నది - మిత్రద్రోహానికి, స్త్రీ హత్యా పాతకానికి ఒడిగట్టుకోవద్దు" అని ఎవరో ఒక స్త్రీ ఆ చెట్లచాటు నుంచి నన్ను హెచ్చరించి

వెళ్ళింది. ఇదంతా ఏదో గారడీలాగ కనిపిస్తున్నది నాకు. ఈ సంగతి ముందే వెంకటేశ్వరరావు నాతో ఎందుకు చెప్పలేదు ? అతడు సిగ్గుపడి వుంటాడు, నిరాశతో ప్రేమకు నీళ్ళు వదులుకుని వుంటాడు – మరి సుందరం ?

బలవంతంగా ఈ పెండ్లి జరిగించడానికి చూస్తున్నాడా ? అతని మార్గంలో కులం అడ్డునిల్చి వుంటుందా ! తన చెల్లెలు ప్రేమ గాథ తనకు తెలిసి వుండదేమో ? లేకపోతే అంతటి విజ్ఞాన సంపన్నుడు ఈ అకార్యానికి పూనుకుంటాడా ? ఇప్పుడు నా కర్తవ్య మేమిటి ? ఈ బంధువులు ! ఈ సంబరాలు ! ఈ అట్టహాసం! .... (యోచించి) నా అడుగులు విప్లవ మార్గంలో పడుతున్నాయే ! ... సరే ... కాని..

(నిష్క్రమిస్తాడు)

## రంగం : 22

(అదే క్యాంపు సీను, బైట ఆవరణలో వెంకటేశ్వరరావు, ఉపకారి, వీరేశు, సీతమ్మ మాట్లాడుకొంటూ వున్నారు. వెంకటేశ్వరరావు ఆఫీసరు దుస్తులలో వున్నాడు. తక్కిన వారి దుస్తులు పూర్వం లాంటివే, కొంచెం మంచివి –)

వెం : పంతులుగారూ ! ఇదంతా మీ చలవ ! నా యీ అభివృద్ధికి కారకులలో మీరు ముఖ్యులు. మీ ఋణం తీర్చుకోలేను – ఇక నుండి మీరు మాతో వుండిపొమ్మని ప్రార్థిస్తున్నాను.

ఉప : అది స్వార్థం అవుతుంది. నీ వంటి కలెక్టర్లను ఎంత మందిని తయారు చెయ్యాలో నేను ఈ దళిత సంఘం నుండి !

వీరే : ఒకొక్క మాష్టరు ఒకొక్క కలకటేరుని తయారుచేసినా చాలు జాతి బాగుపడ్డానికి – కాని వెంకన్న బాబులా గుండాలి కదా ?

ఉప : వుండాలనే మనము కోరేది.

వీరే : ఉంటేనా మరి ! తస్సాదియ్యా ! చిటికలో జాతి ఆకాశం మీద నడవదూ ?

ఉప : ఒక్క కలక్టరే అన్న మాటేమిటి ? ఒక్కసారి బడిలో చేరిన వాడు కోరికను బట్టి, పట్టుదలను బట్టి ఇంజినీరు, డాక్టరు, ప్రొఫెసరు, లాయరు, జడ్జి ఏదైనా కావచ్చు – నియమాతిక్రమణ చేయ నక్కరలేదు, న్యాయం కలిగిస్తుంటే చాలు –

వీరే : గతాన్ని మరవకుండా వుంటే చాలండి, బాబు !

వెం : పిన్నీ ! నీవు వెళ్ళి వంటపనులు చూడు.

సీత : త్వరగా రండి, ప్రొద్దుగూక వచ్చింది (వెళ్ళుతుంది)

వెం : ఇక మా తండ్రిగార్ని వెతికించాలిగా !

ఉప : అన్వేషణ సాగుతూనే వుంది. నలు వైపులకూ కుర్రాళ్ళని పంపించాం –

వీరే : ఎందుకు ? నేను వెళ్ళి వెతుక్కువస్తాను. (వెళతాడు)

వెం : ఇక లేద్దాం, కుబేరయ్య గారింటికి వెళ్ళి రావాలి.

ఉప : ఇంత పొద్దుపోయా ? రేపు వెళ్ళవచ్చుగా ?

వెం : కాదు – మళ్ళీ పెళ్ళి హడావిడిలో పడతాం – ఆ యిల్లేగా, మీరుండండి – ప్యూన్ ? (పిలుస్తాడు)

ఉప : అయితే త్వరగా తెమల్చుకొని రండి – (నిష్క్రమిస్తాడు)

బం : (ప్రవేశించి) చిత్తం సర్కార్ –

వెం : (నడిచి) అదే కుబేర్రావు గారి ఇల్లు – ఇంట్లో వున్నారేమో చూడు –

బం : చిత్తం చిత్తం – (వెళ్ళి మళ్ళీ వచ్చి) ఉండింది సార్ ! వత్తుండారు సర్కార్ !

కుబే : (ప్రవేశిస్తాడు, వంగి నమస్కరిస్తూ)

వెం : నమస్కారమండి కామందుగారు ! నేను వెంకణ్ణి

కుబే : ఎంతమాట ! ఎంతమాట ! (చెంపలు వేసుకొని) మహాప్రభో ! నన్ను క్షమించండి – అపరాధిని – (మోకరించబోతాడు)

వెం : (ఆపి) పొరపాటు – నేను అనేక కారణాలవల్ల మీకుకృతజ్ఞుణ్ణి – పొరపాట్లు లేనివారు ప్రపంచములో లేరు – మీరు పెద్దలు – నన్ను మన్నించి ఆశీర్వదించండి –

కుబే : (మళ్లీ చంపలు వాయించుకుంటూ) ఎంతమాట – ఎంతమాట ! నేను ఎంత మూర్ఖుణ్ణి ! తమకు సప్లయిలన్నీ నేనే పంపించాను – నా కమతంలో తమ చేతి కడ్డులేదు !

బం : సర్కార్ ! మంచి పనసపళ్ళూ వుండాయి, సర్కార్ – హమ్మ ! హోమ్మ ! హింతింత, హంతంత, బడా అచ్చాపళ్ళు సర్కార్ !

వెం : నోరుముయ్ (కుబేరయ్యతో) నాకేమీ అక్కర్లేదు ! ఒక్క ఉపకారం మాత్రమే మిమ్మల్ని కోరుతున్నాను.

కుబే : ఏదైనా సరే – ప్రాణం కూడా తమకు అర్పిస్తాను.

వెం : మా తండ్రిగార్ని వెతికించాలి.

కుబే : (వణికిపోతూ) తమకు ద్రోహం చేశాను, గడ్డి తిన్నాను –

వెం : అది వేరు, ఎక్కడున్నాడో ఆరాతీయించండి – మా బంట్రోతు లెరగరు – లేకపోతే వీళ్ళనే పంపిద్దును.

కుబే : చిత్తం – చిత్తం – ఇప్పుడే పంపిస్తాను మనుషుల్ని – ఎందుకూ నేనే వెళతాను.

వెం : జరూరు సుమండీ – రేపు నేను వెళ్ళిపోవాలి.

కుబే : చిత్తం, చిత్తం – (వెళతాడు)

వెం : అబ్బ ! ఎంతలో చీకటిపడ్డది ! ప్యూన్ !

బం : సర్కార్ ! లైటు తెచ్చాను, సర్కార్ ! రండి సర్కార్ ! రండి !

వెం : పద – (బంట్రోతు ముందు, వెంకటేశ్వరరావు వెనుక నడుస్తూ వుంటారు – ఎవరో వ్యక్తి ముసుగుతో దారిలో నిలబడుతుంది. బంట్రోతు చూచి, వెనక్కి తగ్గి)

బం : ఎవరు బే ?

వ్యక్తి : .... .... ...

బం : ఖబడ్దార్ ! నీకి ... ఎవరూ ?

వ్య : .... .... ...

బం : (కంగారుగా, బిగ్గరగా) యెవరూ అంటే ?

వ్య : .... .... ...

బం : సర్కార్ ! దొంగ, సర్కార్ ! లేకపోతే సైతాన్, సర్కార్ సైతాన్ ! కోన్ హై ? బోలో !

వెం : (ముందుకు వచ్చి) యెవరమ్మా నీవు ?

వ్య : .... .... ...

వెం : చెప్పు ? చెప్పనిదాన వెందుకొచ్చావ్ ?

వ్య : చెప్పడం వల్ల లాభం లేదు.

వెం : అయ్యో ! ఏం ?

వ్య : నే నొక హతాశను.

వెం : నీ కథేమో చెప్పు ?

వ్య : రేపు తప్పకుండా తెలుస్తుంది. (నిష్క్రమిస్తుంది)

బం : హదీ సైతాన్ సర్కార్ !

వెం : నీవు కూడా వెళ్ళి .... ఆమెను కనిపెట్టు !

బం : హమ్మయ్యో ! (వణుకుతాడు)

వెం : కాదు, వెళ్ళవోయ్ !

బం : నాకీ వుద్యోగం ఊడపీకినా సరే, నాకీ హెళ్ళలేనండి, సర్కార్ !

వెం : పద, ఇదర్దరమూ వెళదాం (నడుస్తారు)

బం : అదుగో, సర్కార్ ! ఆ నూతి దగ్గర ఆగింది, సర్కార్ !

వెం : ఆc నూతిలో పడుతుందేమో ? పరుగెత్తవోయ్ –

బం : హమ్మయ్యో! (వణుకుతాడు మరీ)

వెం : అదిగో (ఒక శబ్దం) పడిపోయింది – పడిపోయింది – (ముందుకు దూకి నిష్క్రమిస్తాడు. బంట్రోతు ముందుకు వెళ్ళలేక, అక్కడ ఆగలేక, త్రొక్కులాడుతాడు, కొంచెం సేపటికి తడి బట్టలతో బాల నెత్తుకుని వెంకటేశ్వరరావు ప్రవేశిస్తాడు)

బం : సర్కార్ ! సర్కార్ ! (వణుకుతాడు)

వెం : (బాలను దింపి పడుకోబెట్టి) బాలా ! ఏమిటి ఈ అఘాయిత్యం?

బాల : (నీరసంగా) హతాశను.

వెం : పొరపాటు.

బాల : (కోపంతో) నన్నెందుకు రక్షించావు ?

వెం : నన్ను నీ వెందుకు రక్షించావు ? అందుకే -

రామం : (ప్రవేశించి) ఓహో ! నీవు రక్షించావా ఈమెను ? శుభం ఈమెనే కాదు, నన్ను కూడా రక్షించావు.

వెం : పెండ్లిపీటల మీద ఉండవలసిన వారు మీ కేమిటి గతి ?

రా : నా స్థానే నిన్ను కూర్చోపెట్టాలని.

వెం : ఏమి మాటలవి ?

రా : నిజం మాటలే - నా కంతా అర్థమయింది. నేను అన్ని ఏర్పాట్లు చేసే వచ్చాను. ఇంతలో ఈ అఘాయిత్యం జరిగింది - లెండిక !

వెం : నాకేమీ అర్థం కావడం లేదు.

బాల : (లేచి) మీ మిత్రుడికీ, ఆయన త్యాగానికీ నా వందనాలు.

రా : నీ ప్రేమకు నా నమస్కారా లమ్మా.

సుం : (ప్రవేశించి) ఏమి టిదంతా, చెల్లీ ?

వెం : 'కలయో వైష్ణవమాయయో' లాగున్నది నాకు.

రా : ఇదంతా నా పొరపాటు.

సుం : నా ఏమరుపాటు !

వెం : కాదు - నా గ్రహపాటు

సుం : ముగ్గురిదీ తప్పే ! యెట్టి అఘాయిత్యానికి ముగ్గురమూ కారణం అయ్యామో,

అట్టి శుభానికీ ముగ్గురమూ కారణం అవుతున్నాము. వెంకటేశ్వర్రావ్, నా చెల్లెలు బాలను నీవు స్వీకరించు –

రా : ఈమె నాకు కూడా చెల్లెలే – వెంకటేశ్వర్రావ్, యీామెను స్వీకరించు.

వెం : ..................

రా : పదండి – ముహూర్తం సమీపిస్తోంది –

సుం : పదండి

(ప్రవేశం – కుబేర్రావు పుల్లయ్యతో)

కుబే : నమస్కార మండి, తమ తండ్రిగారు.

వెం : నాన్నా ! నీ కొడుకు వెంకడు నీకు దండం పెడుతున్నాడు.

పుల్ల : (ఏడుస్తూ) నాయనా నువ్వేనా, నా తండ్రీ ! (కావలించు కుంటాడు)

## రంగం:23

(సుందరం వాళ్ళ భవన ఆవరణ – మంగళ తోరణాలతో అలంక రించబడి వుంది. కొత్త బట్టలు కట్టుకొన్న వీరేశు, సీతమ్మ చెరొకవైపు నుంచీ ప్రవేశించారు – ఆనందం వెల్లివిరుస్తున్న ముఖాలతో – )

వీరే : సీతీ ! అమ్మ ! ఎంత వైభోగంగా జరుగుతున్నదే పెళ్ళి !

సీత : మరే ! బ్రహ్మసమాజం పద్ధ తంట.

వీరే : కాదు గానీ, నువ్వేమనకపోతే, ఒక్కమాట చెప్పనా?

సీత : ఏం మాట ?

వీరే : ఏం అనవు గంద !

సీత : ఏమో - మాట వింటే గాని యెలా చెప్పగలను ?

వీరే : మన పెండ్లి మనవాళ్ళెవరైనా చూశారా ?

సీత : లేదు.

వీరే : అందుకనీ - మన కలగటేరుగారి పెళ్ళిలో ఆ బేపనాయనచేత రెండు గంటలు పెళ్ళి చెయ్యించుకుందామా ?

సీత : పోదూ - సిగ్గుకూడాను. అదిగో మంగళగీతం -

వీరే : ఫర్వాలేదు. రావే ! (సీతమ్మను లాగుకొని పోతాడు - అంత కొంతసేపటికి ఉత్సాహపూరితుడైన ఉపకారి ప్రవేశిస్తాడు.)

ఉప : ఓహో ! యెట్టి విప్లవాన్ని నా కండ్లార చూస్తున్నాను !

గీ॥ బాలసూర్యుడో వెంకటేశ్వర కుమారు
డనగ, వెలసె వివాహ మండపము నందు
నూతనోత్పుల్ల పద్యము రీతి బాల;
భారతీదేవి కిది నిండు పర్వదినము !

ఈ విప్లవములో ....

సీ॥ ఒక వైపున సనాతన కుల దివాంధులు
శపియించి నిప్పులు జల్లుచుండ
ఒకవైపు ప్రగతి కాముకులైన యువకులు
ప్రేమకాన్కలు సమర్పించుచుండ

ఒకవైపు భారతాభ్యుదయ నిరోధకుల్

నోటికత్తులు చాల నూరుచుండ

ఒకవైపు జాతి ఏకోన్ముఖ మగుచుండ,

దాస్య శృంఖలలు బ్రద్ధలగుచుండ,

కుటిల కులభేద కుడ్యాలు కూలద్రోసి

పూర్వవైభవ శిఖరాల బూజు దులుపి

తెలిసి, జాతి నిద్దుర లేచి, నిలిచి నడువ,

బాలఁ బెండ్లాడె వెంకటేశ్వరుడు నేడు !

ఈ వివాహాన్ని జరిపించిన సుందరం ధన్యుడు. రామం త్యాగం ఆదర్శప్రాయం ! వారి కుటుంబాలకు నా అభివందనాలు.

కులాంతర వివాహం ద్వారా ఒక ప్రక్క కులభేద కాలుష్యం నిర్మూలించండి. హైందవం ఏక జాతిగా శక్తివంతం కావడం జరిగింది - మరోప్రక్క బానిసలుగా అణగద్రొక్కబడి వున్న దళితుల బ్రతుకుల్లో విద్యాభాస్కరుడుదయించడం ద్వారా సమగ్ర దేశాభ్యుదయం వెల్లివిరిసింది. సమాజంలో ఈ ద్విముఖ విప్లవం అపూర్వం ! అద్వితీయం ఈ మహోదయంలో ఈ ప్రమేయం కూడ వుండడం నా అదృష్టం !

అయితే, సమ్యక్ సుందర సమ సమాజ నిర్మాణానికి ఇది ప్రారంభం మాత్రమే!

సీ॥ కూలిపేటలోని బాల బాలిక లెల్ల

విద్దె సుద్దులు నేర్చి వెలయు దాక

పంచ ప్రాణము లొక్క పరమాత్మ లో పలె

భారత మొక్కటై పరగుదాక

పంట భూములు జాతి పరమై తదా దాయ

మందరి కొకరీతి నందు దాక

గ్రామాల వెలుపలి మామూలు ఊరి మ

ధ్యకు చేరి సుఖముండు నంతదాక

అట్టి జాతీయ శుభకాల మరుగు దెంచు

దాక, తామెంత అధికార దాంతులైన గాని,

విజ్ఞులు బడుగు వర్గాల కొరకు

త్యాగములు చేయవలయును ధైర్య ప్రవృత్తి !

(ఎదటికి చూచి) నవ వధూవరులు బాల్య స్నేహంలో యౌవన మధువు లూరించుకొంటూ వెన్నెల్లోకి వస్తున్నారు ! ఇక, నాకిక్కడేం పని ?

(ఒక వైపునకు నిష్క్రమిస్తాడు – రెండో వైపునుంచి పెండ్లి కళతో పాడుకొంటూ బాల ప్రవేశిస్తుంది.)

బాల : (పాట)

నెల ఉదయించినదోయీ ! వె

న్నెల వెలయించిన దోయీ

నెంతో.... వెన్నెలతో... పు

వ్వులు వికసించిన వోయీ !

(వెంకటేశ్వరరావు పాడుతూ, మెల్లిగా ప్రవేశిస్తాడు!

వెం : (పాట)

కలువ పువ్వా విరిసె ? చెం

గలువ నవ్వా పిలిచె ?

ఎవరే వలచిరి నన్ను ?

ఎవరే పిలిచిరి నన్ను ?

(చూడనట్టు వెదుకుతాడు)

బాల : (పాట)

ఆశా సుమ వల్లికల, ఉ

య్యాలలు గట్టితి వోయీ !

హృదయ పీఠి నిన్నుంచి – ఊ

పించెద రావోయీ !

వెం : (పాట)

హాయిగా ఈ రేయిని .... నీ

ప్రాయమేనే ఆమని !

ఈ – తరుణ సుమ వన లీలా !

నీ – కరుణ కతమే బాలా !

(ఇద్దరూ కరగ్రహణ మొనర్చుకొని తిరుగతూ)

(పాట)

బాల : చీకటి గడిచె - చంద్రిక విరిసె

వెం : స్వేచ్ఛాజీవము వెలసె,

బాల : కులమా సమసె, కూరిమి నిలిచె

వెం : కుటిల దాస్యము పొలిచె !

ఇద్దరూ : (పాట)

సుందరముగ, ఆనందముగా

శోభాకరముగ జీవితము

పీయూషముగా గ్రోలుదమే !

ప్రేమారామము తేలుదమే !

(మెల్లి మెల్లిగా తెర జారుతుంది)

* * *